అనుదినం... జనస్వరం
నవతెలంగాణ
మంగళవారం 10-01-2023 సమగ్ర తెలుగు దినపత్రిక



కేరళ ఐద్వా జాతీయ మహాసభలో తెలంగాణ ప్రతినిధులు....

సంపుటి : 8 సంచిక : 326 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | www.navatelangana.com | 10 పేజీలు వెల : 6.50

బరితెగించారు

బ్రెజిల్‌లో జాతీయ కాంగ్రెస్, అధ్యక్షుడి ప్యాలెస్, సుప్రీంకోర్టులపై దాడి

- బోల్సొనారో మద్దతుదారుల అరాచకం
- అల్లర్లను ఖండించిన ప్రధాని మోడీ, జో బైడెన్





బ్రెసీలియా : బ్రెజిల్‌లో అధికారం కోసం బోల్సొనారో మద్దతుదారులు ప్రభుత్వ భవనాల ఆక్రమణ మొదలుపెట్టారు. మాజీ అధ్యక్షుడు జైర్ బోల్సొనారో మద్దతుదారులు ఏకంగా ఆ దేశ రాజధానిలోని కీలక భవనాలను ఆక్రమించారు. ఈ ఘటన యావత్ ప్రపంచాన్ని విస్మయానికి గురిచేసింది. 2021లో జనవరి 21న అమెరికాలో క్యాపిటల్ హౌస్‌పై జరిగిన అల్లర్లను ఇవి తలపిస్తున్నాయి. భద్రతా వైఫల్యం వల్లే ఈ ఘటన జరిగిందని బ్రెసీలియా గవర్నర్‌ను సుప్రీంకోర్టు సస్పెండ్ చేసింది. అల్లర్లకు పాల్పడినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలనీ, దాడులపై వెంటనే విచారణ చేపట్టాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. రాజధానిలో విధ్వంసం సృష్టించిన వారిని ఎట్టిపరిస్థితుల్లోనూ వదిలిపెట్టే ప్రసక్తి లేదని అధ్యక్షుడు లూలా స్పష్టం చేశారు. విధ్వంసకారులను మతోన్మాద నాజీలు, ఫాసిస్టులుగా అభివర్ణించారు. దాడులకు పాల్పడ్డవారిని న్యాయస్థానం ముందు నిలబెడతామని చెప్పారు. ఇటీవల జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో లూలా విజయంపై బోల్సొనారో అనుమానాలు వ్యక్తం చేశారు. మద్దతుదారులను రెచ్చగొడుతూ దాడికి ఉసిగొల్పారు. ఆ వెంటనే రాజధానిలో అల్లర్లు చోటుచేసుకున్నాయి.

ఇటీవల జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో బోల్సొనారో ఓటమిని అల్లరి మూకలు నిరాకరిస్తున్నాయి. సుప్రీంకోర్టు, కాంగ్రెస్, అధ్యక్ష భవనాల్లోకి చొచ్చుకెళ్లారు. గత వారమే దేశాధ్యక్షుడిగా లూయిజ్ ఇనాసియో లూలా ద సిల్వా అధికారం చేపట్టిన విషయం తెలిసిందే. దీనికి నిరసనగా ఆదివారం వేలాది మంది బోల్సొనారో మద్దతుదారులు భద్రతా వలయాలను ఛేధించుకొని కీలక భవనాల్లోకి చొరబడ్డారు. ఆ సమయంలో భవనాల్లో ఎవరూ లేరు. కొందరు ఆందోళనకారులు అక్కడి కిటికీలను, విలువైన సామగ్రిని ధ్వంసం చేశారు.

ఆ దేశ సుప్రీంకోర్టు, నేషనల్ కాంగ్రెస్, అధ్యక్ష భవనాలను దేశ అధికార కేంద్రాలుగా భావిస్తారు. ఈ చర్యతో సుప్రీంకోర్టు వద్ద భద్రతా దళాలు హెలికాప్టర్ల నుంచి టియర్ గ్యాస్‌ను ప్రయోగించాయి. అక్కడ అల్లర్లను కవర్ చేస్తున్న జర్నలిస్టులపై కూడా దుండగులు దాడులకు దిగారు. సైన్యం జోక్యం చేసుకొని బోల్సొనారోకు అధికారం అప్పజెప్పడంగానీ లేదా ప్రస్తుత అధ్యక్షుడు లూలాను అధికార పీఠం నుంచి దింపేయాలని ఆందోళనకారులు డిమాండ్ చేస్తున్నారు. దాదాపు మూడువేల మందకిపైగా అల్లరి మూకలు వీటిల్లో పాల్గొన్నట్టు అంచనావేస్తున్నారు. కొందరు ఆందోళనకారులు పోలీసులపై దాడులకు కూడా దిగారు. సమయం గడిచే కొద్దీ అల్లరి మూకల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. నేషనల్ కాంగ్రెస్ భవనం వద్ద పోలీసులు ఇప్పటికే 300 మందిని అరెస్టు చేశారు. గతంలో అమెరికా అధ్యక్ష ఎన్నికల సమయంలో జరిగిన అల్లర్లను ఈ ఘటనలు తలపిస్తున్నాయి.

అల్లరి మూకలను ఉసిగొల్పారు..

బ్రెజిల్‌లో అల్లర్లపై దేశాధ్యక్షుడు లూలా స్పందించారు. బోల్సొనారోనే అల్లరి మూకలను రెచ్చగొట్టారని పేర్కొన్నారు. ఆ మూకలను ...9లో


అభివాదం చేస్తున్న కేరళ సీఎం విజయన్

మతోన్మాదం- కార్పొరేట్ అనుబంధాన్ని
ప్రతిఘటిద్దాం..

- అన్ని వర్గాల మహిళలను చేరుకుందాం - మనువాదాన్ని ఓడిద్దాం: ఐద్వా 13వ జాతీయ మహాసభలో కేరళ సీఎం విజయన్ పిలుపు

తిరువనంతపురం: మోడీది హిట్లర్ వ్యూహమనీ, మతోన్మాదం కార్పొరేటు అనుబంధాన్ని ప్రతిఘటిద్దామని కేరళ సీఎం పినరయి విజయన్ పిలుపునిచ్చారు. ఐద్వా బహిరంగ సభకు నూతనంగా అధ్యక్షురాలిగా ఎన్నికైన పి.కె.శ్రీమతి అధ్యక్షత వహించారు.

కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ మాట్లాడుతూ మహిళలపై హింస పెరుగుతున్నా ఆ దోషులను కాపాడే సంస్కృతి మన దేశంలో ఉన్నదనీ, అలాంటి పితృస్వామ్య సమాజాన్ని మరింత బలోపేతం చేసేందుకు అధికార ఆర్ఎస్ఎస్ నేతృత్వంలోని బీజేపీ ప్రయత్నాలు చేస్తోందని తన ప్రారంభోపన్యాసంలో అన్నారు. 'సమానత్వం కోసం ఐక్యంగా పోరాడదాం' అనే నినాదంతో ఐద్వా మహాసభలు జరుగుతుంటే దీనికి వ్యతిరేకంగా ప్రజలను విభజించేందుకు బీజేపీ ప్రయత్నిస్తోంది. మహిళల భద్రత, లింగ సమానత్వాన్ని కేంద్ర ప్రభుత్వం తుంగలో తొక్కుతోంది. బిల్కిస్ బాను కేసులో జరిగిన సంఘటనే ఇందుకు నిదర్శనం. మత ప్రాతిపదికన పౌరసత్వాన్ని నిర్ణయిస్తూ ఒక వర్గం ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. మైనారిటీలను, కమ్యూనిస్టులను అంత మొందించాలన్న హిట్లర్ వ్యూహాన్ని ఇక్కడ ఆర్ఎస్ఎస్ అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నదన్నారు. ఈ విభజన రాజకీయాలు కేరళలో సాగనివ్వబోమని కేరళ ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం ఈ విధమైన వైఖరిని ...2లో

నారీ జన సంద్రం

ఐద్వా ముగింపు సభకు పోటెత్తిన మహిళలు

- కిక్కిరిసిన సభా ప్రాంగణం





నారీలోకం కదిలింది. సమానత్వ సాధనే లక్ష్యమని నినదించింది. వర్షపు చినుకులు వంకలై, వాగులై, నదులై సముద్రంలో కలిసినట్టు ఎక్కడికక్కడ చిన్న, చిన్న బందాలుగా బయలుదేరిన మహిళలు ఐద్వా జాతీయ మహాసభ ముగింపు సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభకు పోటెత్తారు. దీంతో బహిరంగ సభ జరిగిన మల్లు స్వరాజ్యం నగర్ (పుత్తరి కండం మైదానం) నారీ జన సముద్రంగా కనిపించింది. విద్యార్థులు, యువతులు, దినసరి కూలీలు, ఉద్యోగులు, గృహిణిలు ఇలా వివిధ తరగతులకు చెందిన మహిళలు బహిరంగసభలో భాగస్వాములయ్యారు. ఐద్వా జెండాలు ప్రదర్శిస్తూ మనువాదానికి, మతోన్మాదానికి వ్యతిరేకంగా చేసిన నినాదాలతో సభా ప్రాంగణం హోరెత్తింది. మతోన్మాదాన్ని ఓడించడం ద్వారానే సమానత్వం సాధ్యమవుతుందని, ఈ లక్ష్య సాధనకు సంఘటిత పోరు చేయాలని ముఖ్యఅతిథిగా హాజరైన కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ పిలుపునిచ్చారు. సోమవారం ఉదయం నుంచే తిరువనంతపురం నగరమంతా పండుగ వాతావరణం నెలకొంది. అన్ని వార్డుల్లోనూ ఉదయాన్నే పతాకావిష్కరణలు చేశారు. ఆ ప్రాంతంలోని మహిళలందరు అక్కడికే చేరుకుని ప్రదర్శనగా ...2లో



ఐద్వా నూతన కమిటీ ఎన్నిక

- జాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా పి.కె.శ్రీమతి, మరియం ధావలే, కోశాధికారిగా ఎస్.పుణ్యవతి.
- కేరళలో ముగిసిన ఐద్వా జాతీయ మహాసభలు
- ఐక్యంగా పోరాడదాం.. మతోన్మాదులను తరిమేద్దాం.. : వక్తలు

ఎం.సి.జోసఫీన్ నగర్ నుంచి సలీమా

ఐక్యంగా ఉద్యమిద్దాం- మతోన్మాదులను తరిమికొడదాం అంటూ నాయకులు మహాసభకు పిలుపునిచ్చారు. గత నాలుగు రోజుల నుంచి వామపక్ష ఉద్యమ కోట కేరళ రాష్ట్రం, తిరువనంతపురంలో జరుగుతున్న ఐద్వా 13వ జాతీయ మహాసభలు విజయవంతంగా ముగిశాయి. 104 మంది సభ్యులతో నూతన జాతీయ కమిటీ ఎన్నికైంది.

మరింత ధైర్యంగా పని చేయాలి...

గత మూడు మహాసభల నుంచి తొమ్మిదేండ్లుగా సుదీర్ఘ కాలంపాటు ఐద్వాకు సేవలందించిన ఆ సంఘం ...2లో

పార్టీకి ఉప్పల ఎనలేని కృషి

ఎన్నో నిర్బంధాలను తట్టుకుని సేవలు

- సీపీఐ(ఎం) కేంద్రకమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, రాజ్యసభ మాజీ సభ్యులు పెనుమల్లి మధు
- ఉప్పల కాంతారెడ్డి అంతిమయాత్రలో నివాళి



నవతెలంగాణ-మునగాల

సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు ఉప్పల కాంతారెడ్డి పార్టీ బలోపేతానికి ఎనలేని కృషి చేశారని, ఎన్నో నిర్బంధాలను తట్టుకుని నిలబడ్డారని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, రాజ్యసభ ...9లో

ఎస్ఐ, కానిస్టేబుల్
అభ్యర్థుల అరెస్ట్

చలో ప్రగతిభవన్ ఉద్రిక్తత

- నేడు రాష్ట్రవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు
- సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించాలి : పోరాట సమితి కో-ఆర్డినేషన్ కమిటీ డిమాండ్



నవతెలంగాణ- విలేకరులు

ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థుల సమస్యల పరిష్కారానికి నిర్వహించిన చలో ప్రగతిభవన్ విజయవంతమైంది. ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థుల సమస్యల పరిష్కార పోరాట సమితి ఇచ్చిన పిలుపులో భాగంగా సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా అభ్యర్థులు కదిలారు. అయితే, ఎక్కడికక్కడ ముందస్తు అరెస్టులు, నిర్బంధాలతో పోలీసులు అడ్డుకునేందుకు యత్నించినా కార్యక్రమం విజయవంతం అయిందని పోరాట సమితి నేతలు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా యువజన, విద్యార్థి సంఘాల నేతలను.. ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులను సుమారు 1000మందిని అరెస్టు చేశారు. అక్రమ అరెస్టులను నిరసిస్తూ మంగళవారం ...2లో




సర్పంచుల నిధులను
కొల్లగొడుతున్నారు

బీఆర్ఎస్ పార్టీని బొంద పెడితేనే పంచాయతీలకు పూర్వ వైభవం

- తండ్రీ, కొడుకులు రాష్ట్రాన్ని అధ్వాన్నంగా మార్చారు
- ప్రభుత్వ నిర్లక్ష్యంతో సర్పంచుల ఆత్మహత్యలు
- చనిపోయిన కుటుంబానికి రూ.కోటి పరిహారం ఇవ్వాలి: రేవంత్ రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

సర్పంచుల నిధులను, విధులను బీఆర్ఎస్ ప్రభుత్వం కొల్లగొడుతున్నదని టీపీసీసీ అధ్యక్షులు, ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి విమర్శించారు. ఆ పార్టీని బొందపెట్టి, ...9లో



వేతనాల్లో వివక్ష

నిర్మాణం, రియల్ ఎస్టేట్ రంగంలో

పురుషుల కన్నా 30 నుంచి 40 శాతం మహిళలకు తక్కువ

- నిర్మాణరంగంలో 5 కోట్ల మంది పురుషులు..70 లక్షల మంది మహిళలు
- బరువులెత్తే పనులు, ఇండ్ల నిర్మాణం, ఇటుక తయారీ, క్వారీల్లో ఉపాధి
- ప్రమాదకర పనుల్లో అత్యధికం మహిళలే : ప్రైమస్ పార్ట్‌నర్స్, వరల్డ్ ట్రేడ్ సెంటర్ నివేదిక





న్యూఢిల్లీ : భారత్‌లోని నిర్మాణ, రియలెస్టేట్ రంగంలో మహిళలపై వివక్ష తీవ్రస్థాయిలో ఉందని 'ప్రైమస్ పార్ట్‌నర్స్, వరల్డ్ ట్రేడ్ సెంటర్' నివేదిక ఆందోళన వ్యక్తం చేసింది. ఈ రంగంలో పురుషులకు అందుతున్న వేతనాలతో పోల్చితే 30 నుంచి 40శాతం తక్కువ వేతనాలు మహిళలకు ఇస్తున్నారని నివేదిక పేర్కొంది. వేతనాలు, ప్రాతినిధ్యంలో అంతరాలు తీవ్రస్థాయిలో ఉన్నాయని తెలిపింది. పరిశ్రమలో పనిచేస్తున్న మొత్తం ఉద్యోగుల్లో మహిళల సంఖ్య 12శాతానికి పరిమితమైందని తెలిపింది. మహిళల ప్రాతినిధ్యం పెరగడానికి, వివక్షను రూపుమాపడానికి నివేదిక కొన్ని సూచనలు చేసింది. సమాన ...9లో

19న ప్రధాని మోడీ రాక

రూ. 7 వేల కోట్ల ప్రాజెక్టులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు



- కేంద్రం ఇచ్చిన నిధులపై చర్చకు కేసీఆర్ సిద్ధమేనా?
- 8 నెలల్లో ఎప్పుడైనా ఎన్నికలు.. సన్నద్ధం కండి : బండి

వివరాలు 2లో..

ఆర్టీసీని ప్రయివేటుపరం చేయం

- రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్
- ఆర్టీసీ 'జీవా' వాటర్ బాటిళ్లను విడుదల చేసిన మంత్రి



వివరాలు 3లో..

నవతెలంగాణ

నవతెలంగాణపై స్పందన
ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదునుపెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, ఆజామాబాద్, ఆర్టీసీ కళ్యాణమండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.

బిజినెస్

ఐడీబీఐ బ్యాంక్‌పై విదేశీ సంస్థల ఆసక్తి

- స్వాధీనానికి బిడ్డింగ్‌లు • దీపమ్ సెక్రటరీ పాండే వెల్లడి



న్యూఢిల్లీ : లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ), కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యంలోని ఐడీబీఐ బ్యాంక్‌ను కొనుగోలు చేయడానికి విదేశీ పెట్టుబడిదారులు ఆసక్తి చూపుతున్నారని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ పబ్లిక్ అసెట్ మేనేజ్‌మెంట్ (దీపమ్) సెక్రటరీ తూహిన్ కాంత్ పాండే తెలిపారు. ఐడీబీఐ బ్యాంక్ విక్రయానికి దరఖాస్తులను స్వీకరించగా మంచి స్పందన వచ్చిందని ఆయన ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. దేశీయ సంస్థలే కాకుండా విదేశీ ఇన్వెస్టర్లు కూడా ఈ బ్యాంక్ స్వాధీనానికి పోటీ పడ్డారన్నారు. ఈ డాక్యూమెంట్లను ఆర్‌బిఐకి సమర్పించడం జరిగింద న్నారు. వాటాల విక్రయం తర్వాత కేంద్ర ప్రభుత్వానికి కనీస లేదా మైనారిటీ వాటానే ఉంటుందన్నారు. వాటాల విక్రయాన్ని వచ్చే ఆర్థిక సంవత్సరం 2023-24 ముగింపు నాటికి విక్రయ ప్రక్రియను పూర్తి చేయనున్నట్లు పాండే తెలిపారు. ఐడీబీఐ బ్యాంక్‌లోని మెజారిటీ 60.72 శాతం వాటాలను దేశ, విదేశీ కార్పొరేట్లకు విక్రయించాలని కేంద్రం నిర్ణయించింది.

కొచ్చర్ దంపతులకు బెయిల్



ముంబయి: వీడియోకాన్ గ్రూపు ఛైర్మన్‌తో కుమ్మక్కై నిబంధనలకు విరుద్ధంగా ఆ సంస్థకు భారీగా రుణాలిచ్చిన క్విడ్‌ప్రోకో కేసులో అరెస్ట్ అయినా ఐసీఐసీఐ బ్యాంక్ సీఈఓ చందా కొచ్చర్, ఆమె భర్త దీపక్ కొచ్చర్‌కు బెయిల్ లభించింది. బాంబే హైకోర్టు సోమవారం కొచ్చర్ దంపతులకు బెయిల్‌ను మంజూరు చేసింది. వారిని జైలు నుంచి విడుదల చేయాలని న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. చట్టానికి అనుగుణంగా కొచ్చర్ దంపతుల అరెస్టు జరగలేదని కోర్టు అభిప్రాయపడింది. 2022 డిసెంబరు 23న కొచ్చర్ దంపతులను సీబీఐ అరెస్ట్ చేయగా.. సీబీఐ న్యాయస్థానం జ్యుడిషియల్ కస్టడీ విధించింది. కాగా.. తమను అక్రమంగా అరెస్టు చేశారని.. బెయిల్ మంజూరు చేయాలని బాంబే హైకోర్టును ఆశ్రయించడంతో వారికి తాజాగా ఉపశమనం లభించింది.

నారీ జన సంద్రం

(మొదటిపేజీ తరువాయి)

మహాసభ ప్రాంగణానికి బయలుదేరారు. నగరంలోని అన్ని నివాస ప్రాంతాల్లోనూ ఈ తరహా కార్యక్రమాలు జరిగాయి. కేరళ సాంప్రదాయ రీతులను ప్రదర్శిస్తూ కళా రూపాలుగా ఈ ప్రదర్శనలు సాగాయి. ఆయుర్వేద కళాశాల నుండి ప్రారంభమైన ఒక ప్రదర్శనలో తెల్లటి డ్రస్సుపై ఎర్రటి కోటు ధరించిన 13 మంది మహిళలు సాంప్రదాయ డ్రమ్ములు వాయిస్తూ కనిపించారు. మరో 13 మంది యువతులు ఐద్వా జెండాలను ప్రదర్శిస్తూ మార్చ్ ఫాస్ట్ చేశారు. 13వ మహాసభకు గుర్తుగా వారు ఈ విన్యాసాన్ని ప్రదర్శించారు. ఇటువంటి దశ్యాలే తిరువనంతపురం నగరమంతా కనిపించాయి. ముగింపు సభలో లక్షమంది మహిళలు భాగస్వాములైనట్లు ఐద్వా ప్రకటించింది.

ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థుల అరెస్ట్

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్ర వ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు నిర్వహించాలని ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థుల సమస్యల పరిష్కార పోరాట సమితి పిలుపునిచ్చింది. ప్రగతి భవన్‌కు ర్యాలీగా తరలిన నేతలను హైదరాబాద్ నెక్లెస్ రోడ్‌లో అరెస్టు చేసి గోషామహల్ స్టేడియానికి తరలించారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డిజి.నర్సింహారావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈటీ నర్సింహా, తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్ గోషామహల్ స్టేడియానికి వెళ్లి అక్కడ యువజన, విద్యార్థి సంఘాల నేతలను, అభ్యర్థులను పరామర్శించారు. అరెస్టులను తీవ్రంగా ఖండించారు. పోలీస్ అభ్యర్థుల ఎంపిక పద్ధతిలో తప్పులను సవరించి న్యాయం జరిగేలా చూడాలని చేపట్టిన చలో ప్రగతిభవన్‌కు వెళ్లకుండా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఇల్లందులో యువజన, విద్యార్థి సంఘాల నేతలను పోలీసులు అడ్డుకున్నారు. అర్ధరాత్రి డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ నేతలు కాలంగి హరికృష్ణ, బయ్య అభిమన్యు, పరిటాల వేణు, హైమద్, గణేష్‌ను అరెస్టు చేశారు. దమ్మపేటలో ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి బత్తుల సాయి, ఏఐవైఎఫ్ దమ్మపేట మండల కార్యదర్శి సుంకు పాక ధర్మను ముందస్తుగా అరెస్టు చేశారు. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా డీవైఎఫ్ఐ, ఏఐవైఎఫ్ నాయకులను పోలీసులు తెల్లవారుజామునే అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరులో యూత్ కాంగ్రెస్ నాయకులను, మండల కేంద్రంలోని బస్టాండ్‌లో డీవైఎఫ్ఐ నాయకులను అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో చెన్న రాజేష్, బోనగిరి గణేష్,గాడిపల్లి ప్రశాంత్, పాసికంటి ఉదయ్ ఉన్నారు. సూర్యాపేట జిల్లా అర్వపల్లి మండలంలో పీడీఎస్‌యూ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు పోలేబోయిన కిరణ్‌కుమార్ ఉన్నారు. మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రశాంత్, నాయకులకు పోలీసులు అరెస్టు చేసి 2వ పట్టణ పోలీస్ స్టేషన్‌కి తరలించారు.

నారాయణపేట్‌లో ఎస్ఎఫ్ఐ నాయకులు శశికిరణ్, నరేష్, పవన్ కుమార్, వెంకటేష్, శ్రీనివాస్‌ను ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషనుకు తరలించారు. అచ్చంపేటలో జిల్లా అధ్యక్షులు వర్థం సైదులును అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కి తరలించారు.ఈ సందర్భం గా ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థుల సమస్యల పరిష్కార పోరాట సమితి కోఆర్డినేషన్ కమిటీ రాష్ట్ర బాధ్యులు కె.ధర్మేంద్ర, నిర్లకంటి శ్రీకాంత్, సత్య ప్రసాద్(ఏఐవైఎఫ్), అనగంటి వెంకటేష్, జావీద్ (డీవైఎఫ్ఐ), సలీంపాషా (వైజేఎస్), రెహ్మాన్, ఉదయ్(ఏఐఎస్ఎఫ్), నాగరాజు, అశోక్‌రెడ్డి, సునీల్ (ఎస్ఎఫ్ఐ), అరుణ్ కుమార్ (విజేఎస్), శ్రీకాంత్ (నిరుద్యోగ జాక్) మాట్లాడారు. తెలంగాణ స్టేట్ లెవెల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ (టీఎస్ఎల్‌పీఆర్‌బీ) వల్ల ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్ని రోజులుగా పోరాటాలు నిర్వహిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం అభ్యర్థుల పట్ల ఉదాసీనత చూపించకపోవడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థుల సమస్యల పరిష్కార పోరాట సమితి బాధ్యులను చర్చలకు పిలవాలని డిమాండ్ చేశారు. సత్వరమే ఉన్నత స్థాయి కమిటీని నియమించాలన్నారు. ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులు మనోధైర్యాన్ని కోల్పోవద్దని, పోరాటం చేసి సమస్యలను పరిష్కరించుకోవాలే తప్ప ఆత్మహత్య చేసుకోవద్దని సూచించారు.

రెండ్రోజుల పోలీసుల నిర్బంధంలో కోట



ఎస్ఐ, కానిస్టేబుల్ ఈవెంట్స్‌లో 800/1600 అర్హత సాధించిన వారందరికీ మెయిన్స్‌లో అవకాశం కల్పించాలనీ, కానిస్టేబుల్ పరీక్షలో ఏడు మార్కులు కలపాలని డిమాండ్‌చేస్తూ యువజన, విద్యార్థి సంఘాలు ప్రగతిభవన్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో నాయకులను పోలీసులు ముందస్తుగానే అరెస్టు చేశారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేశ్‌ను ఆదివారమే అదుపులోకి తీసుకుని సోమవారం సాయంత్రం విడుదల చేశారు. రెండు రోజుల పాటు పోలీసుల నిర్బంధంలోనే ఉన్నారు. పోలీసులు కనీస సౌకర్యాలు కూడా కల్పించలేదు. ముందస్తు అరెస్టుల పేరుతో ఇండ్లలోకి, ఆయా సంఘాల కార్యాల్లోకి పోలీసులు జొరబడి రాష్ట్ర స్థాయి నేతలను ఎక్కడికక్కడ అదుపులోకి తీసుకున్నారు. నాయకుల ఫోన్లను గుంజుకున్నారు.

మతోన్మాదం- కార్పొరేట్ అనుబంధాన్ని ప్రతిఘటిద్దాం..



(మొదటిపేజీ తరువాయి)

తీసుకున్నదని అన్నారు. మహాసభలో చర్చించిన ప్రతి అంశాన్ని ఆయన తన ప్రసంగంలో ప్రస్తావించారు. మహాసభలో ఎక్కువగా చర్చకు వచ్చిన కేరళ నమూనాను ఆయన క్లుప్తంగా వివరించారు. ద్రవ్యోల్బణం, నిరుద్యోగాన్ని నియంత్రించడానికి కేరళ ప్రత్యామ్నాయ నమూనాలను అవలంబిస్తోంది. సంక్షేమ పథకాలను ప్రభుత్వం స్వచ్ఛందంగా కాకుండా ప్రజల హక్కుగా చూస్తోంది. మహిళల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉన్నదన్నారు. జెండర్ బడ్జెట్‌ను అమలు చేసే రాష్ట్రం కేరళ అని, నవ కేరళం (న్యూ కేరళ) మా లక్ష్యం అని ఆయన అన్నారు.

మనువాద విధానాలను మహిళలు తిప్పికొడతారు...

ఐద్వా పూర్వ జాతీయ కార్యదర్శి బృందా కారత్ మాట్లాడుతూ హింసకు గురవుతున్న మహిళలను సైతం ఛీత్కరించే బీజేపీ నేతలు ఉన్న దేశంలో విక్టిమ్ షేమింగ్ అంటే ఏమిటో ఒక ముఖ్యమంత్రి లోతుగా అర్థం చేసుకోవడం గొప్ప విషయం అన్నారు. దానికి వ్యతిరేకంగా కేరళ ప్రభుత్వ తన వైఖరిని ప్రకటించండి. మహిళా పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ఐద్వా కట్టుబడి ఉందన్నారు. బీజేపీ మనువాద ఎజెండాలకు, పద్ధతులకు లొంగిపోవడానికి మహిళలు ఎప్పటికీ ఇష్టపడరు. సమానత్వం, ప్రజాస్వామ్యం, మహిళా విముక్తి వంటి విలువల కోసం పోరాడతామని ఆమె ఐద్వా అధ్యక్ష, కార్యదర్శులైన పి.కె.శ్రీమతి, మరియం ధావలేతో కలిసి వేదికపై నుంచి ప్రతిజ్ఞ చేశారు. పి.కె. శ్రీమతి మాట్లాడుతూ సమానత్వం సాధించాలంటే ప్రజాస్వామ్యం, లౌకికవాదం ఉండాలని అన్నారు. మతోన్మాద శక్తులపై పోరాటం ఉధృతం అయినప్పుడు మహిళలు ఆ పోరాటానికి అండగా నిలవాలని ఆమె కోరారు. మహిళా అనుకూల ప్రభుత్వంగా వున్న కేరళ మోడల్ దేశంలోని ప్రతిచోటా అనుకరించవచ్చని జనరల్ సెక్రెటరీ మరియం ధావలే అన్నారు. అన్ని వర్గాల మహిళలకు పోరాట సందేశాన్ని అందించడం, మనువాద ఎజెండాకు వ్యతిరేకంగా పోరాటాన్ని బలోపేతం చేయడం, మత-కార్పొరేట్ బంధాన్ని ప్రతిఘటించడం వంటి నినాదాలు ఈ మహాసభల ద్వారా లేవనెత్తుతున్నాయని ఆమె తెలిపారు.

ఐద్వా నూతన కమిటీ ఎన్నిక

(మొదటిపేజీ తరువాయి)


మల్లు లక్ష్మి | అరుణ జ్యోతి | పి.ప్రభావతి | ఎం. భారతి | ఆశాలత

సీనియర్ నాయకురాలు మాలినీభట్టాచార్య ఈ మహాసభల్లో అధ్యక్ష బాధ్యతలనుంచి రిలీవ్ అయ్యి ఉపాధ్యక్షులుగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధ్యక్షురాలిగా మాత్రమే రిలీవ్ అయ్యాననీ, బతికినంత కాలం ఐద్వాకు సేవలందిస్తానని అన్నారు.

ఐద్వా, కమిటీలోని తోటి కార్యకర్తల నుంచి ఎంతో నేర్చుకున్నానని దాన్ని జీవితాంతం ఆచరిస్తా అని అన్నారు. నూతన కమిటీ ముందు ఎన్నో సవాళ్ళు ఉన్నాయని, దేశం అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లో వుందన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో కమిటీ మరింత ధైర్యంతో, ఉత్సాహంతో పని చేయాల్సిన అవసరం వున్నదంటూ నూతన కమిటీకి అభినందనలు తెలియజేశారు.

ఓపికతో సేవలందించారు..

ప్రధాన కార్యదర్శి మరియం ధావలే మాట్లాడుతూ మాలినీభట్టాచార్య ఎంతో ఓపికతో సేవలందించారని తెలిపారు. ఐద్వా జాతీయ ఆఫీస్ బేరర్లను సమన్వయం చేసుకుంటూ.., కమిటీని నడిపారన్నారు. పొరపాట్లు చేస్తే సరిదిద్దారనీ, మంచి చేసినపుడు ప్రోత్సహించారని ఆమె ఎప్పటికీ ఐద్వాతోనే వుంటారని తెలిపారు.

సమానత్వానికై ఐక్యంగా పోరాడదాం

నూతన జాతీయ అధ్యక్షురాలిగా ఎన్నికైనా కేరళ రాష్ట్ర మాజీ మహిళా,శిశుసంక్షేమ శాఖ మంత్రి పి.కె.శ్రీమతి మాట్లాడుతూ టీం వర్క్ మన సంఘాన్ని ఇప్పటి వరకు ముందుకు నడిపిందనీ దీన్నే కొనసాగిస్తూ ఐద్వాను మరింత అభివృద్ధి చేద్దామన్నారు. ప్రస్తుతం దేశంలో ప్రజారాజ్యం, రాజ్యాంగం ప్రమాదంలో పడ్డాయనీ వాటిని కాపాడుకోవడం మన బాధ్యత అని నూతన కమిటీకి పిలుపు ఇచ్చారు. అనంతరం కేరళ రాష్ట్ర అధ్యక్షురాలు సుహన మహాసభ విజయవంతం చేసేందుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. నాలుగు రోజుల పాటు ప్రతినిధులకు అద్భుతమైన సేవలు అందించిన వాలింటీర్లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

నూతన కమిటీ

ఐద్వా 13వ జాతీయ మహాసభల 104 మందితో నూతన జాతీయ కమిటీని, 34 మందితో కార్యదర్శి వర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నది. తెలంగాణ నుంచి కార్యదర్శి వర్గంలోకి మల్లు లక్ష్మీ కమిటీ సభ్యులుగా అరుణజ్యోతి, ఎం.భారతి, పి.ప్రభావతి, అఖిల భారత కేంద్రం నుంచి ఆశాలత ఎన్నిక కాగా ఆంధ్రప్రదేశ్ నుంచి కార్యదర్శి వర్గంలోకి డి.రమాదేవి, కమిటీ సభ్యులుగా బి.ప్రభావతి, వి.సావిత్రి, ఎస్.అలివేలు ఎన్నికయ్యారు.

19న ప్రధాని మోడీ రాక

న్యూఢిల్లీ /నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

19న ప్రధాని మోడీ రాష్ట్రానికి రానున్నారు. తెలంగాణ పర్యటనలో రూ.7వేల కోట్ల ప్రాజెక్టు లకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. 19న ఉదయం 10 గంటలకు ప్రతిష్టాత్మక వందే భారత్ ట్రైన్‌కు పచ్చజెండా ఊపి ప్రారంభి స్తారు. అనంతరం రూ.699 కోట్లతో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ అభివృద్ధికి భూమిపూజ చేయనున్నారు. అనంతరం నేరుగా పరేడ్ గ్రౌండ్ కు చేరుకుని అక్కడ రూ.1,850 కోట్ల వ్యయంతో 150 కిలో మీటర్ల పొడవున నిర్మించనున్న మూడు జాతీయ రహదారి ప్రాజెక్టుల విస్తరణ పనులకు భూమిపూజ చేస్తారు. రూ.521 కోట్ల వ్యయంతో కాజీపేట్ లో నిర్మించనున్న రైల్ పీరియాడిక్ ఓవర్ హాలింగ్ వర్క్ షాపునకు' భూమిపూజ చేయనున్నారు. అనంతరం రూ.1,410 కోట్ల వ్యయంతో సికింద్రాబాద్-మహబూబ్‌నగర్ మధ్య 85 కిలో మీటర్ల పొడవున నిర్మించిన డబుల్ లైన్ జాతికి అంకితం చేయనున్నారు. ఐఐటీ హైదరాబాద్ నందు రూ.2,597 కోట్ల వ్యయంతో చేపట్టిన పలు నిర్మాణాలను ప్రధాని ప్రారంభించనున్నారు. అనంతరం పరేడ్ గ్రౌండ్ లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రజలనుద్దేశించి మోడీ ప్రసంగిస్తారు.

కేంద్రం ఇచ్చిన నిధులపై చర్చకు కేసీఆర్ సిద్ధమేనా

పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించేందుకు ఈ నెల 19న హైదరాబాద్‌కు వస్తున్న ప్రధాన మంత్రి నరేంద్రమోడీ పర్యటనను జయప్రదం చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, ఎంపీ బండి సంజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం హైదరాబాద్ సెంట్రల్ జిల్లా కార్యాలయంలో హైదరాబాద్, రంగారెడ్డి ఉమ్మడి జిల్లాల నేతలతో మోడీ పర్యటన ఏర్పాట్లపై సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. అందులో ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, మాజీ ఎమ్మెల్యేలు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, చింతల రామచంద్రారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్ కుమార్, రాష్ట్ర కార్యదర్శులు డాక్టర్ ప్రకాశ్ రెడ్డి, ఉమారాణి, హైదరాబాద్ సెంట్రల్, రంగారెడ్డి జిల్లాల అధ్యక్షులు గౌతమ్ రావు, బొక్క నర్సింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి మాట్లాడుతూ..కేంద్ర ప్రభుత్వం గ్రామపంచాయతీలకు నిధులను మంజూరు చేస్తే ఆయా నిధులను తస్కరించిన దొంగ ముఖ్యమంత్రి కేసీఆర్ అని ఆరోపించారు. ఈ విషయంలో సీఎం, పంచాయతీ రాజ్ శాఖ మంత్రితో సహా అధికారులపై నాన్ బెయిలెబుల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు జీతాలే సక్రమంగా ఇయ్యలేని వ్యక్తి రాష్ట్రాన్ని ఏవిధంగా అభివృద్ధి చేస్తారని ప్రశ్నించారు. తెలంగాణకు కేంద్రం ఇచ్చిన నిధులపై దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. బెంగాల్ తరహాలో తెలంగాణలో బీజేపీ కార్యకర్తలపై దాడులకు టీఆర్ఎస్ కుట్ర పన్నుతున్నదని ఆరోపించారు. రాష్ట్రంలో ఎనిమిది నెలల్లో ఎప్పుడైనా ఎన్నికలు రావొచ్చుననీ, భాగ్యనగర్ ప్రజలందర్నీ ఓటు బ్యాంకుగా మార్చుకునేలా సన్నద్ధం కావాలని సూచించారు.

మల్లారెడ్డికి ఆరు లక్షల రూపాయల రైతు బంధు : మాజీ ఎంపీ బూర

మంత్రి మల్లారెడ్డికి ఆరులక్షల రూపాయల రైతు బంధును రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్నదనీ, అలాంటి వ్యక్తులకు ఎందుకని రాష్ట్ర ప్రభుత్వాన్ని మాజీ ఎంపీ బూరనర్సయ్యగౌడ్ ప్రశ్నించారు. సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను టీఆర్ఎస్ సర్కారు సరిగ్గా అమలు చేయడం లేదని విమర్శించారు.

చెత్త నుంచి సంపద సృష్టి

నగరానికి నలువైపులా విద్యుత్ ప్లాంట్లు

- 100 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జీహెచ్ఎంసీ లక్ష్యం
- ట్రీట్మెంట్ డిస్పోజల్ తరహా వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్లు
- సంగారెడ్డి జిల్లా ప్యారానగర్‌లో 15 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్





నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ నగరంలో రోజువారీగా సేకరిస్తున్న చెత్తతో సంపద సృష్టికి వేగంగా అడుగులు పడుతున్నాయి.. చెత్తను నిల్వ ఉంచకుండా ట్రీట్మెంట్ డిస్పోజల్ తరహాలో వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్లు ఏర్పాటు చేసేందుకు జీహెచ్ఎంసీ విశేష కృషి చేస్తు న్నది. జీహెచ్ఎంసీ పరిధిలో చుట్టు పక్కల నగర పాలక సంస్థల్లో సేకరిస్తున్న వ్యర్థాలను మొత్తాన్నీ నిల్వ ఉంచకుండా డిస్పోజల్ చేసే వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నారు. ఈ ప్లాం ట్‌ల ద్వారా 100మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయా లని జీహెచ్ఎంసీ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ మేరకు తాజాగా ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చింది.

7వేల మెట్రిక్ టన్నుల చెత్త

జీహెచ్ఎంసీ, ఇతర నగర పాలక సంస్థల నుంచి సేకరిస్తున్న రోజు వారీ వ్యర్థాలు సుమారు 7000 నుంచి 7500 మెట్రిక్ టన్నులు. సేకరించిన చెత్తను నిల్వ ఉంచకుండా ట్రీట్మెంట్ డిస్పోజల్ చేసే ప్రక్రియకు అధికారులు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. తడి చెత్త ద్వారా కంపోస్టు ఎరువుగా మార్చడం, బయోగ్యాస్ తయారు చేయడం, ప్లాస్టిక్ రీసైక్లింగ్, పొడి చెత్తలో కాలే గుణం గల వ్యర్థాలను పోగుచేసి విద్యుత్ తయారీకి వినియోగిస్తారు. దీంతో చెత్త నుంచి సంపద సృష్టించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే జవహర్‌నగర్‌లో 19.5 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. దాన్ని 24 మెగావాట్స్‌కు పెంచారు. ఆ తర్వాత మరో 24 మెగావాట్లకు ప్రభుత్వం అనుమతి ఇవ్వడం జరిగింది. జవహర్‌నగర్‌లో మొత్తం 48 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ రెడీ అవుతోంది. ఆ పనులు కొనసాగుతున్నాయి. పాత 19.8 మెగావాట్‌ల ప్లాంట్ కోసం రోజుకు సుమారు 1300 టన్నుల నుంచి 1500 టన్నుల వ్యర్థాలు(ఆర్‌డీఎఫ్) ఉప యోగించుకుంటున్నారు. ఇప్పటి వరకు 6.35 లక్షల ఆర్‌డీఎఫ్(రిఫ్యూజ్ డెరివ్డ్ ఫ్యూల్)ను వినియోగించు కుని 225మెగా యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేశారు.

లక్ష్యం 100 మెగావాట్ల విద్యుత్

సేకరించిన చెత్తను వెనువెంటనే నిల్వ ఉంచుకోకుండా మొత్తాన్ని వినియోగించుకోవాలనేది జీహెచ్ఎంసీ ముఖ్య ఉద్దేశం. దుండిగల్‌లో 14.5 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ నిర్మాణం చేపట్టింది. అది మార్చి చివర వరకు పూర్తయ్యే అవకాశం ఉంది. ప్లాంట్‌లో ఉత్పత్తి ఆరంభిస్తే మరో 1000 నుంచి 1200 మెట్రిక్ టన్నుల చెత్త అవసరం ఉంటుంది.

సంగారెడ్డి జిల్లా ప్యారానగర్‌లో జీహెచ్ఎంసీ ద్వారా 15 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేయడం మూలంగా ఉత్తర ప్రాంతం నుంచి సేకరించిన చెత్త ప్యారానగర్ తరలించి విద్యుత్ తయారీకి రోజుకు సుమారు 800 నుంచి 1000 టన్నుల ఆర్‌డీఎఫ్‌ని వినియోగించుకోవడం జరుగుతుంది. బీబీనగర్‌లో 11 మెగావాట్ల వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్ నిర్మాణం పూర్తయింది. ఆ కంపెనీ యాజమాన్యం ఆర్థిక ఇబ్బందుల్లో ఉండటంతో ఆ సంస్థను వేరే సంస్థ ఆధ్వర్యంలో ఆ ప్లాంట్ పునరుద్ధరణకు చర్యలు చేపట్టారు. అది త్వరలో అందుబాటులోకి రానున్నది. ఈ ప్లాంట్ మూలంగా 800 నుంచి 900 వరకు చెత్తను వినియోగించుకునే వెసులుబాటు ఉంటుంది. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని యాచారంలో 12 మెగావాట్ల వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్ నిర్మాణం చేపట్టారు. అయితే 12 మెగావాట్ల సామర్థ్యం గల ప్లాంట్‌ను 14 మెగావాట్ల కెపాసిటీకి పెంచనున్నారు. అందుకు ప్రభుత్వ అనుమతి కూడా త్వరలో రానున్నది. గ్రేటర్ హైదరాబాద్‌తోపాటు చుట్టూ ఉన్న నగరపాలక సంస్థల్లో జనాభా పెరగడమే కాక దినదినాభివృద్ధి, విస్తరణ జరుగు తున్న క్రమంలో వ్యర్థాలు కూడా పెరిగే అవకాశం ఉన్నది. ఈ నేపథ్యంలో దానికి తగ్గట్టుగా వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్‌లు ఏర్పాటు చేసి రోజువారీ సేకరించిన చెత్త నిల్వ ఉండకుండా ట్రీట్మెంట్, డిస్పోసల్ ద్వారా మొత్తం చెత్తను వినియోగించాలన్నది ప్రధాన ఉద్దేశం. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్ల ద్వారా మొత్తం 100.5 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అయ్యే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

బీజేపీ నేతల విద్వేష ప్రసంగాలపై సీపీఐ(ఎం) నేతల పిటిషన్

మరో ధర్మాసనానికి బదిలీ



న్యూఢిల్లీ: కేంద్ర మంత్రి అను రాగ్ ఠాకూర్, బీజేపీ ఎంపీ ప్రవేశ్ వర్మ విద్వేష ప్రసంగాలపై సీపీఐ(ఎం) నేతలు బృందాకరత్, కెఎం తివారీ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీం కోర్టు మరో ధర్మాసనానికి బదిలీ చేసింది. షాహీన్‌బాగ్‌లో సీఏఏ వ్యతి రేక ఆందోళనపై ద్వేషపూరిత ప్రసంగాలు చేసినందుకు బీజేపీ నేతలు అనురాగ్ ఠాకూర్, ప్రవేశ్ వర్మపై నేరుగా ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి ట్రయల్ కోర్టు నిరాకరించడాన్ని సమర్థిస్తూ 2022 జూన్ 13న ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యురాలు బృందా కరత్, సీపీఐ(ఎం) ఢిల్లీ రాష్ట్ర కార్యదర్శి కెఎం తివారీలు సుప్రీంకోర్టులో సవాలు చేశారు. ఈ పిటిషన్‌ను సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎం.ఎం సుందరేష్‌లతో ధర్మాసనం సోమవారం విచారించింది. ద్వేషపూరిత ప్రసంగాలకు సంబం ధించిన పిటిషన్లు ఏ ధర్మాసనం ముందు పెండింగ్‌లో ఉన్నాయని ధర్మాసనం అడిగింది. జస్టిస్ కె.ఎం జోసెఫ్ నేతృత్వంలోని ధర్మాసనం ద్వేషపూరిత ప్రసంగాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను విచారిస్తున్నారని పిటిషనర్ల తరపున న్యాయవాది ధర్మాసనానికి తెలిపారు. దీనికి స్పందించిన ధర్మాసనం అయితే ఈ పిటిషన్ కూడా కె.ఎం జోసెఫ్ ధర్మాసనం ముందు విచారణకు పెడితే బాగుంటుందని పేర్కొంది. ప్రధాన న్యాయమూర్తి ఆదేశాలకు లోడి ఈ పిటిషన్ అదే ధర్మాసనం ముందు జాబితా చేయాలని ధర్మాసనం పేర్కొంది. మనది లౌకికదేశమని రాజ్యాంగం స్పష్టం చేసిందని పేర్కొంటూ జస్టిస్ జోసెఫ్, జస్టిస్ హృషీకేశ్ రాయ్‌లతో కూడిన ధర్మాసనం ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్‌లను ఫిర్యాదు చేసే వరకు వేచి ఉండకుండా ద్వేషపూరిత ప్రసంగాలు చేసే వారిపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశించింది.

తెలుగు రాష్ట్రాల మధ్య ఆస్తులు విభజనపై కేంద్రానికి, తెలంగాణకు సుప్రీం నోటీసులు

- ఈ సమస్యను త్వరగా పరిష్కరించాలి : ఏపీ ప్రభుత్వం

న్యూఢిల్లీ : తెలుగు రాష్ట్రాల ఉమ్మడి ఆస్తులు, అప్పుల విభజనపై ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై కేంద్ర ప్రభుత్వం, తెలంగాణకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ఏపీ, తెలంగాణ ఆస్తుల, అప్పుల విభజన వేగంగా చేయాలని ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎంఎం సుందరేశ్‌లతో కూడిన ధర్మాసనం సోమవారం విచారించింది. కోర్టు ఆదేశాల మేరకు పిటిషన్ కాపీలు ప్రతివాదులందరికీ అందజేశామని ఏపీ తరపు సీనియర్ న్యాయవాది విశ్వనాథన్ తెలిపారు. ఈ సమస్యను త్వరగా పరిష్కరించాలని కోరారు. విద్యుత్తు ఉద్యోగుల విభజన మాదిరిగా ఏకసభ్య కమిషన్ నియమించాలని విశ్వనాథన్ కోరారు. ఈ కేసులో ఆ విధంగా చేయలేమని ధర్మాసనం వ్యాఖ్యానించింది. విచారణకు తెలంగాణ, కేంద్రం తరపున న్యాయవాదులు హాజరు కాలేదు. దీంతో కేంద్రం, తెలంగాణకు నోటీసులు జారీ చేసిన ధర్మాసనం ఆరు వారాల్లో కౌంటరు దాఖలు చేయాలని పేర్కొంది. రిజాయిండర్ దాఖలుకు నాలుగు వారాలపాటు సమయం ఇచ్చింది.

ఓఆర్ఓపీ బకాయిలను మార్చి 15లోగా చెల్లించాలి

- కేంద్రానికి సుప్రీంకోర్టు ఆదేశాలు

న్యూఢిల్లీ : సాయుధ దళాల పింఛనుదారులకు 'వన్ ర్యాంక్ వన్ పెన్షన్' (ఓఆర్ఓపీ) పథకం కింద బకాయిలను మార్చి 15లోగా చెల్లించాలని కేంద్రాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్, జస్టిస్ పిఎస్ నరసింహలతో కూడిన ధర్మాసనం పిటిషన్‌ను సోమవారం విచారించింది. సాయుధ దళాల పింఛనుదారులకు అన్ని బకాయిలు త్వరితగతిన చెల్లించేలా చూడాలనీ, ఇకపై ఎలాంటి జాప్యం జరగకూడదని కేంద్రాన్ని ఆదేశించింది. ఓఆర్ఓపీ బకాయిల చెల్లింపుపై కేంద్రం తీసుకున్న ఏదైనా చర్య వల్ల తాము బాధపడ్డామని భావిస్తే, దరఖాస్తు చేసుకునేందుకు మాజీ సైనికుల సంఘానికి సుప్రీం కోర్టు స్వేచ్ఛనిచ్చింది.


కేంద్రం తరపున హాజరైన అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణి వాదనలు వినిపిస్తూ కంప్ట్రోలర్ జనరల్ ఆఫ్ డిఫెన్స్ అకౌంట్స్ (సీజీడీఏ) ద్వారా ట్యాబులేషన్ ప్రక్రియ పూర్తయిందనీ, ఇప్పుడు తుది ఆమోదం కోసం టేబుల్‌లను రక్షణ మంత్రిత్వ శాఖకు పంపామని అన్నారు. మార్చి 15 నాటికి సాయుధ దళాలకు చెందిన 25 లక్షల మంది పింఛనుదారుల ఖాతాల్లోకి డబ్బు చేరడం ప్రారంభిస్తుందని వెంకటరమణి తెలిపారు.సాయుధ దళాలకు చెందిన అర్హులైన పింఛనుదారులందరికీ ఓఆర్ఓపీ పథకం బకాయిల చెల్లింపు కోసం 2023 మార్చి 15 వరకు గడువును పొడిగించాలని కోరుతూ ప్రభుత్వం గత నెలలో సుప్రీంకోర్టును ఆశ్రయించింది. 2022 మార్చి 16 నాటి తీర్పుకు అనుగుణంగా గత ఏడాది జూన్‌లో తొలిసారిగా అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించి, మూడు నెలల పాటు గణించి చెల్లింపులు చేయాలని కోరిన తరువాత, బకాయిలు చెల్లించేందుకు కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఇచ్చిన రెండో పొడిగింపు ఇది.

విదేశాల్లో ఉన్న కుమార్తెతో మాట్లాడేందుకు అనుమతించండి

- సుప్రీంకోర్టును కోరిన గౌతమ్ నవ్లాఖా


న్యూఢిల్లీ: విదేశాల్లో ఉన్న తన కుమార్తెతో మాట్లాడేందుకు అనుమతించాలని సుప్రీంకోర్టును సామాజిక కార్యకర్త గౌతమ్ నవ్లాఖా కోరారు. దీనికి ఎన్ఐఏ స్పందనను సుప్రీంకోర్టు కోరింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కెఎం జోసెఫ్, జస్టిస్ బివి నాగరత్నలతో కూడిన ధర్మాసనం గౌతమ్ నవ్లాఖా హౌస్ అరెస్ట్ మధ్యంతర ఉత్తర్వులను ఫిబ్రవరి 17 వరకు పొడిగించింది. అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్ వి రాజు అందుబాటులో లేకపోవడంతో విచారణను వాయిదా వేసింది.

మెటా ఇండియాలో చేరిన వికాస్ పురోహిత్



న్యూఢిల్లీ: ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ ల మాతృసంస్థ మెటా ఇండియాలోని ఓ విభాగా నికి హెడ్‌గా వికాస్ పురోహిత్‌ను నియమించింది. మెటా ఇండియా గ్లోబల్ బిజినెస్ గ్రూపు డైరెక్టర్‌గా వికాస్‌ను ఎంపిక చేసినట్లు అధికారికంగా ప్రకటించింది. ఆయన స్ట్రాటజీ డెలివరీ విభాగాలకు ప్రాతినిధ్యం వహించనున్నారు. మెటాలో చేరక ముందు టాటా క్లిక్ సిఇఒగా వికాస్ సేవలందించారు. టాటా క్లిక్, అమెజాన్, రిలయన్స్ బ్రాండ్స్, ఆధిత్య బిర్లా గ్రూపు, టమ్మీ హిల్ ఫైగర్ వంటి సంస్థల్లో 20 ఏండ్లకు పైగా సీనియర్ బిజినెస్, సేల్స్ అండ్ మార్కెటింగ్ విభాగాల్లో కీలకంగా వ్యవహరించిన అనుభవం ఆయనకు ఉంది.

అమూల్ ఎండీ ఆర్ఎస్ సోదికి ఉద్వాసన



న్యూఢిల్లీ: పాలు, పాల పదార్థాల ను విక్రయించే అమూల్ కు చెందిన మాతృసంస్థ గుజరాత్ కోపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్ (జీసీఎంఎంఎఫ్) ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఆర్ఎస్ సోదిని అనుహ్యంగా తొలగిం చింది. తక్షణమే సోదిని ఆ హోదా నుంచి తప్పిస్తూ జీసీ ఎంఎంఎఫ్ బోర్డు మీటింగ్‌లో నిర్ణయం తీసుకున్నారు. సోమవారం నుంచే తాత్కాలిక మేనేజింగ్ డైరెక్టర్‌గా జయన్ మెహతాను నియామకానికి బోర్డు ఆమోదం తెలిపింది. ఈ క్రమంలో సోది కార్యాల యాన్ని సైతం సీల్ చేయడంతో అనేక అనుమానాలకు దారి తీస్తుంది. కాగా అనుహ్యంగా సోది తొలగింపు నకు గల కారణాలను ఫెడరేషన్ వెల్లడి ంచకపోవడం గమనార్హం.

రోడ్లు సరి చేయరు.... ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించరు



ప్రమాదాలకు డ్రైవర్లే బాధ్యులంటే ఎలా?

- డ్రైవర్లకు ఉరితాడులా మోటార్ వాహన చట్టం
- ఆర్టీసీని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉంది
- ట్రాన్స్‌పోర్టు కార్మికులకు సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలి
- ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.వీరయ్య, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్
- కరీంనగర్, సిరిసిల్ల, కామారెడ్డి, నిజామాబాద్‌లో సాగిన 'సంఘర్ష' యాత్ర

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి/ హుజూరాబాద్ / వేములవాడ / సిరిసిల్ల

"కేంద్రంలోని బీజేపీ సర్కారు తీసుకొచ్చిన మోటార్ వాహన చట్టం డ్రైవర్లకు ఉరితాడులా మారింది.. రోడ్లు బాగు చేయకుండా, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించకుండా ప్రమాదాలకు డ్రైవర్లనే బాధ్యులను చేయడం సరికాదు" అని ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షులు ఎస్.వీరయ్య, ప్రధాన కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్ అన్నారు. ట్రాన్స్‌పోర్ట్ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఆర్టీసీని పరిరక్షించాలని, ప్రతి మండల, జిల్లా కేంద్రంలో అడ్డా స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు.

ట్రాన్స్‌పోర్ట్ కార్మికుల సమస్యలపై చేపట్టిన 'సంఘర్ష' యాత్ర 9వ రోజుకు కరీంనగర్ జిల్లాలోని హుజూరాబాద్‌కు చేరుకుంది. అక్కడి నుంచి శంకరపట్నం మండల కేంద్రం మీదుగా అల్గునూర్, జిల్లా కేంద్రంలోని జడ్పీ కార్యాలయం వరకు వాహనాల ర్యాలీ నిర్వహించారు. మధ్యాహ్నం యాత్ర వేములవాడ, అక్కడి నుంచి సిరిసిల్లకు చేరుకుంది. ఆ తర్వాత ఎల్లారెడ్డి పేట, కామారెడ్డి మీదుగా రాత్రిక నిజామాబాద్‌కు చేరుకుంది. ఆయా ప్రాంతాల్లో జరిగిన సభల్లో వీరయ్య, పుప్పాల శ్రీకాంత్ మాట్లాడారు.



నిజామాబాద్‌లో...

ఉన్నత చదువులు ఉన్నా.. ఉద్యోగాలు దొరక్క రవాణా రంగంలో చాలా మంది స్వయం ఉపాధి పొందుతున్నారని తెలిపారు. నిత్యం ప్రమాదాలకు గురై వారి కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 15 ఏండ్లు గడిచినా వీవీగిరి నేషనల్ ఇనిస్టిట్యూట్ సంస్థ ఇచ్చిన నివేదికను ప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు. కేరళలోని వామపక్ష ప్రభుత్వం అక్కడ సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి కార్మికుల సంక్షేమానికి పాటుపడు తోందన్నారు. రాష్ట్రంలో కూడా ఆ తరహా సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మోటార్ వాహన చట్టం, రవాణా రంగాన్ని సరళీకరణ చేయడంతో ప్రమా దాల రేటు తగ్గకపోగా పెరుగుతోందన్నారు. పెనాల్టీలు, కేసులు లాంటి చర్యలతో ప్రమాదాలను తగ్గిస్తామని సర్కారు చెప్పటం ఒక బూటకమని అన్నారు. కార్మికులకు, ప్రజలకు నష్టం కలిగించే అనేక అంశాలు సవరణ చేయాలని డిమాండ్ చేశారు. అద్దె బస్సుల సంఖ్య పెంచుతూ ఆర్టీసీ ప్రయివే టుపరం చేస్తున్నారని, మనందరమూ ఆ సంస్థను పరిరక్షించుకోవాలని కోరారు. ఆర్టీసీలో 2019 నుంచి కార్మిక ఉద్యమంపై రాష్ట్ర సర్కారు ఆంక్షలు విధించి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాని కంటే తామేమీ తక్కువ కాదన్నట్టుగా వ్యవహరించిందని విమర్శించారు.

కామారెడ్డిలో..

కామారెడ్డి జిల్లా కేంద్రంలో సిరిసిల్ల రోడ్డు వద్ద యాత్రకు నాయకులు, కార్మికులు ఘన స్వాగతం పలికారు. అనంతరం నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చేరుకున్న యాత్రకు బోర్గాం వద్ద రవాణా రంగ కార్మికులు, సీఐటీయూ నాయకులు ఘన స్వాగతం పలికారు. బోర్గాం నుంచి వినాయక్‌నగర్ మీదుగా పులాంగ్ నుంచి కోర్టు చౌరస్తా, రైల్వేస్టేషన్ మీదుగా బస్టాండ్ వరకు కొనసాగింది.

కార్యక్రమంలో సీఐటీయూ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు ముకుందరెడ్డి, జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్, ఉపాధ్యక్షులు యు.శ్రీనివాస్, గుడికందుల సత్యం, ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ జిల్లా కార్యదర్శి చెలికాని శ్రీనివాస్, ఎస్‌డబ్ల్యూఎఫ్ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు రాజయ్య, కార్యదర్శి వీరగోని శ్రీనివాస్, ట్రాన్స్‌పోర్టు జిల్లా సహాయ కార్యదర్శి పుల్లెల మల్లయ్య, ట్రాన్స్‌పోర్టు రంగ కార్మికులు పాల్గొన్నారు.

ప్రభుత్వంతో కలిసి పనిచేయాలి

- ట్రిపుల్ ఐటీ వంటి విద్యాసంస్థల విద్యార్థులను కలుపుకుపోవాలి
- ఐటీ పరిశ్రమ ప్రతినిధులతో మంత్రి కేటీఆర్ సమావేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎమర్జింగ్ టెక్నాలజీ కంపెనీలు ఉద్యోగాల కల్పన విషయంలో ప్రభుత్వంతో కలిసి పని చేయాలని ఐటీ శాఖ మంత్రి కె.తారక రామారావు కోరారు. అదే విధంగా ఐటీ కంపెనీలు బాసర ట్రిపుల్ ఐటీ వంటి విద్యాసంస్థల విద్యార్థులను కలుపుకుపోవాలని సూచించారు. సోమవారం హైదరాబాద్‌లో ఐటీ పరిశ్రమ ప్రతినిధులతో మంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఐటీ రంగంలో ఉద్యోగాల కల్పన విషయంలో హైదరాబాద్ నగరం బెంగుళూరును అధిగమించిందని హర్షం వ్యక్తం చేశారు. దేశంలోని ఐటీ ఉద్యోగుల్లో 20 శాతం హైదరాబాద్ నుంచే పని చేస్తున్నారని తెలిపారు. ప్రపంచంలో అతి పెద్ద ఇన్నోవేషన్ టి హబ్, మహిళల కోసం ప్రత్యేకంగా వి హబ్ , తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ ఏర్పాటు చేశామనీ, త్వరలో దేశంలోనే అతి పెద్ద ప్రోటో టైప్ సెంటర్ టి వర్క్సను ప్రారంభించనున్నట్టు చెప్పారు. అంతరిక్ష పరిశోధనా సంస్థలు, స్టార్టప్స్‌తో హైదరాబాద్ ప్రత్యేకతను చాటుకుందన్నారు. ఆఫీస్ స్పేస్ విషయంలో హైదరాబాద్ నగరం బెంగుళూరును చాలా సార్లు అధిగమించిందని గుర్తు చేశారు. టాస్క్ ద్వారా ఏడు లక్షల మంది యువతకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇచ్చినట్టు తెలిపారు. పది లక్షల ఇండ్లకు ఇంటర్నెట్ సౌకర్యం కల్పించే టి.ఫైబర్ ఈ ఏడాది పూర్తవుతుందని వెల్లడించారు. ప్రభుత్వ సేవల్లో నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటున్నామని చెప్పారు. దేశంలో ఏ నగరంలో లేనట్టు త్వరలోనే హైదరాబాద్ నగరంలో సంపూర్ణ మురుగునీటి శుద్ధి వంద శాతం జరుగుతుందని తెలిపారు. రవాణా వ్యవస్థను బలోపేతం చేస్తూ, ఐటీ పరిశ్రమను ఇతర ప్రాంతాలకు విస్తరిస్తూ, మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు. హైదరాబాద్‌లో 300 కిలోమీటర్ల మేర సైక్లింగ్ ట్రాక్‌లను ఏర్పాటు చేసేందుకు జీహెచ్ఎంసీ ప్రయత్నిస్తున్నదని తెలిపారు.

ఆర్టీసీని ప్రయివేటుపరం చేయం

నవతెలంగాణ -సుల్తాన్ బజార్

టీఎస్ ఆర్టీసీ ప్రజల ఆస్తి అని, పేద, మధ్య తరగతి వాళ్ల వినియోగించే ఈ సంస్థను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రభుత్వం ప్రయివేటుపరం చేయబోదని రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో టీఎస్‌ఆర్టీసీ సొంత బ్రాండ్ 'జీవా' వాటర్ బాటిళ్లను సంస్థ చైర్మెన్ బాజిరెడ్డి గోవర్దన్, టీ.ఆర్అండ్‌బీ శాఖ కార్యదర్శి కె.ఎస్.శ్రీనివాసరాజు, ఆర్టీసీ ఎండీ వి.సి.సజ్జనార్‌తో కలిసి ఆయన లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం నీళ్లను రుచి చూశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రతి ఏటా టీఎస్‌ఆర్టీసీ 90 లక్షల లీటర్ల వాటర్ బాటిళ్లను బయట నుంచి కొని వినియోగించడం జరుగుతోందని, ఇక ఆ పరిస్థితి ఉండదన్నారు. టీఎస్‌ఆర్టీసీలో దాదాపు 50 వేల మంది సిబ్బందిని కాపాడుకోవాలనే ఉద్దేశంతోనే ప్రత్యామ్నాయ పద్ధతుల ద్వారా ఆదాయం పెంచుకోవాలని భావిస్తోందని చెప్పారు. సంస్థ ఎండీగా సజ్జనార్ బాధ్యతలు స్వీకరించిన తరువాత 20 నుంచి 25 డిపోలను లాభాల బాటలోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. రాబోయే రోజుల్లో అన్ని డిపోలు లాభాల్లోకి వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రతి రోజూ 9 వేల బస్సులు 33 లక్షల కిలోమీటర్లు తిరుగుతూ 30 లక్షల మందిని సురక్షితంగా గమ్యస్థానాలకు ఆర్టీసీ చేర్చుతోందని వివరించారు. టీఎస్‌ఆర్టీసీ సొంత బ్రాండ్‌తో మార్కెట్‌లోకి వస్తున్న స్వచ్ఛమైన తాగునీరు 'జీవా'ను ప్రజల ఆదరించాలని మంత్రి కోరారు.

టీఆర్అండ్‌బీ శాఖ కార్యదర్శి మాట్లాడుతూ.. తాగునీటి వ్యాపారంలోకి టీఎస్‌ఆర్టీసీ ప్రవేశించడం గొప్ప ఆలోచన అన్నారు. ఆర్టీసీ ఎండీ సజ్జనార్ మాట్లాడుతూ.. టీఎస్‌ఆర్టీసీకి రెవెన్యూ 96 శాతం టికెట్ల ద్వారానే వస్తోందన్నారు. గతంలో కన్నా ఆక్యుపెన్సీ రేటు ఇప్పుడు పెరిగిందని.. అయినా ఇంకా సాధించాల్సి ఉందన్నారు. అందుకే ప్రత్యామ్నాయ మార్గాల వైపు వెళ్తున్నామని తెలిపారు. కార్గో సేవల ద్వారా మూడేండ్లలో రూ.200 కోట్ల రాబడి వచ్చిందని.. 34 పెట్రోల్ బంకుల ద్వారా రోజుకు రూ.90 లక్షల బిజినెస్ నడుస్తోందని వెల్లడించారు. త్వరలోనే 250 ఎం.ఎల్, అర లీటర్ బాటిళ్లను మార్కెట్‌లోకి తీసుకొస్తామని చెప్పారు. టీఎస్‌ఆర్టీసీ వృద్ధికి సహకరిస్తున్న హన్సా ఈక్విటీ పార్ట్‌నర్ ఎల్‌ఎల్‌పీ త్రినాధ్‌బాబును అభినందించారు. జీవా వాటర్ బాటిళ్లను అందుబాటులోకి తీసుకురావడంలో తమవంతు కృషి చేసిన సంస్థ ఉన్నతాధికారులు ప్రస్తుత సి.పి.ఎం కృష్ణకాంత్, సి.టి.ఎం (ఎంఅండ్‌సి) విజయకుమార్, చీఫ్ స్ట్రాటజీ ఆఫీసర్ విప్లవ్, ఎస్.ఒ శ్రవంత్ తదితరులను సన్మానించి వారి సేవలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు ముని శేఖర్, పురుషోత్తం, యాదగిరి, వినోద్‌కుమార్, సీటీఎం జీవన్ ప్రసాద్, రేగుల సునీల్, రంగారెడ్డి, హైదరాబాద్ ఆర్ఎంలు శ్రీధర్, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యాలయం నిత్య నూతనంగా ఉండాలి

మంత్రి దయాకర్‌రావు

- ఈ నెల 12న మహబూబాబాద్‌లో సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

నవతెలంగాణ-మహబూబాబాద్

మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం నిత్య నూతనంగా ఉండాలని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మహబూబాబాద్ జిల్లాలో ఈ నెల 12న ముఖ్యమంత్రి కేసీఆర్ పర్యటించనున్న నేపథ్యంలో సోమవారం సాయంత్రం మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, ఎంపీ, పార్టీ జిల్లా అధ్యక్షులు మాలోత్ కవిత, ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్‌రావు, టీఆర్ఎస్ నాయకులు పార్టీ కార్యాలయాన్ని, కలెక్టరేట్‌ను పరిశీలించారు. మంత్రి దయాకర్ రావు దగ్గరుండి ఏర్పాట్లను పరిశీలించారు. పార్టీ కార్యా లయంలో కిటికీలు, తలుపులకు కర్టెన్ ఏర్పాటు చేయాలని వేదికపై పెద్ద ఫ్లెక్సీ ఏర్పాటు చేయాలని, ముఖ్యమైన వీవీపీలు మాత్రమే పార్టీ కార్యాలయానికి రావాలని సూచించారు. కార్పెట్లు, కుర్చీలు వేయాలని



మానుకోటలో టీఆర్ఎస్ కార్యాలయం వద్ద సీఎం ఏర్పాట్లు పరిశీలిస్తున్న మంత్రులు దయాకర్ రావు, సత్యవతి రాథోడ్, ఎంపీ కవిత, ఎమ్మెల్యే శంకర్ నాయక్, ఎమ్మెల్సీ రవీందర్రావు

సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని అన్నారు. మొత్తం కార్యాలయానికి, కలెక్టరేట్‌ను విద్యుద్దీపాలతో సుందరంగా తయారు చేయాలని సూచించారు. భద్రతా ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్‌కు పలు సూచనలు చేశారు. అధికారులందరూ ప్రధాన శాఖల సిబ్బంది, కార్యకర్తలు, నాయకులు అందరూ కలెక్టరేట్ వద్దనే ఉంటారని తెలిపారు. ప్రధానంగా వాష్ రూమ్‌లు పరిశుభ్రంగా ఉంచాలని సూచిం చారు. అనంతరం జిల్లా సమీకృత కలెక్టరేట్ భవ నాన్ని పరిశీలించారు. భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు అందు బాటులో ఉండాలని తెలిపారు. అలాగే సీఎం హెలీ ప్యాడ్ స్థలాన్ని నాలుగు చోట్ల అధికారులు పరిశీలిం చారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఆంగోతు బిందు, గ్రంథా లయ చైర్మెన్ గుడిపూడి నవీన్‌రావు, వన్యప్రాణుల సంరక్షణ డైరెక్టర్ బానోత్ రవికుమార్, జెడ్పీటీసీ బండి వెంకటరెడ్డి, పీఏసీఎస్ చైర్మెన్ మూల మధూకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పత్తికి రూ.10వేలు గిట్టుబాటు ధర కల్పించాలి

- కలెక్టరేట్ ఎదుట సీపీఐ(ఎం) ధర్నా



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

రైతులు పండించిన పత్తికి రూ.10వేలు గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఐ(ఎం) ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కలెక్టర్ స్పందించి నాయకులతో మాట్లాడారు. సీసీఐ అధికారులతో జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేయాలని మార్క్‌ఫెడ్ డైరెక్టర్ శ్రీనివాస్‌ను ఆదేశించారు. సీసీఐ అధికారులతో మాట్లాడి 11న సాయంత్రం 4గంటలకు జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేస్తున్నట్టు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ మాట్లాడుతూ.. జిల్లాలో మద్దతు ధర లేకపోవడంతో రైతులు పత్తిని అమ్ముకోకుండా ఇండ్లలో నిలువ చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యాపారులు, సీసీఐ అధికారులు కుమ్మక్కై, పత్తికి ధర కల్పించకపోవడంతో నిలువ చేసుకునే దుస్థితి ఏర్పడిందన్నారు.

దళారుల ఒత్తిడితో అమ్ముకోలేక ఇండ్లలో పెట్టి నిల్వ ఉంచుకోలేక ఆర్థికంగా నలిగిపోతున్నారని చెప్పారు. కేంద్రం వెంటనే సీసీఐని రంగంలోకి దించాలని డిమాండ్ చేశారు. పత్తికి క్వింటాలుకు రూ.10 వేలు కనీస మద్దతు ధరగా చెల్లించాలని కోరారు. బీజేపీ ప్రభుత్వం స్వామినాథన్ సిఫారసులను అమలు చేస్తామని చెప్పి బుకాయించిందని విమర్శించారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయ కుండా పత్తికి యేటా రూ.50 నుంచి 100కు పెంచుతూ రైతులను ఏమా ర్చడం శోచనీయమని అన్నారు. మహారాష్ట్రలో చెల్లిస్తున్న రేట్లను అధికా రుల దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికైనా కేంద్రం సీసీఐనీ రంగంలోకి దింపి కొ నుగోళ్లు చేపట్టాలని డిమాండ్ చేశారు. ధర్నాలో సీపీఐ(ఎం) జిల్లా కార్య దర్శివర్గ సభ్యులు లంక రాఘవులు, నాయకులు బండి దత్తాత్రి, అన్నమొల్ల కిరణ్, బొజ్జ ఆశన్న, ఆర్.సురేందర్, మామిడి స్వామి, ధోని వెంకన్న, ఆర్. మంజుల, పెర్క దేవిదాస్, సుమన్‌తాయి, దిలీప్, రైతులు పాల్గొన్నారు.

భూములు దక్కేదాకా పోరాడుదాం



తెలంగాణ వచ్చినా వలసదారులదే పెత్తనం

- ఆదివాసీ రాజ్యాంగం అమలు చేయాలి
- ఆదివాసీ పోరుగర్జనలో సుప్రీంకోర్టు న్యాయవాది శ్రీకాంత్ స్మిత

నవతెలంగాణ - వెంకటాపురం

ఏజెన్సీ భూములు గిరిజనుల హక్కని, తమ భూముల్లో తామంతా కూలీలుగా పని చేస్తున్నామని, తమ భూములు దక్కేవరకు ఆదివాసులందరూ ఐక్యంగా పోరాడాలని సుప్రీంకోర్టు న్యాయ్వాది శ్రీకాంత్ స్మిత పిలుపునిచ్చారు. సోమవారం ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలోని దేవస్థానం మైదానంలో ఆదివాసీ నవనిర్మాణ సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వాసం నాగరాజు అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో శ్రీకాంత్‌స్మీత పాల్గొని మాట్లాడారు. ఏజన్సీలో గిరిజనులు అడవిని నమ్ముకుని, ఆ ఉత్పత్తులే ఆధారంగా జీవనం సాగిస్తున్నారన్నారు. ఏజన్సీలోని ఖనిజసంపద, వనరులను వలస దారులు దోచుకుంటుంటే అడవులను రక్షిస్తున్న గిరిజనులను అక్రమదారులుగా పాలకులు ముద్రవేస్తున్నారని అన్నారు. వారిని అడవులనుంచి వెళ్లగొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగంలో గిరిజనులకోసం ఉన్న చట్టాలను పాలకులు అములు చేయాలన్నారు. అనంతరం ఏఎన్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు కోర్సా నర్సింహ మూర్తి మాట్లాడుతూ.. ఏజన్సీలో వలస గిరిజన నేతరుల చేతుల్లో ఉన్న భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. తెలం గాణ ప్రభుత్వం గిరిజనుల అభివృద్ధి కోసం ఏజన్సీలో ఏర్పాటు చేస్తున్న ఇసుక రీచ్‌ల్లో గిరిజనులు కూలీలుగా బతుకుతున్నారన్నారు. ఎండల్లో పనిచే స్తున్న గిరిజనులకు రూ.40 ఇస్తూ రేజింగ్ కాంట్రా క్టర్లకు రూ.140 కట్టబెడుతున్నారన్నారు. ఇసుక రీచ్‌ల్లో 50 శాతం గిరిజనులకు చెందేలా చూడాల న్నారు. ఏజన్సీలో గ్రామసభ్యులు ముఖ్యమని గ్రామసభల కోసం రేజింగ్ కాంట్రాక్టర్లు స్నేహ భావంగా ఉంటున్న గిరిజన ప్రజలను రెండుగా చీల్చుతున్నారని గుర్తు చేశారు. గిరిజనుల సమస్యల పరిష్కారానికి 45 రోజులుగా గిరిజన గ్రామాల్లో ఎఎన్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు కోర్సా నర్సింహ మూర్తి ఆధ్వర్యంలో పర్యటించినట్టు తెలిపారు. గిరిజన చట్టాలను వారికి తెలిసే విధంగా అవగా హన కల్పించేందుకు సభ ఏర్పాటు చేయడం మంచి పరిణామమని రిటైర్డ్ జాయింట్ కలెక్టర్ వీరమల్లు అన్నారు. గిరిజన చట్టాల పై నాయకులు ముద్దరాజు వీరభద్రం, న్యాయవాది ఆనంద్ వివరించారు. అంతకుముందు కొమరంభీం విగ్రహం నుంచి సభాస్థలి వరకు ఆదివాసీ సాంప్రదాయ కొమ్ము నృత్యా లతో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్ర మంలో ఆదివాసీ లాయర్ల సంఘం న్యాయవాది పాపారావు, సున్నం రమేష్, చింత సమ్మయ్య, ఆదివాసీ నాయకులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా రవాణా వ్యవస్థను కాపాడుకుందాం

ఆర్టీసీ ఎండీ సజ్జనార్

నవతెలంగాణ- ముషీరాబాద్

ప్రజారవాణా వ్యవస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి మీదా ఉన్నదని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ అన్నారు. తెలంగాణ ఆర్టీసీ అద్దె బస్సు యజమానుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర డైరీని సోమవారం హైదరాబాద్‌లోని ఆర్టీసీ కళ్యాణ మండపంలో చైర్మెన్ బాజిరెడ్డి గోవర్ధన్, ఎండీ వీసీ సజ్జనార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. త్వరలోనే అద్దె బస్సుల యజమానులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఆర్టీసీకి వారితో సంబంధాలను మరింత మెరుగుపరచడానికి, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. ఆర్టీసీకి 30 శాతం అద్దె బస్సులు సేవలందిస్తున్నాయని తెలిపారు. రాబోయే సంక్రాంతికి ప్రయాణికులకు మెరుగైన సేవలందించి సంస్థ అభివృద్ధికి దోహదపడాలని సూచించారు. తెలంగాణ ఆర్టీసీ అద్దె బస్సు యజమానుల సంక్షేమ సంఘం అధ్యక్షులు అబ్బ మధుకర్ రెడ్డి, వి.మహిపాల్ రెడ్డి మాట్లాడారు. పల్లె వెలుగు సర్వీసులో నడుస్తున్న ఆర్టీసీ అద్దె బస్సులకు సంస్థ చెల్లించే అద్దెలో కిలోమీటర్‌కు రూపాయి తగ్గించకూడదని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు మునిశేఖర్, పురుషోత్తం నాయక్, వినోద్ కుమార్, సంఘం గౌరవ అధ్యక్షులు లక్కం ప్రభాకర్, ట్రెజరర్ సత్యంబాబు, అడిషనల్ సెక్రటరీ రామకష్టారెడ్డి, బస్ బాడీ బిల్డర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఏ.శ్రీనివాస్, టాటా మోటార్స్ ప్రతినిధి ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.

కాసాని ఆధ్వర్యంలో నేడు ఛండీయాగం

నవతెలంగాణ-హైదరాబాద్

రాష్ట్రంలో తెలుగుదేశం భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని కోరుతూ ఆ పార్టీ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ దశ మహా విద్యాపూర్వక నవ ఛండీయాగ మహోత్సవం నిర్వహిస్తున్నారు. మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు చేపట్టనున్నారు. తెలుగు ప్రజలకు శుభం కలగాలంటూ ప్రత్యేక పూజలు చేయనున్నారు. ఎన్టీఆర్‌భవన్‌లో ఈ యాగం జరగనుంది. దీనికి సంబంధించిన ఏర్పాట్లను సోమవారం కాసాని జ్ఞానేశ్వర్ స్వయంగా పరిశీలించనున్నారు. ఈ యాగంలో కాసాని కుటుంబ సభ్యులతోపాటు టీడీపీ సీనియర్ నాయకులు, ఇతరులు పాల్గొననున్నారు. తెలుగు రాష్ట్రాల్లో టీడీపీకి ఉన్న అవరోధాలు తొలగిపోవాలని కోరుకుంటూ ఛండీయాగం నిర్వహిస్తున్నట్టు కాసాని సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఎన్టీఆర్ వర్థంతి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు.

ఉరేసుకొని రైతు ఆత్మహత్య

- సాగునీటి కోసం బోర్లు వేసి అప్పుల పాలు

నవతెలంగాణ-లింగంపేట్

పంట పండించేందుకు సాగునీటి వసతి లేక బోర్లు వేయించగా.. అవి పడకపోవడంతో అప్పుల పాలై తీవ్ర మనస్తాపానికి గురై ఉరేసుకొని రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన కామారెడ్డి జిల్లా లింగంపేట్ మండలం బోనాల గ్రామంలో సోమవారం వెలుగుజూసింది. ఎస్ఐ శంకర్ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కప్ప సంగయ్య (45)కు గ్రామ సమీపంలో 1.20 ఎకరాల భూమి ఉంది. ఇందులో పంట సాగు చేసుకోవడానికి సాగునీరు లేకపోవడంతో గతేడాది అప్పులు చేసి మూడు బోర్లు వేశారు. అయినా నీళ్లు పడలేవు. ఒక్క బోరులో కొంచెం నీరు రావడంతో బోరు మోటర్ బిగించి పైప్ లైన్లు బిగించారు.

హాస్టల్ డైలీవేజ్ కార్మికుల జీతాలు వెంటనే చెల్లించాలి

- ఇవ్వకుంటే పండుగ తర్వాత కూడా సమ్మె కొనసాగిస్తాం: సీఐటీయూ జిల్లా నాయకులు ఎర్రా శ్రీకాంత్, వై.విక్రమ్



నవతెలంగాణ- ఖమ్మం

మూడేండ్లుగా రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించకపోతే సం క్రాంతి పండుగ అనంతరం ఏక్షణానైనా నిరవధిక సమ్మె చేస్తామని సీఐటీయూ జిల్లా నాయకులు ఎర్రా శ్రీకాంత్, వై.విక్రమ్ హెచ్చరించారు. మూడేండ్లుగా తమకు రావాల్సిన జీతాలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ గిరిజన ఆశ్రమ పాఠశాలలు హాస్టల్ డైలీవేజ్ అండ్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో సోమవారం ఖమ్మంనగరంలోని ఎన్ఎస్టీ రోడ్‌లోని లేడీస్ హాస్టల్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఒక నెల జీతం రాకపోతేనే తీవ్ర ఆర్థిక ఇబ్బందులూ పడే పరిస్థితిల్లో మూడేండ్ల జీతాలు ఇవ్వకపోతే వారు ఎంతో దుర్భరమైన జీవితం అనుభవిస్తున్నారన్నారు. జీతాలకు సంబంధించిన చెక్ ఫైనాన్స్ అనుమతి కోసం ఉందని కొంతకాలంగా అధికారులు చెబుతూ కార్మికులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. వెంటనే పెండింగ్‌లో ఉన్న బకాయిలను విడుదల చేయకపోతే సంక్రాంతి పండుగ అనంతరం సమ్మె చేస్తామని హెచ్చరించారు. అనంతరం సీఐటీయూ నేతలతో డీడీ చర్చలు జరిపారు. కార్యక్రమంలో నాయకులు బోడపట్ల సుదర్శన్, కాంపాటి వెంకన్న, బాదావత్ లక్మా, మల్లికార్జున్, జె.వెంకన్న బాబు, ప్రవీణ్, పి.వాసు, సంతోష్, లక్ష్మి దేవి, వీరమ్మ, మోహన్ పాల్గొన్నారు.

సంపాదకీయం

విదేశీ గుప్పెట్లో ఉన్నత విద్య

నూతన విద్యా విధానం ఎంతటి ప్రమాదకరమైనదో విదేశీ విశ్వవిద్యాలయాలను భారత్‌లోకి ఆహ్వానిస్తూ మోడీ సర్కార్ ఇటీవల విడుదల చేసిన ముసాయిదా పత్రం మరోసారి తేటతెల్లం చేసింది. అంతర్జాతీయంగా ప్రఖ్యాతిగాంచిన విశ్వవిద్యాలయాలు భారత్‌లో తమ విద్యా సంస్థలను ఏర్పాటు చేసుకునేందుకు ఫీజులు, అడ్మిషన్లపై

> దేశంలోని చాలా సామాజిక తరగతులకు ఉన్నత విద్య ఇప్పటికీ ఎండమావిగానే ఉంటోంది. అణగారిన, ఆదివాసీ తరగతుల్లో ఇప్పుడిప్పుడే తొలి తరం విశ్వవిద్యాలయాల మెట్లు ఎక్కుతోంది. ఈ దశలో విద్యా కార్పొరేటీకరణతో విదేశీ శక్తుల గుప్పిట్లోకి విద్యా వ్యవస్థ వెళ్లిపోతే సామాన్యులకు ఉన్నత విద్య పగటికలగా మిగిలిపోతోంది. ఇప్పటికే విద్యారంగంలో ఉన్న అసమానతలను మరింత పెంచే ఈ విధానాన్ని, దీనికి మూలమైన నూతన విద్యా విధానాన్ని ప్రజలంతా ఐక్యంగా తిప్పికొట్టాలి.

నియంత్రణ ఎత్తివేస్తున్నాం రండహో అంటూ విశ్వవిద్యాలయ గ్రాంట్ల సంఘం (యుజిసి) ముసాయిదా మార్గదర్శకాలను విడుదల చేసింది. ఉన్నత విద్యను విదేశీ శక్తులకు కట్టబెట్టే ప్రయత్నాలు వాస్తవానికి 1990 నుంచే మొదలయ్యాయి. విదేశీ విశ్వవిద్యాలయాలను భారత్‌లోకి ఆహ్వానించేందుకు సంబంధించిన బిల్లు 1995లో పార్లమెంటులో ప్రవేశపెట్టిన తొలిసారే విమర్శలు వెల్లువెత్తడంతో వెనక్కిపోయింది. 2005-06లోనూ ప్రయత్నాలు జరగ్గా కేబినెట్ దశలోనే ఉపసంహరించుకోవాల్సివచ్చింది. ఆ తర్వాత యూపీఏ 2 అధికారంలో ఉన్నప్పుడు ఇలాంటి ప్రయత్నమే జరిగితే వామపక్షాలు తిప్పికొట్టాయి. విదేశీ విశ్వవిద్యాలయాల ప్రవేశాన్ని అప్పట్లో బీజేపీకి కూడా వ్యతిరేకించింది. ఇప్పుడు అదే బీజేపీ విదేశీ విశ్వవిద్యాలయాలకు ఎర్ర తివాచి పరిచి స్వాగతిస్తుండటం దాని ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనం.



విద్యార్థుల ప్రవేశాల ప్రక్రియ మొదలుకొని ఫీజులు ప్రతిదీ మీ ఇష్టం మీరు ఎలా చెబితే అలా... అంటూ అపరిమిత స్వేచ్ఛ కల్పిస్తామంటోంది. అంతేకాదు ఇక్కడ ఆర్జించిన మొత్తాన్ని మొత్తం మీరు తీసుకెళ్లిపోవచ్చు అంటూ మోడీ సర్కార్ బంపర్ బోనాంజా ఆఫర్ ప్రకటించింది. ఇది దేశంలోని ఉన్నత విద్యను మొత్తం విదేశీ కార్పొరేట్ శక్తుల గుప్పెట్లో పెట్టడం తప్ప మరొకటి కాదు. అంతర్జాతీయంగా ప్రతిష్టాత్మక సంస్థలనే ఆహ్వానిస్తున్నామని ఇప్పుడు చెబుతున్నా..వాస్తవంలో ఇక్కడి విద్యారంగాన్ని దండుకునేందుకు విదేశీ విద్యా సంస్థలు గద్దల్లా వాలిపోవడం ఖాయం.

శస్త్ర చికిత్సలకు, టెస్ట్‌ట్యూబ్ బేబీలకు, క్లోనింగ్ ఇలా ప్రతిదానికీ మనమే ఆద్యులమని, భారత్ విశ్వగురు అని ఇతిహాసాలను శాస్త్రీయ పరిణామాలుగా పేర్కొంటూ మూఢత్వాన్ని ప్రజల్లోకి చొప్పించే మోడీ సర్కార్... ఇప్పుడు అదే 'విశ్వగురు'కు విదేశీ విశ్వవిద్యాలయాల అవసరమేమొచ్చిందో చెప్పాలి. ఒకే దేశం... ఒకే కార్డు, ఒకే దేశం ఒకే భాష, ఒకే దేశం ఒకే ఎన్నిక అంటూ ఒకవైపు ప్రజాస్వామ్య వ్యవస్థను ఏకీకృత నియంత్రత్వంపై లాక్కెళ్తున్న మోడీ సర్కార్‌కు మరో వైపు లార్డ్ మెకాలే తరహాలో విదేశీ విద్యపై మమకారం పుట్టుకురావడంలో ఆంతర్యమేమిటో!

దేశ నిర్మాణంలో విద్య ఎంతో కీలక పాత్ర వహిస్తుంది. ప్రాథమిక విద్య మొదలుకొని విశ్వవిద్యాలయ చదువు వరకూ మనదేశంలో పరిస్థితులకు అనుగుణంగా సాగాల్సిందే. భారత్ లాంటి దేశాల్లో సాంఘిక శాస్త్రాలే కాకుండా జీవశాస్త్రం, ఇంజనీరింగ్ వంటి సైన్స్ చదువులు సైతం స్థానిక జీవన పరిస్థితులకు అనుగుణంగా ఉండాలని, అప్పుడే ఫలితాలు దక్కుతాయని ప్రఖ్యాత శాస్త్రవేత్త జెడి బెర్నాల్డ్ విద్యా ప్రపంచీకరణ తొలినాళ్లలోనే సెలవిచ్చారు. విదేశీ విశ్వవిద్యాలయాలు భారత పరిస్థితులకు పొసగవని విద్యారంగ నిపుణులు తేల్చిచెబుతున్నారు.

అటువంటి వైవిధ్యమైన పరిస్థితులున్న భారతావనిలో విదేశీ విద్యాసంస్థలకు ఎర్ర తివాచి పరిచి ఎటువంటి నియంత్రణలు లేకుండా ప్రవేశాల ప్రక్రియ, ఫీజులు వాటి ఇష్టానికి వదిలేస్తే దేశంలో ఉన్నత విద్యారంగం విదేశీ శక్తుల పరం చేయడమే అవుతుంది. విద్యా కాషాయీకరణ, కార్పొరేటీకరణ, కేంద్రీకరణ మూడు లక్ష్యాలతో నూతన విద్యా విధానాన్ని మోడీ సర్కార్ బలవంతంగా రుద్దుతోంది. అందులో భాగంగానే ఇప్పుడు తెరపైకి విదేశీ విశ్వవిద్యాలయాలను తీసుకొస్తోంది. ప్రభుత్వ రంగంలోని విశ్వవిద్యాలయాలను బలోపేతం చేసి పరిశోధనలకు, అధ్యయనాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన కేంద్ర ప్రభుత్వం పూర్తిగా చేతులు దులిపేసుకునేందుకే ఈ 'విదేశీ విశ్వవిద్యాలయాలు' పేరుతో పన్నాగానికి పాల్పడుతోంది. దేశంలోని చాలా సామాజిక తరగతులకు ఉన్నత విద్య ఇప్పటికీ ఎండమావిగానే ఉంటోంది. అణగారిన, ఆదివాసీ తరగతుల్లో ఇప్పుడిప్పుడే తొలి తరం విశ్వవిద్యాలయాల మెట్లు ఎక్కుతోంది. ఈ దశలో విద్యా కార్పొరేటీకరణతో విదేశీ శక్తుల గుప్పిట్లోకి విద్యా వ్యవస్థ వెళ్లిపోతే సామాన్యులకు ఉన్నత విద్య పగటికలగా మిగిలిపోతోంది. ఇప్పటికే విద్యారంగంలో ఉన్న అసమానతలను మరింత పెంచే ఈ విధానాన్ని, దీనికి మూలమైన నూతన విద్యా విధానాన్ని ప్రజలంతా ఐక్యంగా తిప్పికొట్టాలి.

విదేశీ చెల్లింపుల లోటు - కమ్ముకుంటున్న కారుమేఘాలు

భారత దేశపు విదేశీ చెల్లింపుల ఖాతాలో లోటు 2022 జులై-సెప్టెంబర్ త్రైమాసికానికి 36.4 బిలియన్ల డాలర్లకు చేరింది. ఇది మన జిడిపిలో 4.4 శాతం. గత తొమ్మిది సంవత్సరాలలో ఇదే అత్యధిక లోటు. 2012 అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికంలో 32.6 బిలియన్ల లోటు ఉంది. అది అప్పటి మన జిడిపిలో 6.7 శాతం. 2022 ఏప్రిల్-జూన్ కాలానికి 18.2 బిలియన్లు (జీడీపీలో 2.2శాతం) ఉన్న లోటు ఆ తర్వాత త్రైమాసికానికి రెట్టింపు అయిపోయింది. అదే ఏడాది క్రితం చూస్తే, 2021 జులై-సెప్టెంబర్ కాలంలో 9.7 బిలియన్లు (జీడీపీలో 1.3శాతం) ఉన్న లోటు ఏడాది తిరిగేసరికి మూడు రెట్లు కన్నా ఎక్కువగా పెరిగింది.



ప్రభాత్‌పట్నాయక్

విదేశీ వ్యాపార చెల్లింపులో లోటు పరిమాణం పెరిగిపోవడం ఒక్కటే సమస్య కాదు. ఈ విషయంలో ఆందోళన చెందవలసిన అంశాలు ఇతరత్రా కూడా ఉన్నాయి. గత త్రైమాసికానికన్నా ఈ మూడు నెలల కాలంలో ఒక్కసారి ఏకంగా 18.2 బిలియన్లు పెరిగిపోవడం వెనక ప్రధాన కారణం సరుకుల వ్యాపారంలో పెరిగిపోయిన లోటు. అంటే మనం దిగుమతి చేసుకునే సరుకులకు చెల్లించవలసినదాని కన్నా ఎగుమతుల ద్వారా ఆర్జించినది ఈ మూడు నెలల్లోనే 18.2 బిలియన్ల మేరకు తక్కువగా ఉందన్నమాట. సరుకుల ఎగుమతుల విలువకు, దిగుమతుల విలువకు మధ్య తేడా 63 బిలియన్ల నుండి 83.5 బిలియన్లకు పెరిగింది. ఉక్రెయిన్ యుద్ధం కారణంగా చమురు ధరలు పెరిగిపోయినందువలన మనం దిగుమతి చేసుకునే ముడి చమురు బిల్లు పెరిగిపోయింది. ఇది మొదటి కారణం. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మొత్తంగానే మందగించినందు వలన మన ఎగుమతులు మరీ చప్పబడిపోయి తగ్గిపోయాయి. దీనివలన ఎగుమతుల ద్వారా రావలసిన ఆదాయం తగ్గింది. ఇది రెండో కారణం.

> నయా ఉదారవాద పెట్టుబడిదారీ విధానం ఎటువంటి చిక్కుల వలలో ఇరుక్కుపోయివుందో ప్రస్తుత పరిస్థితి సూచిస్తోంది. పశ్చిమ దేశాల సామ్రాజ్యవాద ఆధిపత్యానికి తీవ్రమైన సవాళ్ళు ఎదురవుతున్నాయి. ఈ నయా ఉదారవాద చట్రం నుండి బైటపడడానికి అవకాశాలు పెరుగుతున్నాయని ఈ పరిస్థితి సూచిస్తోంది. అటువంటి అవకాశం వచ్చినప్పుడే మన దేశం దానిని అందిపుచ్చుకోగలగాలి. కాని మన ప్రభుత్వం ఆ దిశగా ప్రయత్నించడం పోయి నయా ఉదారవాద విధానాలనే అంటకాగుతోంది. అప్పులు చేసి మరీ కార్పొరేట్లకు బెయిల్ ఔట్ ప్యాకేజీలు అందిస్తోంది. ఈ వైఖరి కారణంగా మన దేశం ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభం రానున్న కాలంలో మరింత ముదిరిపోయే ప్రమాదం ఉంది.


రూపాయి డాలరుతో పోల్చితే బలహీనపడిపోవడం ముఖ్యకారణం అని కొందరు ఆర్థికరంగ వ్యాఖ్యాతలు అంటున్నారు. ఈ వాదన తప్పు. వాస్తవానికి మన రూపాయి విలువ తగ్గితే దానివలన వాణిజ్య లోటు తగ్గాలి (రూపాయి విలువ పడిపోతే అప్పుడు దిగుమతుల ఖరీదు పెరుగుతుంది. ఆ కారణంగా దిగుమతులు తగ్గిపోతాయి. అప్పుడు వాణిజ్య లోటు తగ్గుతుంది.). ఆ వ్యాఖ్యాతలు మన దేశీయ డిమాండ్ బాగా పెరిగినందువలన దిగుమతులు పెరిగాయని, అందువలన వాణిజ్య లోటు పెరిగిందని రెండో కారణంగా చూపుతున్నారు. కాని అంత స్పష్టంగా మన దేశీయ డిమాండ్ పెరిగిపోయిన దాఖలాలు ఏమీ లేవు. నిజానికి ఈ కాలంలో మన జీడీపీ పెరుగుదల బాగా తక్కువగా ఉంది. అందుచేత దేశీయ డిమాండ్ పెరిగిపోయిందని చెప్పడం అవాస్తవమే అవుతుంది.

మన వాణిజ్య లోటు పెరగడానికి ఉక్రెయిన్ యుద్ధాన్ని ఒక కారణంగా రిజర్వు బ్యాంకు చూపుతోంది. ఈ యుద్ధం అంత త్వరగా ముగిసిపోయే వ్యవహారం కాదు. అదేదో రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలలో వచ్చిన వివాదం వంటిది కాదు. సామ్రాజ్యవాదం ప్రపంచం మీద పట్టు బిగించాలన్న ప్రయత్నంలో భాగంగా దీనిని చూడాలి. అందుచేత ఆ యుద్ధాన్ని తొందరగా పరిష్కరించడానికి చేసే ప్రయత్నాలను సామ్రాజ్యవాదం ముందుకు సాగనివ్వదు. ఇక ద్రవ్యోల్బణం పెరగడం అనేది ఈ యుద్ధానికన్నా ముందే మొదలైన ధోరణి. అది సంపన్న పెట్టుబడిదారీ దేశాల ఆర్థిక వ్యవస్థలమీద తీవ్రంగా ప్రభావం చూపిస్తోంది. దానినుండి బయట పడడానికి ఆ దేశాలు ఆర్థిక మాంద్యాన్ని, నిరుద్యోగాన్ని పెంచడం మార్గంగా ఎంచుకున్నాయి. అందుచేత ఈ ద్రవ్యోల్బణం నుండి బయట పడడానికి కూడా ఎక్కువ కాలమే పడుతుంది. అంటే, 2022 జులై-సెప్టెంబర్‌లో కనిపించిన ఈ విదేశీ వాణిజ్య చెల్లింపుల లోటు అనేది మరికొంతకాలం పాటు కొనసాగుతుంది.

మన రూపాయి మారకపు విలువ 2022లో చాలా వేగంగా పడిపోయింది. దాదాపు 10శాతం పడిపోయింది. మామూలుగానైతే ఈ విధంగా రూపాయి మారకపు రేటు పడిపోతే విదేశీ చెల్లింపుల లోటు తగ్గుతుంది. కాని ఆ విధంగా జరగడానికి కొంత కాలం పడుతుంది. అందుచేత ఇప్పుడు ఒకపక్క వాణిజ్య లోటు పెరుగుతూ, మరోవైపు రూపాయి మారకపు రేటు పడిపోతూ ఉండడం అనే రెండు ధోరణులు ఏకకాలంలో కొన్నాళ్ళు కొనసాగనున్నాయి. భారీగా విదేశీ చెల్లింపుల లోటు పెరగగానే మార్కెట్‌లో మదుపుదారులు రూపాయి మారకం రేటు త్వరలో తగ్గబోతోందని అంచనాలకు వస్తారు. దాని ఫలితంగా మామూలుగా తగ్గేదానికన్నా ఎక్కువ స్థాయిలో రూపాయి మారకపు రేటు తగ్గిపోవడం మొదలవుతుంది. అందువలన ఇక్కడ ఉన్న ద్రవ్య పెట్టుబడులు బైటకు తరలిపోవడం పెరుగుతుంది. అది లోటును మరింత పెంచుతుంది. ఆ తర్వాత రూపాయి మారకపు రేటు తగ్గిన కారణంగా విదేశీ చెల్లింపుల లోటు తగ్గడం అనేది ఏ మోతాదులో జరిగినప్పటికీ, దాని ప్రభావం లోటును పెద్ద గా తగ్గించేదిగా ఉండదు. అటువంటప్పుడు మన రూపాయి మారకపు రేటు నిరంతరాయంగా పడిపోయే దశలోకి మనం అడుగు పెడతాం (ఇప్పటికే ఆసియా దేశాల కరెన్సీల లోకెల్లా అత్యంత బలహీనమైనవాటిలో ఒకటిగా మన రూపాయి ఉంది). అదే గనుక జరిగితే మనం అదుపు తప్పిన ద్రవ్యోల్బణం చెలరేగే పరిస్థితులను చవిచూడవలసి వస్తుంది.

మన దగ్గర విదేశీ మారకపు నిల్వలు భారీగానే ఉన్నాయి గనుక ఈ పరిస్థితిని ఏదోవిధంగా తట్టుకుని నిలబడగలుగుతాం అని అనుకోడానికి లేదు. రూపాయి మారకపు విలువ పడిపోకుండా నిలబెట్టడానికి రిజర్వుబ్యాంకు తనవద్ద ఉన్న డాలరు నిల్వలను ఇప్పటివరకూ దాదాపు 100 బిలియన్ల మేరకు ఖర్చు చేసింది. అయినా రూపాయి మారకపు రేటు పడిపోవడం ఆగలేదు. 2022 జులై-సెప్టెంబర్ మూడు నెలల కాలంలోనే 25 బిలియన్ల డాలర్ల మేరకు మన విదేశీ నిల్వలు కరిగిపోయాయి. దీనిని బట్టి మన డాలరు నిల్వలను మార్కెట్ లోకి అదనంగా విడుదల చేసినంత మాత్రాన రూపాయి మారకపు విలువ పడిపోకుండా ఆపలేము అని స్పష్టం అవుతున్నది. అంతేకాదు. ఇలా అదనంగా విడుదల చేయడం వలన స్పెక్యులేటర్లలో మన రూపాయి మారకపు విలువ మరింత పడిపోనుంది అన్న అంచనాకు బలం పెరుగుతుంది. అందుచేత మనదగ్గర డాలరు నిల్వలు ఎక్కువగా ఉన్నంతమాత్రాన మన విదేశీ చెల్లింపుల లోటును పెరిగిపోకుండా ఆపలేము అని బోధపడుతోంది.

ఇక మూడో అంశం: ఈ లోటు పెరిగిపోవడం అన్నది మన దేశ జీడీపీ వృద్ధిరేటు బాగా తక్కువగా ఉన్న సమయంలో సంభవించింది. 2021-22 ఆర్థిక సంవత్సరపు మొదటి మూడు నెలల కాలం నాటి వృద్ధిరేటుతో పోల్చితే 2022-23 ఆర్థిక సంవత్సరపు మొదటి మూడు నెలల కాలంలో వృద్ధిరేటు 13.5శాతంగా నమోదైంది. కోవిడ్ అనంతర కాలంలో ఆర్థిక కార్యకలాపాలు తిరిగి పుంజుకుంటున్నట్టు ఇది తెలియజేస్తోంది. అయితే రెండో త్రైమాసిక కాలం (జులై-సెప్టెంబర్) పోల్చి చూస్తే వృద్ధిరేటు కేవలం 6.3శాతమే ఉంది. ఉత్పత్తిలో వాస్తవ వృద్ధిని సూచించే స్థూల అదనపు సంపద (గ్రాస్ వాల్యూ యాడెడ్)లో వృద్ధి ఇంకా తక్కువగా, 5.6శాతమే ఉంది. దీనికి కారణం సరుకుల ఉత్పత్తి రంగం (మాన్యుఫాక్చరింగ్)లో వృద్ధి మందగించడమే. ఈ రంగంలో మందగమనం చాలా కాలంగా కొనసాగుతోంది. ఇప్పుడు విదేశీ చెల్లింపుల లోటు పెరగడంతో (ఎగుమతులు తగ్గి, దిగుమతులు పెరగడంతో) ఈ సరుకుల ఉత్పత్తి రంగంలోని మందగమనం ఇంకా పెరగనుంది. ఒకపక్క వృద్ధిరేటు తగ్గుతున్నా చెల్లింపుల లోటు పెరుగుతూనేవుంది.



ఈ విదేశీ వాణిజ్య చెల్లింపుల లోటు పెరగడంతో అది దేశంలో వడ్డీరేట్ల పెరుగుదలకు దారి తీస్తుంది. మన వాణిజ్య చెల్లింపుల లోటును తగ్గించుకోవాలంటే మరింతగా విదేశీ పెట్టుబడులను మన దేశానికి ఆకర్షించాలి. మరోపక్క దేశీయ డిమాండ్‌ను పెరగనివ్వకుండా అరికట్టాలి. ఇంకోపక్క పడిపోతున్న రూపాయి మారకపు విలువ ఇక్కడ ద్రవ్యోల్బణం పెరుగుదలకు దారి తీయకుండా నిరోధించాలి. ఇవన్నీ నెరవేరాలంటే నయా ఉదారవాదం దగ్గర ఒక్కటే మందు ఉంది. మాంద్యాన్ని పెంచడం, నిరుద్యోగాన్ని పెంచడం. దీనినే మరింత ఉధృతంగా ఇక్కడ పాటిస్తారు. దాని ఫలితంగా వృద్ధిరేటు మరింతగా పడిపోతుంది. ఒకపక్క ఆర్థిక వ్యవస్థలో మాంద్యం, మరోపక్క విదేశీ చెల్లింపుల లోటు రెండూ పెరగడం మన ఆర్థిక వ్యవస్థకు మరింత చెడ్డ రోజులు దాపురించనున్నాయని సూచిస్తోంది.

ఇదేమంత తీవ్రమైన సమస్య కాదని, 2012-13లో కూడా మన వాణిజ్యలోటు బాగా పెరిగిపోయినప్పటికీ, దాని తాకిడిని జయప్రదంగా తట్టుకుని ముందుకు సాగగలిగామని, ఇప్పుడు కూడా అదే విధంగా జరుగుతుందని కొందరు వాదించవచ్చు.

అప్పటికి, ఇప్పటికి పరిస్థితుల్లో మౌలికమైన తేడా ఉంది. 2012-13 నాటికి లేని తీవ్ర ద్రవ్యోల్బణం నేడు ఉంది. ఇది ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ మొత్తం మీద నెలకొని ఉంది. అందుకనే అన్ని దేశాల్లోనూ వడ్డీరేట్లు పెంచివేయడం జరుగుతోంది. దాని ఫలితంగా మొత్తం ప్రపంచం మాంద్యంలోకి కూరుకుపోతోంది. 2012-13లో తక్కిన దేశాల్లో వడ్డీ రేట్లు పెరగలేదు. కాని అప్పుడు మన రిజర్వుబ్యాంకు ఇక్కడ వడ్డీరేట్లను పెంచింది. దాని వలన మన దేశానికి విదేశీ పెట్టుబడులు ఎక్కువగా వచ్చి మనం ఇబ్బందుల నుండి బైటపడగలిగాం. ఇప్పుడు అన్ని దేశాల్లోను వడ్డీ రేట్లు పెంచుతున్నందువలన మన దేశానికి రావడానికి విదేశీ పెట్టుబడులకు ప్రత్యేకమైన ఆకర్షణ ఏమీ లేదు. ఆర్థిక మాంద్యం ప్రపంచ వ్యాప్తంగా ఉన్నందువలన ప్రస్తుతం మనదేశంలో ఏర్పడిన విదేశీ వాణిజ్య చెల్లింపుల లోటు ఎక్కువకాలం ఇలాగే కొనసాగే ప్రమాదం ఉంది. దాని కారణంగా ఇక్కడ ఆర్థిక సంక్షోభం మరింత ముదిరిపోనుంది.

నయా ఉదారవాద పెట్టుబడిదారీ విధానం ఎటువంటి చిక్కుల వలలో ఇరుక్కుపోయివుందో ప్రస్తుత పరిస్థితి సూచిస్తోంది. పశ్చిమ దేశాల సామ్రాజ్యవాద ఆధిపత్యానికి తీవ్రమైన సవాళ్ళు ఎదురవుతున్నాయి. ఈ నయా ఉదారవాద చట్రం నుండి బైటపడడానికి అవకాశాలు పెరుగుతున్నాయని ఈ పరిస్థితి సూచిస్తోంది. అటువంటి అవకాశం వచ్చినప్పుడే మన దేశం దానిని అందిపుచ్చుకోగలగాలి. కాని మన ప్రభుత్వం ఆ దిశగా ప్రయత్నించడం పోయి నయా ఉదారవాద విధానాలనే అంటకాగుతోంది. అప్పులు చేసి మరీ కార్పొరేట్లకు బెయిల్ ఔట్ ప్యాకేజీలు అందిస్తోంది. ఈ వైఖరి కారణంగా మన దేశం ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభం రానున్న కాలంలో మరింత ముదిరిపోయే ప్రమాదం ఉంది. (స్వేచ్ఛానువాదం)

సంక్షోభంలో సర్కార్ విద్యావ్య(అ)వస్థ

మానవ సమాజ వికాసానికి, దేశ సర్వతో ముఖాభివృద్ధికి మూలాధారం విద్య. ఇలాంటి విద్యావ్యవస్థలోని తొలి అడుగైన పాఠశాల విద్యకు సర్వహంగులతో పరిపుష్టి నింపి, రేపటి తరం మేలైన భవిష్యత్తుకు పాలకులు బాటలు వేయాల్సి ఉంది. కానీ 1991లో వచ్చిన నూతన ఆర్థిక సంస్కరణలు, పాలకులు అనుసరిస్తున్న విధానాలతో విద్యావ్యవస్థలోకి వ్యాపార ధోరణులు ప్రవేశించాయి. దీంతో ప్రభుత్వ ఆధీనంలో ఉండవలసిన విద్య అంగడి సరుకుగా మారింది. ఇలా ప్రయివేటీకరణ, కార్పొరేటీ కరణతో నేడు "చదువుకుంటే రావడం కాస్త- చదువును కొనుక్కుంటేనే" వస్తుందనే పరిస్థితి దాపురించింది. 1964లోని "కొఠారి కమిషన్" మన దేశవ్యాప్తంగా విద్యావ్యవస్థ పరిస్థితులను అధ్యయనం చేసి, విద్యాభివృద్ధికి కొన్ని అతి విలువైన, ఆచరణాత్మక సూచనలు చేసింది. వీటిని అమలు చేయకపోవడంతో పాటు మారిన పాలకుల పాలనా విధానాల వలన విద్యా వ్యాపార ధోరణులు పెరిగి లాభార్జన ధ్యేయంగా కొనసాగు తోంది. విద్యావ్యవస్థ పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలో ఉండాలని, ఉచితంగా నిర్బంధంగా నాణ్యమైన విద్యను అందించాలని రాజ్యాంగం లో పొందుపరచుకున్న విధానాలు నేడు అమలవడం లేదు. గత కొన్నాళ్లుగా ప్రభుత్వాలలో ప్రభుత్వ విద్యారంగాన్ని బతికించుకోవాలనే స్ఫూర్తి, చిత్తశుద్ధి లోపించడం వలన సర్కారీ విద్య అష్ట కష్టాలు, అరకొర వసతులతో కూనరిల్లు తోంది.



మేకిరి దామోదర్

ఎక్కడ ఉన్న విద్య అక్కడే...

ఒకవైపు ప్రభుత్వాలు విద్యను వ్యాపార వస్తువుగా చేసి మరోవైపు సమాజంలో విలువలు సామాజిక స్పృహ నైతికత ఆశించడం వృథా ప్రయత్నమే. ఇది సరిపోదు అన్నట్టు అరకొర మౌలిక వసతులు, కనీస అవసరాలు తీర్చ కుండా నిధులు, నియామకాలు చేయకుండా పాలకులు దశాబ్దాలుగా కాలం వెల్లదీస్తున్నారు. ఎన్నో పథకాలు, మరెన్నో ఆర్భాట ప్రకటనలు జోరు ప్రచార హోరు చేస్తూ సంవత్సరానికో కొత్త బోధనా విధానాలు ప్రభుత్వ విద్యలో ప్రవేశ పెడుతూ ప్రయోగశాలగా మార్చారు. నూతన విద్యా విధానం 1986లో ఓబిబి (ఆపరేషన్ బ్లాక్ బోర్డ్) ఆ తర్వాత గుణాత్మక విద్య పేరుతో క్వాలిటీ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం, 2005-06లో సిఎల్ఐపి చిల్డ్రన్ లాంగ్వేజ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం, 2008-09లో సిఎల్ఎపి చిల్డ్రన్ లెర్నింగ్ ఎన్ హాన్స్ మెంట్ ప్రోగ్రాం, వీటిలో భాగంగా "ఏ బి సి ప్రోగ్రాం, ఎల్ ఈ పి, 2020లో రీడ్ ఎంజాయ్ డెవలప్‌మెంట్. నేడు తొలిమెట్టు ఎఫ్ఎల్ఎన్ (ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసి)పునాది స్థాయి అక్షరాస్యత, గణిత సామర్థ్యాలు, భాషా సామర్థ్యాలు పిల్లలు సాధించాలని ఏర్పాటు చేసినట్టుగా చెబుతున్నారు. వీటితోపాటు పిల్లలు తాము చదువుతున్న తరగతుల సామర్థ్యాలను అన్నింటిని కూడా కొనసాగింపుగా సాధించాలంటున్నారు. గతం నుండి ఈ విధానాలు తెస్తూ, ప్రతిసారి ప్రారంభంలో బోధనా విధానాలు అద్భుతంగా అనిపిస్తూ, క్షేత్రస్థాయిలో విఫలం అవుతున్నాయి. ఇవి గత అను భవాలు నిజమే కదా! ఆ తర్వాత మళ్లీ కొత్త ప్రయోగం, పాత విధాన లోపాలను ఏకరువు పెడుతున్నారు. ఇలా 75ఏండ్లలో విద్యారంగం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. ప్రభుత్వాలు చెప్తుతున్నట్లు ఇవి మంచి విధానాలే అయినప్పుడు వీటిని ప్రయివేటు, కార్పొరేట్ విద్యా రంగాల్లో ఎందుకు అమలు చేయలేకపోతున్నారు. వారికేమో బోధనలో స్వేచ్ఛ, వారి బోధన విధానాలపై, పర్యవేక్షణ పైగాని ఎలాంటి ఆంక్షలు లేవు. ప్రభుత్వాలు చూసీ చూడనట్టు వ్యవహరించడం నిజం కాదా! ప్రభుత్వ రంగంలో విఫల ప్రయత్నాలు, ప్రయోగాలు ఫలితం లేని వాటిని ప్రయోగించి పిల్లల భవిష్యత్తును అంధకారం చేయడం భావ్యమా? మరి నేడు పాఠశాల విద్య నుంచి మన సమాజం ఏం ఆశిస్తున్నది? నేటి చిన్నారులు రేపటి బాధ్యతగల పౌరులుగా ఎదిగేందుకు నైతిక విలువలు ఉగ్గుపాలతో ప్రాథమిక స్థాయి నుంచి పట్టించడం, విద్యార్థుల ఆసక్తులు, అంతర్గత నైపుణ్యాలను గుర్తించి ప్రోత్సహించడం అవసరం. పేజీల కొద్దీ అనవసర విషయాలను పిల్లల మెదల్లోకి నెట్టకుండా ఉండటం, సమకాలీన పోటీ ప్రపంచంలో ఎలా నెగ్గుకు రావాలో నేర్పడం ముఖ్యం. విమర్శనాత్మక ఆలోచన.. సమస్య పరిష్కార సామర్థ్యాలను పెంపొందించడం,



పిల్లల భావోద్వేగ వైఖరులను మెరుగుపరచడం చేయాలి. అలాగే క్రమం తప్పని వ్యాయామం, క్రీడలు, ఆరోగ్య స్పృహ కల్పించడం వంటివి మొదలగు పాఠశాలలు వాస్తవంగా వేదికలు కావలసి ఉంది. కానీ పాలకులు మారినప్పుడల్లా వారి ఆలోచనలకు అనుగుణంగా పాఠ్య ప్రణాళికలు మార్చుతున్నారు. కానీ ప్రపంచంలో కొన్ని దేశాలు విద్యారంగంలో పిల్లల సృజనాత్మకతను, వినూత్నతను వెలికి తీసే కార్యశాలలకు బడులనే ఆదర్శంగా మార్చుకున్నాయి. దక్షిణకొరియా, ఫిన్లాండ్ సింగపూర్, జపాన్, కెనడా, డెన్మార్క్, పోలాండ్, స్విట్జర్‌లాండ్ దేశాలు ప్రపంచంలోనే విద్యా రంగంలో అత్యున్నత స్థానాల్లో నిలిచి ఆచరణాత్మక విద్యకు నిదర్శంగా నిలిచాయి. చక్కటి చదువులతో పిల్లల సమగ్ర ఎదుగుదలకు బాటలు పరుస్తున్నాయి. అణు విస్ఫోటనం నుంచి తేరుకొని అద్భుతాలను సృష్టిస్తున్నాయి. వాటి నుంచి స్ఫూర్తి పొందాల్సిన మన పాలకులు ఏం చేస్తున్నారు? ఏ మేరకు బాధ్యతలు నిర్వ హిస్తున్నారు. ఇది పాలకుల లోపం కాదా!

సమస్యలతో కునారిల్లుతున్న విద్యవ్యవస్థ

మనదేశంలో 75ఏండ్ల స్వాతంత్ర్య అమృత ఉత్సవాలు జరుపుకున్నాం. కానీ విద్యారంగం నేటికీ ఏడాదికో కొత్త పథకం, నూతన విధానాలతో విఫల ప్రయత్నాల ప్రయోగశాలగా ప్రభుత్వ విద్యారంగాన్ని మార్చుచున్నారు. విద్యారంగంలో ప్రైవేట్, కార్పొరేట్ సంస్థలు వ్యాపార ధోరణితో లాభాలు ఆర్జిస్తూ "మూడు పువ్వులు 36 కాయలుగా" వర్ధిల్లుతుంటే ప్రభుత్వ విద్య మాత్రం పాతాలంలోకి పయనిస్తున్నది. దీనికి కూడా అనేక కారణాలున్నాయి. అభ్యసన సంక్షోభం, మౌలిక వసతుల లేమి, నిధులు, నియామకాలు కనీస అవసరాలు తీర్చలేని దుర్భర స్థితిలో గందరగోళంలో విద్య కొట్టుమిట్టాడుతోంది. దీనికితోడు నియామకాలు, నిధులు, పారిశుద్ధ్యం, కార్యాలయ నిర్వ హణకు అవసరమైన స్వీపర్లు, అటెండర్లు, వాచ్మెన్లు, జూనియర్ అసిస్టెంట్ పోస్టులు, లైబ్రరియన్ పోస్టులు, పర్యవేక్షణ అధికారులు, హెడ్మాస్టర్లు, ఎంఈఓ, డిప్యూటీ డీఓలు, డిఇఓ పోస్టులు ఇలా అనేక ఖాళీలతో ప్రభుత్వ విధానాలను వెక్కిరిస్తున్నాయి. ఖాళీలు భర్తీ చేయకపోవడంతో విధుల్లో ఉన్న ఉద్యోగులు ఒత్తిడితో విధులు నిర్వహి స్తున్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యలో ఇకనైనా విఫల ప్రయోగాలను ఆపాలి. ప్రభుత్వాలు ఇన్నాళ్ల నిర్లక్ష్యాన్ని వీడి తక్షణమే ప్రభుత్వ విద్యా పరిరక్షణకు పూనుకోవాలి. టైం బాండ్ కార్యక్రమంతో ముందుకెళ్లాలి. ఉపాధ్యాయులు వృత్తి నిబద్ధతతో విధులు నిర్వహించాలి. తల్లిదండ్రులు, సమాజం విద్యను వ్యాపారంగా మారుస్తుంటే చూస్తూ ఉండి, ఆ తర్వాత విలువలు సామాజిక స్పృహ, నైతికతలను పిల్లల నుండి ఆశించడం అంటే? "ఇసుక నుండి తైలం తీయడం లాంటిదే" అని గమనించాల్సిన అవసరం ఉన్నది. ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణ బాధ్యతను పాలకులు ఒకరిపై ఒకరు ఆ నెపాన్ని తోసేసే విధానాలు విడనాడాలి. జీవితాంతం గుర్తుండేలా ప్రాథమిక అంశాలపై లోతైన అవగాహన కల్పించే, సొంత కాళ్లపై నిలబడే శక్తిని కలిగించే విధంగా పాఠ్య ప్రణాళికలు రూపొందాలి. ఆ విధానాలు చదువు లకు సార్థకత చేకూర్చాలి. పాఠశాల విద్యకు పరిపుష్టి నింపకుండా ఏ ఒక్క ప్రయత్నం చేయకుండా ఆర్భాటంగా ఎన్ని పథకాలు ఎన్ని విధానాలు వచ్చినా కనీస ఫలితాలు ఇవ్వలేవనే విషయాన్ని గ్రహించాలి. ప్రాథమిక విద్య ప్రాముఖ్యతను గ్రహించి, రాబోవు 50ఏండ్లలో అవసరాలను శాస్త్రీయంగా మదింపు చేసి ఆయా రంగాల్లో విద్యార్థులను తయారు చేయాల్సిన బాధ్యతను పాలకులు తీసుకున్నప్పుడే దేశం మరింత అభివృద్ధిలోకి వస్తుంది.

> పాఠశాల విద్యకు పరిపుష్టి నింపకుండా ఏ ఒక్కప్రయత్నం చేయకుండా ఆర్భాటంగా ఎన్ని పథకాలు ఎన్ని విధానాలు వచ్చినా కనీస ఫలితాలు ఇవ్వలేవనే విషయాన్ని గ్రహించాలి. ప్రాథమిక విద్య ప్రాముఖ్యతను గ్రహించి, రాబోవు 50ఏండ్లలో అవసరాలను శాస్త్రీయంగా మదింపు చేసి ఆయా రంగాల్లో విద్యార్థులను తయారు చేయాల్సిన బాధ్యతను పాలకులు తీసుకున్నప్పుడే దేశం మరింత అభివృద్ధిలోకి వస్తుంది.

సెల్: 9573666650



ఆదర్శ కమ్యూనిస్టు
కామ్రేడ్ కాంతారెడ్డికి కన్నీటి వీడ్కోలు

అతనొక ఆదర్శ కమ్యూనిస్టు..నిస్వార్థ నాయకుడు.. పోరాటాల గడ్డపై తనదైన శైలిలో ముద్రవేసిన మార్క్సిస్టు నేత. మునగాల పరగణా జమీందారి వ్యతిరేక పోరాటం. తదనంతరం సాగిన వీరోచిత తెలంగాణ సాయుధ రైతాంగ చారిత్రాత్మక ఉద్యమంలోంచి ఉద్భవించిన ముఖ్యనేతల్లో కామ్రేడ్ ఉప్పల కాంతారెడ్డి ఒకరు. పువ్వుపుట్టగానే పరిమళించినట్టు ఆయన బాల్యం నుండే పోరాట మార్గాన్ని ఎంచుకున్నాడు. చిన్ననాడే బాలల సంఘాల్లో చేరి విప్లవ రాజకీయాల్లో ఓనమాలు దిద్దుకున్నాడు. ఏడు దశాబ్దాల పాటు విరామం ఎరగని పోరాట యోధుడుగా ఎన్ని కష్టాలు,నష్టాలు వచ్చినా మొక్కవోని ధైర్యంతో ముందుకు సాగాడు. మునగాల పరగణా మార్క్సి స్టు పార్టీ ఉద్యమాల్లో అతివాదాన్ని, మిత వాదాన్ని ముఠా ధోరణులను ఎదిరించి అనేక నిర్బంధాలను ఎదుర్కొన్నాడు. మార్క్సిస్టు పార్టీని కంటికి రెప్పలా కాపాడటంలో ఆయన ప్రత్యేకతను చాటుకున్నాడు. ఆయన మరణం కమ్యూనిస్టు పార్టీ ఉద్యమానికి తీరనిలోటు. 14జులై1935లో ఉప్పల వెంకయ్య,సీతమ్మ దంపతులకు ధనిక రైతు కుటుంబంలో జన్మించారు. కానీ ఆయన జీవితాంతం పేద ప్రజల కోసమే పనిచేశాడు. మునగాల పరగణాలోని జగన్నాధపురం గ్రామంలో కేశ బోయిన ముత్తయ్య ద్వారా విప్లవ రాజకీయాలకు ఆకర్షితుడయ్యారు.పార్టీలో అనేక బాధ్యతలు నిర్వహిస్తూ సీపీఐ(ఎం) కోదాడ డివిజన్ కార్యదర్శిగా, జిల్లా రైతు సంఘం నాయకుడిగా,1970 నుండి 80 వరకు మున గాల గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా నిబద్ధతతో కూడిన సేవలందించారు. ఇంకా సింగిల్ విండో చైర్మన్‌గా,లిఫ్ట్ ఇరిగేషన్ ఛైర్మన్‌గా, హుజూర్‌నగర్, ఎల్ఎంబి. బ్యాంక్ వైస్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించి నీతి,నిజాయితీకి మారుపేరుగా నిలిచాడు.

నిర్బంధాలను ఎదుర్కొని..పోరాటాలు చేసి...

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత అనేక సంవత్సరాలు మునగాల పరగణా కష్ణా జిల్లాలో అంతర్భాగంగా ఉన్నది. మునగాల జమీందారికి వ్యతిరేకంగా సాగిన పోరాటంలో నండూరి ప్రసాద్‌రావు నాయ కత్వంలో సాగిన పోరాటం అనేక విజయాలు సాధించింది. 1959 జులై 1వ తేదీన మునగాల పరగణాను నల్గొండ జిల్లాలో అంత ర్భాగం చేశారు. జమీందారీ వ్యతిరేక పోరాటం, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం. బ్రిటీష్ వ్యతిరేక పోరాటంలో పరగణా ప్రజలు భాగస్వాములై మునగాల పరగణా తొలి అమరుడు చీమ గురువయ్య స్ఫూర్తితో సమరశీల పోరాటా లకు నాయకత్వం వహించి అనేక విజయాలు సాధించారు. అనంతరం మార్క్సిస్టు పార్టీ నాయకత్వాన సాగిన భూ పోరాటాలు, ప్రజా ఉద్యమాలు,కూలీ తిరుగుబాట్లు, రైతాంగ ఉద్యమాలను నడిపించిన ఎర్రజెండాను పరగణా ప్రజలు హక్కున చేర్చుకున్నారు. 1996లో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మార్క్సిస్టు పార్టీ ఉద్యమం విచ్ఛిన్నానికి గురైనప్పుడు పార్టీని కాపాడటంలో కామ్రేడ్ కాంతారెడ్డి కృషి ఎనలేనిది. కోదాడ ప్రాంతంలో పార్టీ ప్రతి ఎన్నికల్లో నిర్ణయాత్మక పాత్ర పోషించేది. మార్క్సిస్టు పార్టీ అభివద్ధిని చూసి ఓర్వలేక ఆనాడు పాలక పార్టీలైన కాంగ్రెస్, తెలుగుదేశం, అతివాద పార్టీలు సీపీఐ(ఎం)పైన కక్షగట్టి తీవ్రమైన నిర్బంధాన్ని కొనసాగించాయి. దీంతో కోదాడ డివిజన్‌లో ఉద్యమం అనేక నిర్బంధాలను ఎదుర్కొన్నది. రెండు దశాబ్దాల పాటు పార్టీ నాయకుల పైన నిర్బంధం సాగింది. వందలాది కేసుల మోపబడ్డాయి. అనేకమంది నాయకులను దారి కాచి అతి దారుణంగా హత్య చేశారు. మెరికల లాంటి యువత తమ ప్రాణాలను తృణ ప్రాయంగా అర్పించారు. నరసింహుల గూడెం, జగన్నాధపురం,కలకోవ తాడువాయి,కొక్కిరేణి,రేపాల, మాధవరం, నేలమర్రి సిరిపురం. బందావనపురం తో పాటు మల్లారెడ్డిగూడెం గ్రామాల్లో పార్టీ పైన దాడులు, హత్యల పరంపర సాగింది.నరసింహుల గూడెం గ్రామంలో కామ్రేడ్లు ఆదిరెడ్డి, అమీర్, ముదిరెడ్డి శ్రీనివాసరెడ్డి, బొంత శ్రీనివాస్ రెడ్డి, పులిందర్ రెడ్డి అమరులయ్యారు. మల్లారెడ్డి గూడెం గ్రామంలో కామ్రేడ్ కందుల గురువారెడ్డి, ఎర్రబోలు వెంకటేశ్వర్ రెడ్డి హత్యకు గురయ్యారు. వీరితోపాటు అనేక గ్రామాల్లో కార్యకర్తల పైన నాయకుల పైన దాడులు కొనసాగాయి. పోలీసులు అధికార పార్టీ అండతో అక్రమ కేసులు మోపి జైళ్లలో నిర్బంధించారు. సుదీర్ఘ కాలం పాటు కోదాడ డివిజన్ ఉద్యమం పైన మునగాల పరగణా గ్రామాల పైన మండే కొలిమిలా నిర్బంధం కొనసాగింది. ఎన్నో నిర్బంధాలను,విచ్ఛిన్నాలను ఎదుర్కొని నాటినుండి నేటి వరకు ప్రజలు పార్టీని కంటికి రెప్పలా కాపాడుకున్నారు.

ప్రజల మదిలోనే పోరాట స్మృతులు...

పరగణా పోరాట స్మృతులు నేటికి ప్రజల మదిలో స్మరిస్తూనే ఉన్నాయి. కామ్రేడ్ కాంతారెడ్డి ఉద్యమంపై వస్తున్న నిర్బంధాలను ఎదుర్కొంటూ కార్యకర్తలను కాపాడటంలో ప్రభుత్వం, పోలీసులు కొనసాగిస్తున్న నిర్బంధ కాండ పైన ప్రజలను సమీకరించి గొంతెత్తి నినదించేవారు. కోదాడ డివిజన్ వ్యాప్తంగా విచ్ఛిన్నలాను, నిర్బంధాలను ఎదుర్కొంటూనే పార్టీ నిర్మాణంలో కీలకమైన పాత్ర పోషించాడు.కోదాడ పట్టణాన్ని కేంద్రంగా చేసుకునేందుకు కామ్రేడ్ అరిబండి లక్ష్మీనారాయణ సహకారంతో పార్టీ కార్యాల నిర్మాణం,నడిగూడెం. మునగాల కేంద్రంలో పార్టీ కార్యాలయ నిర్మాణానికి కాంతారెడ్డితో పాటు గట్టు వెంకటరామయ్య కషి మరువలేనిది. డివిజన్ వ్యాప్తంగా పార్టీ ప్రాబల్యాన్ని పెంచేందుకు స్థానిక ఎన్నికలతోపాటు నిర్బంధాలు వచ్చినప్పుడల్ల కామ్రేడ్ వి.ఎస్., కామ్రేడ్ మేదరమట్ల సీతా రామయ్య నిరంతరం సంప్రదిస్తూ ఎత్తుగడలు రూపొందించేవాడు. పరగణ గ్రామాల్లో సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు రావటంలో కాంతారెడ్డి పాత్ర అద్వితీయం. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన నిన్న అకస్మాత్తుగా చనిపోయారు. భౌతికంగా కాంతారెడ్డి మన మధ్య లేకున్నా మునగాల పరగణా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచాడు.ఆయన అంకితభావం, ఉద్యమస్ఫూర్తి, పోరాట పటిమకు విప్లవ జోహార్లు.



ములకలపల్లి రాములు
9490098338

సాంఘిక సంక్షేమ గురుకులానికి రివార్డు

నవతెలంగాణ-కారేపల్లి

కారేపల్లి శ్రీకవిత ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న ఇల్లందు సాంఘీక సంక్షేమ గురుకులంకు స్వచ్ఛా గురుకుల్‌లో ప్రథమ స్థానం సాధించి రివార్డు అందుకుంది. సెప్టెంబర్ 5వ తేది నుండి 11వ తేది వరకు నిర్వహించిన స్వచ్ఛా గురుకుల్‌లో అత్యుత్తమ సూచి అందుకొని ప్రథమ స్థానం అందుకుంది. దీనికి గాను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ డి.అనుదీప్ నుండి రూ.20వేల రివార్డును గురుకుల ప్రిన్సిపాల్ కందుల లిల్లీ అందుకున్నారు. స్వచ్ఛా గురుకుల్‌లో ఎంపిక కావటానికి మూలకారకులైన విద్యార్థులు, ఉపాధ్యాయులను, సిబ్బందిని ప్రిన్సిపాల్ అభినందించారు.

పోతురాజు భారతమ్మ మృతికి నివాళులు

నవతెలంగాణ-ముదిగొండ

మండలపరిధిలో న్యూలక్ష్మీపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ బిసి సెల్ మండల నాయకులు పోతురాజు పురుషోత్తం మాతృమూర్తి పోతురాజు భారతమ్మ (80) అనారోగ్యంతో సోమవారం మృతి చెందింది. మృతదేహాన్ని ఎంపీపీ సామినేని హరిప్రసాద్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కొమ్మినేని రమేష్ బాబు సందర్శించి పూలతో నివాళులర్పించారు. భారతమ్మ మృతికి సంతాపాన్ని వ్యక్తం చేస్తూ కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని వారు తెలిపారు. భారతమ్మ భర్త పోతురాజు నరసయ్య గ్రామ మాజీ సర్పంచ్‌గా పనిచేసి అనారోగ్యంతో మృతి చెందారు. భారతమ్మకు కుమారులు, కుమార్తెలు ఉన్నారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ వాకదాని కన్నయ్య, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు మహమ్మద్ అజ్గర్, పసుపులేటి దేవేంద్రం, పందిరి అంజయ్య, చిన్నపంగు శివ, పిల్లుట్ల రాఘవ, పల్లపాటి కృష్ణ, చిలకల రామకృష్ణ, జంపాల కోటేశ్వరరావు, సయ్యద్ రఫీ, మారుతి వీరయ్య, మీగడ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అదనపు వంటగదిని ప్రారంభించిన ఎంపీపీ

నవతెలంగాణ-ముదిగొండ

మండల పరిధిలోని న్యూలక్ష్మీపురం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గ్రామ పంచాయతీ నిధులతో నిర్మాణం చేసిన అదనపు వంట గదిని ఎంపీపీ సామినేని హరిప్రసాద్, సర్పంచ్ వాకదాని కన్నయ్య, ఎంపీటీసీ కిరణ్ మాధవి చేతుల మీదుగా లాంఛనీయంగా సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ డి.శ్రీనివాసరావు, ఎంపిఓ పి.సూర్యనారాయణ, సెక్రెటరీ ఓబినబోయిన రాంబాబు, ఎస్ఎంసి చైర్మన్ సయ్యిద్ నాగుల్‌మీరా, వైస్ చైర్మన్ పెద్దపొంగు సునిత, జిల్లా కాంగ్రెస్ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి మహ్మద్ అజ్గర్, ఖాసింబాబు, వార్డు మెంబర్లు సయ్యద్ రఫీ, మార్తి వీరయ్య, గడ్డం వెంకటరమణ, పాఠశాల అధ్యాపక సిబ్బంది, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ బండారు ఇందిర తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బాగాంధీ, ప్రాథమిక పాఠశాలల సందర్శన

నవతెలంగాణ-ముదిగొండ

మండలపరిధిలో న్యూలక్ష్మీపురం ప్రాథమిక పాఠశాల, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయము (కేజీబివి)ను ఎంపీపీ సామినేని హరిప్రసాద్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని తరగతి గదులతో పాటు, స్టాక్ రూము మెనూ, మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం పాఠశాలల విద్యార్థినిలతో ఆయన మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉడికి ఉడకని అన్నం, రుచి లేని కూరలు పెడుతున్నారని విద్యార్థిని, విద్యార్థులు ఎంపీపీ సామినేని హరిప్రసాద్‌కు చెప్పటంతో నాణ్యతతో కూడిన భోజనంతోపాటు, తాజా కూరగాయలతో రుచికరమైన భోజనం విద్యార్థులకు వండి వడ్డించాలని పాఠశాలల వర్కర్లకు, ఉపాధ్యాయులకు ఆయన సూచించారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ వాగదాని కన్నయ్య, ఎంపీటీసీ సభ్యులు నానబాల మాధవికిరణ్ కుమార్, గ్రామ మాజీసర్పంచ్ మహమ్మద్ అజ్గర్, వార్డుసభ్యులు మహమ్మద్ రఫీ, ఎస్ఎంసి చైర్మన్ ఎస్‌కె నాగుల్ మేరా, వైస్ చైర్మన్ పెద్దపొంగు సునీత ఖాసింబాబు, కేజీబివి స్పెషలాఫీసర్ బండారి ఇందిరా, గ్రామ పెద్దలు మారుతి వీరయ్య, గడ్డం వెంకటరమణ, పాఠశాల అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సత్యవతికి గిరిజన సంఘం వినతి

నవతెలంగాణ-వైరాటౌన్



వైరా నియోజకవర్గంలోని ప్రజా సమస్యలతో పాటు ముఖ్యంగా పోడు భూముల సమస్యను వేంటనే పరిష్కరించాలని కోరుతూ గిరిజన శాఖ మంత్రివర్యులు సత్యవతి రాథోడ్‌ను హైదరాబాద్ బంజారాహిల్స్ లోని వారి నివాసం నందు సిపిఐ(ఎం), గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు కలసి సమస్యలను వివరించి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంలో మంత్రి సత్యవతి రాథోడ్ తోపాటు ఇల్లందు ఎమ్మెల్యే హరిప్రియ నాయక్ కూడా ఉన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామావత్ శ్రీరామ్ నాయక్, రాష్ట్ర నాయకులు బండారు రవికుమార్, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి, సిపిఐ(ఎం) వైరా నియోజకవర్గం ఇన్చార్జి భూక్యా వీరభద్రం, ధీరావత్ రవి నాయక్, కారం పుల్లయ్య, సూడి కష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

నవతెలంగాణ- సత్తుపల్లి

ఈనెల 13, 14 తేదీల్లో రంగారెడ్డి జిల్లా మన్నెగూడలో జరిగే టీఎస్‌యూటీఎఫ్ 5వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘ మండల అధ్యక్ష, కార్యదర్శులు బాల నాగేశ్వరరావు, కొప్పుల శ్రీనివాసరావు కోరారు. సోమవారం మహాసభల వాల్‌పోస్టర్లను స్థాని సంఘ కార్యాలయంలో ఆవిష్కరించారు. మహాసభల్లో విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, కేరళ విద్యా, ఆరోగ్యశాఖ మంత్రి కె.శైలజ, ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నాగేశ్వర్ పాల్గొంటారని వారు చెప్పారు. అత్యధిక సంఖ్యలో సంఘ బాధ్యులు మహాసభల్లో పాల్గొనాలని వారు కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జీఎస్ఆర్ రమేశ్, సభ్యులు ఉమామహేశ్వరరెడ్డి, నాగేశ్వరరావు, సూర్యం, మధు, రమేశ్, వెంకటేశ్, రాహుల్ పాల్గొన్నారు.

నూతన దంపతులను ఆశీర్వదించిన మదన్‌లాల్

నవతెలంగాణ-వైరాటౌన్



వైరా మున్సిపాలిటీ పరిధిలోని 11 వార్డు సొమవరం గ్రామంలో జరిగిన వివాహ వేడుకలో వైరా మాజీ శాసనసభ్యులు బాణోత్ మదన్ లాల్ పల్గొని నూతన దంపతులైన కావ్య, సత్యంలను ఆశీర్వదించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ దొంతబోయన వెంకటేశ్వరరావు, మాదినేని దుర్గాప్రసాద్, కొల్లి నాగేశ్వరరావు, కొత్త వెంకటేశ్వరరావు, పుప్పాల అనంతరామయ్య, రంగా సత్యనారాయణ, వల్లెపు రము, భత్తల వెంకటేష్, కొమ్ము సైదులు, నల్లమోతు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

హరినాధరావుకు సండ్ర నివాళి

నవతెలంగాణ-సత్తుపల్లి

రాష్ట్ర ఐటీ శాఖామాత్యులు, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మామగారు పాకాల హరినాధరావు ఇటీవల మరణించగా హైదరాబాద్‌లోని జేఆర్‌సీ కన్వెన్షన్ హాలులో సోమవారం ఏర్పాటు చేసిన సంతాపసభకు సత్తుపల్లి శాసనసభ్యులు సండ్ర వెంకటవీరయ్య హాజరై హరినాధరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కేటీఆర్ కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు.

కొత్త కలెక్టరేట్ పనులు వేగవంతం

పరిశీలించిన అదనపు కలెక్టర్ స్నేహలత మొగిలి

నవతెలంగాణ - ఖమ్మంకార్పొరేషన్

సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయ నిర్మాణ మిగులు పనులు వేగవంతం చేసి, త్వరితగతిన పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ స్నేహలత మొగిలి అన్నారు. సోమవారం అదనపు కలెక్టర్ పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. భవన నిర్మాణ పనులు పూర్తయి, శుభ్రం చేసే పనులు జరుగుతున్నట్లు అదనపు కలెక్టర్ అన్నారు. లెవలింగ్ పనులు వెంటనే పూర్తి చేసి, సముదాయ ఆవరణలో పట్టణ ప్రకృతి వన ఏర్పాటుకు చర్యలు వేగం చేయాలన్నారు. ప్లాన్ ప్రకారం ఏ ఏ మొక్కలు, ఏ ఏ సైజులలో, ఏ ప్రదేశంలో నాటాలో ఆ ప్రకారం పూర్తి చేయాలన్నారు. మొక్కలు నాటడంపై ఖమ్మం మునిసిపల్ కమీషనర్ ఆదర్శ్ సురభి, జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్ లను అడిగి తెలుసుకున్నారు. భవనం కలియతిరిగి పనులను పరిశీలించారు. చిన్న చిన్న మిగులు పనులపై దృష్టి పెట్టి పూర్తి చేయాలన్నారు. అదనపు కలెక్టర్ సందర్శన సందర్భంగా శిక్షణా అసిస్టెంట్ కలెక్టర్ రాధిక గుప్తా, జెడ్పి సిఇఓ వివి. అప్పారావు, డిఆర్డీఓ విద్యాచందన, ఆర్ అండ్ బి ఇఇ శ్యామ్ ప్రసాద్, జిల్లా వైద్య ఆరోగ్యాధికారి డా. బి.మాలతి అధికారులు తదితరులు ఉన్నారు.

జిల్లా స్థాయిలో క్రీడల్లో 'సాయిస్ఫూర్తి' ప్రతిభ

నవతెలంగాణ-సత్తుపల్లి

ఈ నెల 5,6 తేదీల్లో భద్రాద్రి జిల్లా కొత్తగూడెం రుద్రంపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన ఇంటర్ పాలిటెక్నిక్ జిల్లా స్థాయి క్రీడాపోటీల్లో సత్తుపల్లి మండలం గంగారం సాయిస్ఫూర్తి పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పూటుకూరి శేషారత్నకుమారి తెలిపారు. కళాశాలకు చెందిన విద్యార్థులు వాలీబాల్ పోటీల్లో విజేతలుగా, బ్యాడ్‌మింటన్ రన్నర్స్, చెస్ రన్నర్స్, లాంగ్‌జంప్‌లో తృతియ స్థానం, 200 మీటర్ల పరుగుపందెంలో తృతియ స్థానం, 400 మీటర్ల రిలే పరుగుపందేలలో తృతియ స్థానం కైవసం చేసుకున్నారని తెలిపారు. వీరు ఫిబ్రవరి 3,4 తేదీల్లో రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విజేతలను, శిక్షణ ఇచ్చిన కళాశాల ఫిజికల్ డైరెక్టర్ రఘుపతిరెడ్డిని కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్‌రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ చెన్నుపాటి విజయ్‌కుమార్, డిప్లొమా డీన్ తోమంద్రు రాంబాబు, విభాగాల హెచ్‌ఓఎస్‌లు, అధ్యాపకులు అభినందించారు.

ఖమ్మం నుంచే బీఆర్ఎస్ తొలికేక

సీఎం కేసీఆర్ బహిరంగ సభకు భారీ ఏర్పాట్లు

- వంద ఎకరాలలో 5 లక్షల మందితో సభకు కసరత్తు
- సీఎం కేసీఆర్‌తో సహా ఇతర సీఎంలు, మాజీ సీఎంలకు ఆహ్వానం
- ఉమ్మడి జిల్లా నేతలతో సమావేశమైన సీఎం కేసీఆర్
- తుమ్మల కేసీఆర్, కేటీఆర్‌లను కలవడంపై ఆసక్తి



నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

బీఆర్ఎస్ జిల్లా ముఖ్య నాయకులు పలువురు పార్టీలు మారుతున్నారని ప్రచారం నేపథ్యంలో ముఖ్యమంత్రి కేసీఆర్ బహిరంగ సభ ఖమ్మంలో నిర్వహించేందుకు ఆ పార్టీ నేతలు సన్నాహాలు చేస్తున్నారు. వాస్తవానికి పార్టీ 'తొలికేక' బహిరంగ సభను ఢిల్లీలో నిర్వహించాలని పార్టీ అధిష్టానం తొలుత భావించింది. కానీ ఖమ్మం జిల్లాలో చోటుచేసుకుంటున్న రాజకీయ పరిణామాలను దృష్టిలో ఉంచుకొని ఖమ్మం నుంచే తొలికేకను వినిపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిలో భాగంగా ఈ నెల 18న సీఎం కేసీఆర్ ఖమ్మం రానున్నారు. ఇందుకోసం పార్టీ, అధికార యంత్రాంగం భారీ ఏర్పాట్లు చేస్తోంది. ఆరోజు వీవీ పాలెం వద్ద నూతన జిల్లా సమీకృత కలెక్టరేట్‌ను సీఎం ప్రారంభిస్తారు. అనంతరం బహిరంగ సభలో పాల్గొం టారు. ఈ బహిరంగ సభ జిల్లా రాజకీయ పరిణామాలపై ముఖ్యమంత్రి కే.చంద్రశేఖరరావు సోమవారం హైదరాబాదులో జిల్లా ముఖ్య నేతలతో సమావేశమ య్యారు. సుమారు మూడు గంటల పాటు కొనసాగిన ఈ సమావేశంలో బహిరంగ సభకు సంబంధించి వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులను ఆహ్వానించినట్లు తెలిపారు. 100 ఎకరాల విస్తీర్ణంలో నిర్వహించే భారీ బహిరంగసభకు ఐదు లక్షల మందిని తరలించాల్సిందిగా పార్టీ నాయకులకు సీఎం సూచించారు. ముఖ్య నేతల మార్పుతో జిల్లాలో చోటు చేసుకునే రాజకీయ పరిణామాల ప్రభావం పార్టీపై ఉండకుండా ఇప్పటినుంచే నష్టనివారణ చర్యలు చేపట్టాలని ముఖ్య నేతలకు సీఎం సూచించినట్టు తెలుస్తోంది. సోమవారం ఉదయం పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలకు హాజరైన జిల్లా ముఖ్య నాయకులు సాయంత్రానికి హైదరాబాద్ చేరుకొని సీఎంతో భేటీ అయ్యారు.

తుమ్మల హాజరుపై ఆసక్తి

సీఎంతో భేటికి ఉమ్మడి జిల్లా ఎంఎల్ఏలందరూ హాజరుకాగా కొత్తగూడెం ఎంఎల్ఏ వనమా వెంకటేశ్వరరావు గైర్హాజరయ్యారు. మరోవైపు పార్టీ మారుతాడనే ఊహాగానాల నేపథ్యంలో మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేసీఆర్, కేటీఆర్‌లను కలవడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ భేటిలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీలు నామ నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, ఎంఎల్‌సీలు తాతా మధు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎంఎల్ఏలు కందాళ ఉపేందర్‌రెడ్డి, సండ్ర వెంకటవీరయ్య హరిప్రియ, రాములునాయక్, రేగా కాంతారావు, మెచ్చ నాగేశ్వరరావు, జెడ్పీ చైర్మెన్ లింగాల కమల్‌రాజు తదితరులు హాజరయ్యారు.

తొలికేకకు పలువురు సీఎంలకు ఆహ్వానం

బీఆర్ఎస్ జాతీయ పార్టీగా అవతరించిన తర్వాత ఖమ్మంలో నిర్వహించే తొలికేకకు ఖమ్మం గుమ్మంలో ఏర్పాట్లు మొదలయ్యాయి. రైతు అభ్యున్నతే నాదంగా.. జై కిసాన్ నినాదంగా ... జాతీయ జెండా ఎత్తిన బీఆర్ఎస్ ఈ సభ నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. ఈ సభకు బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌తో పాటు మరో ముగ్గురు ముఖ్యమంత్రులు కేజ్రీవాల్ (ఢిల్లీ), భగవంత్‌మాన్ (పంజాబ్), విజయన్ (కేరళ) హాజరు కానున్నారు. యూపీ మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్ కూడా ఈ సభకు వస్తారు. వీరిలో ఎవరు వస్తారు ఎవరు హాజరు కాలేరు అనే విషయంపై రెండు రోజుల్లో స్పష్టత వస్తుంది. భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) జాతీయ రాజకీయాల్లో తన ప్రస్థానం మొదలు పెట్టేందుకు ముహూర్తం ఖరారైంది. ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పినట్టుగానే సంక్రాంతి తర్వాత ధూమ్‌ధామ్ మొదలు కానున్నది. రైతు, రాజకీయ చైతన్య గడ్డ ఖమ్మంలో ఈ నెల 18న భారీ బహిరంగ సభ ద్వారా బీఆర్ఎస్ శంఖారావం పూరించనున్నది.

భారీగా సభకు సన్నాహాలు...

టీఆర్ఎస్ పార్టీ బీఆర్ఎస్‌గా మారిన తర్వాత నిర్వహిస్తున్న తొలి బహిరంగ సభ ఇదే. తెలంగాణ ఉద్యమానికి, టీఆర్ఎస్ పార్టీకి బలమైన అండగా నిలిచిన బహిరంగ సభల మాదిరిగానే బీఆర్ఎస్ కూడా సభల ద్వారానే జాతీయ రాజకీయాల్లోకి వెళ్లాలని అధిష్ఠానం భావిస్తున్నది. పార్టీ సత్తా చాటేలా ఈ సభను నిర్వహించేందుకు ప్రణాళిక రచిస్తున్నారు.ఈ సభకు 3 లక్షల మంది భారీ జన సమీకరణ చేయాలని భావిస్తున్నారు. సభను 100 ఎకరాల్లో నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. భారీ కటౌట్లతో నేతలకు ఘన స్వాగతం పలకనున్నారు. ఆ ఏర్పాట్లను మంత్రి పువ్వాడ పీఏ రవికిరణ్‌తో కలిసి అడిషనల్ సీపీ బోస్, ఏసీపీ బస్వారెడ్డి, ఆర్‌అండ్‌బి ఈఈ శ్యామ్ ప్రసాద్ సోమవారం పరిశీలించారు.

దళిత లాయర్ దంపతులపై దాడి చేసిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలి

గ్రీవెన్స్ డేలో అదనపు కలెక్టర్‌కు, సీపీకి వినతి

నవతెలంగాణ- ఖమ్మం



దళిత లాయర్ దంపతులపై దాడి చేసిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని కోరుతూ గ్రీవెన్స్‌డేలో అదనపు కలెక్టర్‌కు, సీపీకి వినతిపత్రం అందజేశారు. తొలుత నగరంలో సోమవారం జెడ్పీ సెంటర్‌లో వివిధ కుల ప్రజా సంఘాల నాయకులు దళిత వర్గానికి చెందిన క్రిష్టఫర్, అనురాధ న్యాయవాద దంపతులపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించి వారిపై ఎస్సి, ఎస్టీ అట్రాసిటీ కేసు, హత్యాయత్నం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వివిధ కుల ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ సంఘటన జరిగిన నాటి నుండి నేటి వరకు ముద్దాయులను అరెస్టు చేయలేదని, ఈ కేసులో ఉన్న ముద్దాయిలను వెంటనే అరెస్టు చేయ్యాలని, గత నెల 24వ తేదీన దరఖాస్తు ఇస్తే ఈనెల 4వ తేదీ వరకు ఎఫ్.ఐ.ఆర్ రిజిస్టర్ చేయకపోవడంపై నిర్లక్ష్యం వహించిన ఖమ్మం ఏసీపీని అలాగే ఖమ్మం 2 టౌన్ సిఐ పై చర్యలు తీసుకోవాలని, న్యాయవాద దంపతులపై దాడిచేసిన వారిని అపార్టుమెంటు నుండి ఖాళీ చేయించి అక్కడ శాంతియుత వాతవరణమును నెలకొల్పాలని, అలాగే న్యాయవాద కుటుంబానికి రక్షణ కల్పించాలని కోరారు. స్పెషల్ ఐపీఎస్ అధికారిని నియమించి విచారణ జరిపించి నాన్ బెలబుల్ కేసు నమోదు చేసి తక్షణమే శిక్ష పడేలా చేయాలని కోరారు . లేని పక్షంలో ఉద్యమకార్యచరణను ప్రకటించి ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డాక్టర్ కెవి కృష్ణారావు, గుంటేతి వీరభద్రం, లింగల రవి, బద్రునాయక్, లిక్కి కృష్ణారావు, శ్రీనివాసరెడ్డి, పద్మాచారి, అబ్దుల్ రెహమాన్, నజీమా, ప్రభాకర్, శ్రీను, కిషన్ నాయక్ , సతీష్ నాయక్, వినయ్, పెరుగు వెంకటరమణ, ఉపేంద్ర నాయక్, చంద్రశ్రీ, అఖిల్, సుధాకర్, రమ్య, వెంకటేశ్వర్లు, వీరన్న, రాము, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

చెరువులు ఎర్రబోడు పంచాయతీకే చెందాలని కలెక్టర్‌కు వినతి

నవతెలంగాణ-కారేపల్లి

కారేపల్లి మండలం ఎర్రబోడులో గ్రామపంచాయతీ పరిధిలోని కుంటలు, చెరువులను ఆదే పంచాయతీకి చెందేలా చర్యలు తీసుకోవాలని ఎర్రబోడు పంచాయతీ ప్రజలు సోమవారం జిల్లా కలెక్టర్ వీపీ.గౌతమ్‌ను కలిశారు. ఉపసర్పంచ్ వజ్జా నరేష్, సోసైటీ మాజీ అధ్యక్షులు ఈసాల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పంచాయతీ ప్రజలు ఖమ్మంలో ప్రజాదర్బార్‌లో కలెక్టర్‌ను కలిశారు. పంచాయతీకి ఆదాయ వనరైన కుంటలు, చెరువులపై ఎర్రబోడు పంచాయతీకే హక్కు దక్కేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను వారు కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించి న్యాయం చేస్తామని పంచాయతీ ప్రజలకు హామీ ఇచ్చినట్లు ఉపసర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కల్తి రామచంద్రు, కరపటి లక్ష్మయ్య, బుగ్గ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

యువతిని వేధిస్తున్న యువకుడిపై కేసు

నవతెలంగాణ-కారేపల్లి

ప్రేమ పేరుతో యువతిని వేధిస్తున్న యువకుడిపై సోమవారం కారేపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. కారేపల్లి పోలీసులు తెల్పిన వివరాలు ఇలా ఉన్నాయి. కారేపల్లి మండలం వెంకిట్యాతండాకు చెందిన యువతి(19)ని అదే గ్రామానికి చెందిన అంగోత్ మహేందర్ ప్రేమించాలని వెంటపడుతూ మానసికంగా వేధిస్తున్నాడు. యువకుడి వేధింపులు అధికంగా కావటంతో యువతి కారేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆ ఫిర్యాదు మేరకు కారేపల్లి ఏఎస్సై నాగరాజకుమారి మహేందర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుద్ఘాతంతో వ్యక్తి మృతి

నవతెలంగాణ - ఎర్రుపాలెం

మండల కేంద్రమైన ఎర్రుపాలెం నందు విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై యం.సురేష్ తెలిపిన వివరాల మేరకు ఎర్రుపాలెం ఎస్సీ కాలనీకి చెందిన కోట సతీష్ (28) తన వృత్తి నిమిత్తం రేమిడిచర్ల గ్రామానికి చెందిన చెరుకుమల్లి సాంబయ్య ఎర్రుపాలెం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఇంటికి సీలింగ్ పని చేస్తుండగా ప్రమాదవశాత్తూ కరెంట్ తీగలు తగలడంతో విద్యుత్ షాక్‌కి గురయ్యి అక్కడికక్కడే మరణించాడన్నారు. మతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మధిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

మిర్చి రైతుల గోడు పట్టని ప్రభుత్వం : కాంగ్రెస్

నవతెలంగాణ-కారేపల్లి

మిర్చి తోటలు నల్లి, తామరతో పూర్తిగా తుడిచి పెట్టకపోతున్నాయని, నష్టపోతున్న రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం పట్టనట్లు వ్యవహరిస్తుందని టీపీసీసీ సభ్యులు ధరావత్ రాంమ్మూర్తి నాయక్ విమర్శించారు. సోమవారం కారేపల్లి మండలో పాటిమీదిగుంపు, చీమలపాడు, రేలకాయలపల్లి, జైత్రంతండా, రంగురాళ్లబోడు గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు పర్యటించారు. మిర్చి తోటలకు పరిశీలించి రైతుల బాధలను తెలుసుకున్నారు. ఎకరాకు రూ.1.50 లక్షలు పెట్టుబడి పెట్టితే తెగుళ్లతో తుడిచిపెట్టుక పోతుందని రైతులు కాంగ్రెస్ నవాయకుల ముందు వాపోయారు. రంగురాళ్లబోడులో మౌళిక వసతులు లేక, పూరిగుడెల్లో నివాసం ఉండటంను వారు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పగడాల మంజుల, మండల అధ్యక్షులు తలారి చంద్రప్రకాశ్, మాజీ సర్పంచ్ దారావత్ భద్రునాయక్, మాజీ ఎంపీటీసీ గడ్డం వెంకటేశ్వర్యు, నాయకులు వాంకుడోత్ గోపాల్, వీసాల వెంకటేశ్వర్లు, లాకావత్ రాజేష్, కిషన్, బానోత్ బాలకృష్ణ, బావోత్ తారాచెంద్, బాలాజీ, సూర్యనాయక్, యదళ్లపల్లి నారాయణ, బండారి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌కం ట్యాక్స్ కమిషనర్‌ను కలిసిన టీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ-కారేపల్లి

ఇన్‌కం ట్యాక్స్ కమిషనర్ లావుడ్యాజీవన్‌లాల్ అయని సతీమణి సీఐఎస్ఎఫ్(ఐజీ) సిప్రావాత్సవాలను కారేపల్లి మండల టీఆర్ఎస్ నాయకులు సోమవారం కలిశారు. హైదరాబాద్‌లో వారి ఇంటివద్ద వారిని కలిసిన నాయకులు పుష్పగుచ్చాలు ఇచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జీవన్‌లాల్ దంపతులకు శుభాకాంక్షలు తెలిపిన వారిలో బీఆర్ఎస్ యూత్ జిల్లా నాయకులు అజ్మీర వీరన్న, మండల అధ్యక్షులు పెద్దబోయిన ఉమాశంకర్, వైస్ఎంపీపీ రావూరి శ్రీనివాసరావు, దిశకమిటీ జిల్లా సభ్యులు బానోత్ కుమార్, మార్కెట్ కమిటీ డైరక్టర్ వాంకుడోత్ నరేష్‌లు ఉన్నారు.

ముఖ్యమంత్రి ఓవర్సీస్ పథకానికి దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-కొణిజర్ల

విదేశాల్లో ఉన్నత విద్యలను అభ్యసిస్తున్న మైనారిటీ విద్యార్థులు మైనారిటీ సంక్షేమ శాఖ ద్వారా అందిస్తున్న సీఎం ఓవర్సీస్ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని మండల మైనారిటీ నాయకులు షేక్ నాగుల్ మీరా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం ఐదు లక్షల రూపాయల లోపు కలిగి, గత ఏడాది 2022 ఆగస్ట్-డిసెంబర్లో అడ్మిషన్ పొందిన విద్యార్థులు మాత్రమే ఈ స్కాలర్ షిప్ పొందడానికి అర్హులని పేర్కొన్నారు. అర్హత కలిగిన విద్యార్థులు ఈనెల 23వ తేదీ లోపు సంబంధిత ధవీకరణ పత్రాలతో డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ తెలంగాణ ఈపాస్. సీజీజీ. గౌవ్. ఇన్ అనే వెబ్ సైట్ నందు సమర్పించాలని తెలిపారు. ఈ ఉపకార వేతనాలకు ఎంపికైన వారికి రూ. 20 లక్షలతో పాటు విమాన చార్జీల నిమిత్తం రూ.60 వేలు సైతం అందిస్తారని చెప్పారు. ఈ అవకాశాన్ని మైనారిటీ వర్గాలకు చెందిన ముస్లింలు, క్రిస్టియన్లు, సిక్కులు, జైనులు, బౌద్ధులు, పార్సీలు, సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.

హైవే బ్రిడ్జి నిర్మాణ పనులను అడ్డుకున్న గువ్వలగూడెం దళితులు

నవతెలంగాణ- నేలకొండపల్లి



మండలంలోని గువ్వలగూడెం గ్రామ సమీపంలో నూతనంగా నిర్మాణం చేస్తున్న హైవే అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణ పనులను సోమవారం గ్రామానికి చెందిన దళితులు అడ్డుకున్నారు. పనులు జరుగుతున్న ప్రదేశంలో గ్రామ దళితులకు చెందిన ముత్యాలమ్మ ఆలయం ఉంది. తాము అనాదిగా ముత్యాలమ్మ తల్లిని పూజించుకుంటూ వస్తున్నామని నేడు తమ ఆలయం హైవే పనుల మూలంగా కోల్పోతున్నామన్నారు. తాము కోరిన కోరికలు తీర్చే తల్లిగా నిత్య పూజలు అందుకుంటున్న ముత్యాలమ్మ తల్లి ఆలయాన్ని వేరొక చోట నిర్మాణం చేసిన తదుపరి మాత్రమే హైవే నిర్మాణ పనులు కొనసాగించాలని పట్టుబట్టారు. లేనియెడల పనులు జరగకుండా అడ్డుకుంటామంటూ ఆందోళనకు దిగారు. ఇదే సందర్భంలో అక్కడి కొంతమంది మహిళలకు అమ్మవారు ఆవహించి పూనకాలుతో ఊగిపోయారు. విషయం తెలుసుకున్న ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు వంగూరి ఆనందరావు మాదిగ అక్కడకు చేరుకొని దళితులతో మాట్లాడి స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. జరిగిన విషయాన్ని తహసీల్దార్ ధారా ప్రసాదుకు వివరించి ఆలయ నిర్మాణాన్ని చేపట్టాలని డిమాండ్ చేస్తూ వినతిపత్రం అందజేశారు. స్పందించిన తహసిల్దార్‌పై అధికారులతో మాట్లాడి ముత్యాలమ్మ గుడి పునర్నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో గువ్వలగూడెం గ్రామ దళిత మహిళలు, పురుషులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మున్నేరులో దూకి తల్లీకుమార్తె ఆత్మహత్య

నవతెలంగాణ-ఖమ్మం

మున్నేరులో దూకి తల్లి, కుమార్తెలు ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నేలకొండపల్లి మండలం పైనంపల్లి గ్రామానికి చెందిన ఉడతలు నాగరాజు, ఉమారాణి(23) భార్యాభర్తలు. వారికి 18నెలల యశశ్వివైవిజ్ఞతో పాటు మరో కూతురు ఉంది. ఈనెల 8వ తేదీన ఉమారాణికి ఆమె అత్తతో గొడవ కావడంతో ఆదివారం మధ్యాహ్నం తన చిన్నకూతురును తీసుకొని ఇంటి నుంచి వెళ్లిపోయింది. భర్త, కుటుంబ సభ్యులు రాత్రంతా వెతకగా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో నేలకొండపల్లి పోలీసు స్టేషన్లో సోమవారం ఫిర్యాదు చేశారు.

మధ్యాహ్నం 3 గంటల సమయంలో మున్నేరులో గుర్తుతెలియని చిన్నారి మృతదేహం ఉన్నట్లు గుర్తించిన స్థానికులు డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం అందించారు. స్పందించిన ఖమ్మం త్రీ టౌన్ స్టేషన్ సీఐ సర్వయ్య, ఎస్సై ఉఫాతుల్ రఫీ సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. గుర్తు తెలియని చిన్నారి మృతదేహం మున్నేరు వద్ద ఉన్న విషయాన్ని తెలుసుకున్న నాగరాజు అక్కడకు చేరుకొని చిన్నారిని తన కూతురు యశశ్వి వైవిజ్ఞగా గుర్తించాడు. పోలీసులు అన్నం సేవా ఫౌండేషన్కు సమాచారం ఇవ్వగా అన్నం శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి చేరుకొని చిన్నారి మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. సంఘటనా స్థలంలో తల్లి ఉమారాణి కాళ్లకు వేసుకున్న చెప్పులు ఉండటంతో ఆమె కూడా మున్నేరులో దూకి ఆత్మహత్యకు పాల్పడిందని భావించిన పోలీసులు గజ ఈతగాళ్లతో మున్నేరులో గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రం 6 గంటల సమయంలో తల్లి ఉమారాణి మృతదేహాన్ని మున్నేరులో గుర్తించారు. ఈ మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వాసుపత్రి తరలించారు.

ఘనంగా ఎమ్మెల్యే కందాళ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-కూసుమంచి



పాలేరు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలు సోమవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. తన అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు కందాళకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. తొలుత మండల కేంద్రంలోని శివాలయంలో ఎమ్మెల్యే కందాళ కుటుంబ సభ్యులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తల సేమియా వ్యాధిగ్రస్తుల కొరకు కందాళ అభిమానులు రక్తదానం చేశారు. అనంతరం భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

అలాగే మండల పరిధిలోని జక్కేపల్లి ఎస్సీ కాలనీ గ్రామపంచాయతీలో సోమవారం ప్రాథమిక పాఠశాలలో పాలేరు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి, జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ రాయబారపు స్వాతి రమేష్ ఆధ్వర్యంలో స్కూల్లో కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం స్కూల్ పిల్లలకు నోటుబుక్కులు, పెన్నులు, పెన్సిల్స్, పలకలు, మాస్కులు, శానిటైజర్స్, పిల్లలకు పంపిణి చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కందుల వెంకటనారాయణ, ఉప సర్పంచ్ తంగళ్ళ ఉమా లక్ష్మణ్, గ్రామ శాఖ అధ్యక్షుడు ధారా వెంకటేశ్వర్లు, సొసైటీ వైస్ చైర్మన్ దారాజశ్రీ, వార్డ్ మెంబర్స్ సీతయ్య, వెంకటేశ్వర్లు, కో ఆప్షన్ నెంబర్ యాకోబ్, రైతు అధ్యక్షులు ఎస్.కె హసన్, స్కూల్ టీచర్ ఉమా, ఆశా వర్కర్ వెంకటరమణ పాల్గొన్నారు.

జిల్లాస్థాయి క్రీడల్లో 'మిస్ట్' విద్యార్థులకు పతకాలు

నవతెలంగాణ- సత్తుపల్లి

ఉమ్మడి జిల్లాస్థాయిలో ఈనెల 5, 6 తేదీల్లో కొత్తగూడెంలో నిర్వహించిన క్రీడల పోటీల్లో సత్తుపల్లి మదర్ థెరెసా పాలిటెక్నిక్ విద్యార్థులు వివిధ విభాగాల్లో పతకాలు సాధించినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ చలసాని హరికృష్ణ తెలిపారు. షటిల్ సింగిల్స్ బాలుర విభాగంలో మెకానికల్ బ్రాంచికి చెందిన ఎండీ సాదిక్‌పాషా ప్రథమ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. డిస్కస్‌త్రో బాలుర విభాగంలో మెకానికల్ బ్రాంచికి చెందిన కె.గుణశేఖరరెడ్డి ప్రథమస్థానాన్ని దక్కించుకున్నారన్నారు. వాలీబాల్ బాలుర విభాగంలో పి.రవి అండ్ టీం రెండో స్థానం, షటిల్ డబుల్స్ బాలికల విభాగంలో ఈఈఈ విభాగం విద్యార్థిని జీ.వినీత, ఈసీఈ విద్యార్థిని కె.చందన రెండో స్థానాన్ని కైవశం చేసుకున్నారన్నారు. 400 మీటర్ల రిలే పరుగు పందెం బాలికల విభాగంలో ఎం.శ్రీజ అండ్ టీం రెండో స్థానం, 1600 మీటర్ల రిలే పరుగు పందెం బాలికల విభాగంలో కె.మిన్నూశ్రీ అండ్ టీం రెండో స్థానం, ట్రిపుల్ జంప్ బాలికల విభాగంలో పి.జాగృతి మూడో స్థానంలో నిలిచిందన్నారు. జావలింగ్ త్రో బాలికల విభాగంలో ఎం.శ్రావణి మూడో స్థానంలో నిలిచిందని ప్రిన్సిపాల్ హరికృష్ణ తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ చలసాని హరికృష్ణ, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ చలసాని సాంబశివరావు, ఛైర్మెన్ కంచర్ల సత్యనారాయణ, ఇంజినీరింగ్ డీన్ డాక్టర్ జాకీర్ హుస్సేన్, డిప్లొమో డీన్ ఎంవీ రామచంద్రరావు, పీడీ ఆర్.ముజ్జు, వి.మణికంఠ, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు అభినందించారు.

డిప్లొమో ఫలితాల్లో 'మిస్ట్' విద్యార్థుల ప్రతిభ

డిప్లొమో మొదటి సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో సత్తుపల్లి మదర్ థెరెసా పాలిటెక్నిక్ విద్యార్థులు రాష్ట్రస్థాయిలోనే అత్యధిక మార్కులు సాధించి తమ ప్రతిభను కనబర్చినట్లు ప్రిన్సిపాల్ చలసాని హరికృష్ణ తెలిపారు. బ్రాంచీల వారీగా అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు ఈ క్రింది విధంగా కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగంలో కె.షినోజ్ 10/10, ఎంఎస్‌వీఎల్ శ్రీప్రత్యూష 10/10, ఎన్.హర్షిత 9.87, పి.రజని 9.73/10 ఎస్‌జీపీఏలతో టాపర్లుగా నిలిచారన్నారు. సివిల్ ఇంజినీరింగ్ విభాగం నుంచి పి.ఉదయకిరణ్ 9.2/10, ఈఈఈ విభాగం నుంచి పి.జగదీశ్ 8.8/10 ఎస్‌జీపీఏలు సాధించారన్నారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ హరికృష్ణతో పాటు సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ చలసాని సాంబశివరావు, ఛైర్మెన్ కంచర్ల సత్యనారాయణ ఆయా విభాగాల అధిపతులు అభినందించారు.

దళిత బంధుతో ఆర్థిక స్వావలంబన సాధించాలి

రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ కొండబాల కోటేశ్వరరావు

నవతెలంగాణ- చింతకాని



దళిత బంధు పథకాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థిక స్వావలంబన సాధించాలని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ కొండబాల కోటేశ్వరరావు లబ్ధిదారులకు సూచించారు. దళిత బంధు పథకంలో చింతకాని మండలం గాంధీనగర్ కాలనీ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన మెడికల్ షాప్‌ను స్థానిక ప్రజాప్రతినిధులతో కలసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కొండబాల మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన దళిత బంధు పథకం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కాళంగి లలిత, ఎంపీపీ కోపూరి పూర్ణయ్య, జడ్‌పీటిసి కిషోర్, వైస్ ఎంపిపీ గురిజాల హనుమంతరావు, బొరాస మండల అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్య, ఎస్సి కార్పొరేషన్ ఈడి ఏలూరి శ్రీనివాసరావు, ఎంపివో మల్లెల రవీంద్ర ప్రసాద్, నాగులవంచ సహకార సంఘం డైరెక్టర్ వంకాయలపాటి లచ్చయ్య, కాళంగి డేవిడ్ పలువురు నాయకులు పాల్గొన్నారు

పోషకాహారం అందించాలి : ఎంపీటీసీ

నవతెలంగాణ-కల్లూరు



తల్లులకి, పిల్లలకి అందిస్తున్న పోషకాహారం సక్రమంగా అందించాలని ఎంపీటీసీ కొండూరి కిరణ్ కుమార్ అన్నారు. గోపాలకుంట్లోనీ 14 వార్డులో ఏర్పాటు చేసిన అంగన్వాడి కేంద్రాన్ని సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడి కేంద్రానికి వస్తున్న పిల్లలు ఎంతమంది, గర్భిణీలు ఎంతమంది వస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు నరసింహారావు అంగన్వాడి టీచర్ రత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

డివైఎఫ్ఐ. ఏఐవైఎఫ్ కార్యకర్తల ముందస్తు అరెస్ట్

నవతెలంగాణ- చింతకాని

ఎస్సై కానిస్టేబుల్ అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్ లో తలపెట్టిన ప్రగతి భవన్ ముట్టడి కార్యక్రమం నేపథ్యంలో చింతకాని మండలం డివైఎఫ్ఐ, ఏఐవైఎఫ్ నాయకులను పోలీసులు తెల్లవారుజామున ముందస్తు అరెస్టు చేసి స్టేషన్‌కి తరలించారు. అరెస్ట్ చేసిన వారిలో డివైఎఫ్ఐ మండల అధ్యక్ష కార్యదర్శులు భయ్యా బాలాజీ, గద్దం విజయకుమార్, ఏఐవైఎఫ్ నాయకులు అబ్బూరి మహేష్, చలమల అనిల్, వెంకట్రావు తదితరులు ఉన్నారు.

ముదిగొండ : పోలీస్ కానిస్టేబుల్ సమస్యల పరిష్కరించాలంటూ చలో హైదరాబాదు కార్యక్రమానికి తరలివెళ్లే ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులను ముందస్తుగా పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్కు తరలించారు. పోలీసులు అరెస్ట్ చేసిన వారిలో డివైఎఫ్ఐ మండల అధ్యక్ష కార్యదర్శి బట్టు రాజు, మెట్టెల సతీష్, ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు పురిమెట్ల సాయిరాం, నాయకులు పారుపల్లి నాగేశ్వరరావు, నాయిని నరేష్, కాంచని రవి, అల్లిక హరికృష్ణలు ఉన్నారు.

షైన్ ఇండియా విద్యార్థినికి స్వర్ణ పతకం

నవతెలంగాణ- ఖమ్మం

బెంగళూర్‌లో ఈనెల 7, 8 తేదీలలో జరిగిన కరాటే పోటీలలో (కాటా-వ్యక్తిగత విభాగంలో) ఖమ్మం షైన్ ఇండియా స్కూల్ విద్యార్థిని కంటమనేని సాయి శ్రీలలిత స్వర్ణ పతకం సాధించారు. తొలుత షైన్ ఇండియా స్కూల్ సెక్రెటరీ అండ్ కరెస్పాండెంట్ తాళ్లూరి ఉషారాణి అభినందించారు. ఈ సందర్భంగా షైన్ ఇండియా స్కూల్ చైర్మన్ తాళ్లూరి సృజన్ కుమార్, కరస్పాండెంట్ తాళ్లూరి ఉషారాణి మాట్లాడుతూ తమ పాఠశాలలో పిల్లలకు చదువుతో పాటు సహపాఠ్య కార్యక్రమాలైన కరాటే, డాన్స్, డ్రాయింగ్, ఆర్ట్స్ క్రాఫ్ట్, ఆటలు, క్రీడలు మొదలైన వాటికి ప్రాధాన్యత ఇస్తున్నామని, కేవలం చదువు ద్వారానే పిల్లలలో సమగ్ర మూర్తిమత్వ అభివృద్ధి జరగదని, చదువుతో పాటు ఈ సహపాఠ్య కార్యక్రమాలు పిల్లల సంపూర్ణ అభివృద్ధికి తోడ్పడతాయన్నారు.

మధిరలో ఆకృతి షాపింగ్ మాల్ ప్రారంభం

నవ తెలంగాణ-మధిర

నూతన హంగులతో నాళ్ళ నారాయణరావు జీవి మాల్ ఖమ్మం వారి ఆధ్వర్యంలో మధిర అంబేద్కర్ సెంటర్ (కళామందిర్ రోడ్డు) నందు నూతనంగా ఏర్పాటు చేసిన ఆకృతి షాపింగ్‌మాల్‌ను గుర్రం వాసు, గుర్రం సుమన్, గుర్రం అంకిత్‌లతో పాటు ముఖ్య అతిథిగా వచ్చిన సిఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అతిథులుగా మున్సిపల్ చైర్ పర్సన్ మొండితోక లత జయాకర్ , వైస్ చైర్ పర్సన్ శీలం విద్యాలత వెంకటరెడ్డి, కమిషనర్ అంబటి రమాదేవి, డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, రంగా హనుమంతరావు తదితరులు హాజరయ్యారు.



ఐద్వా ఆధ్వర్యంలో షేక్ ఫాతిమా జయంతి వేడుకలు

నవతెలంగాణ-ఖమ్మం

ఐద్వా, ఆవాజ్ వన్‌టౌన్ కమిటీల ఆధ్వర్యంలో స్థానిక తుమ్మలగడ్డ బజార్‌లో ఎస్‌కె.ఫాతిమా జయంతి వేడుకలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా వన్‌టౌన్ కార్యదర్శి భాగం అజిత మాట్లాడుతూ ఫాతిమా ముస్లిము మైనార్టీ నుండి మొట్టమొదటి ఉపాధ్యాయురాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ వన్‌టౌన్ కార్యదర్శి నాగుల్‌మీరా, హుస్సేన్, ఖైరూన్ బీ, మహిమూద్, రాజియా తదితరులు పాల్గొన్నారు.

నామ కృషితో విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు

నవతెలంగాణ-ఎర్రుపాలెం



బీఆర్ఎస్ లోక్ సభా పక్ష నేత, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు కృషితో ఎర్రుపాలెం మండలం నర్సింహాపురం గ్రామ రైతులు, ప్రజల కరెంట్ కష్టాలు తీరాయి. విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ కాలిపోయి గత కొంతకాలంగా ఇబ్బందిపడుతున్న రైతులు, గ్రామస్తులు ఈ విషయమై ఎంపీ నామను కలిసి, పరిస్థితి వివరించారు. ఎంపీ నామ వెంటనే స్పందించి ఈ విషయమై జిల్లా విద్యుత్ ఎస్ఇతో స్వయంగా మాట్లాడారు. ఆయన సత్వరమే స్పందించి, సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో స్థానిక సిబ్బంది తాజాగా పాతదాని స్థానంలో కొత్త విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేశారు. దీంతో రైతుల వెతలు తీరినట్లయింది.

కెసిఆర్ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి

- పోడు సాగుదారులకు హక్కు పత్రాలు ఇవ్వాలి
- పోడు భూముల్లో ప్లకార్డులతో సీపీఐ(ఎం) నిరసన

నవతెలంగాణ-రఘునాథపాలెం



పోడు సాగుదారులకు హక్కు పత్రాలు ఇవ్వాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి ఎస్.నవీన్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిధిలోని గణేశ్వరం గ్రామంలో పోడు భూముల్లో నిలుచొని ప్లకార్డులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఎస్.నవీన్ రెడ్డి మాట్లాడుతూ సీపీఎం చొరవ మరియు పార్టీ ఆధ్వర్యంలో జరిగిన అనేక పోరాటాల ఫలితంగా దరఖాస్తులు తీసుకున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పోడు భూములను 2018 వరకు సాగులో ఉన్న వారికి దరఖాస్తు చేసుకున్న వారందరికీ హక్కు కల్పిస్తామని కెసిఆర్ పేర్కొన్నారని గుర్తు చేశారు. సర్వే నిర్వహించి నెలలు గడుస్తున్నా నేటికీ హక్కు పత్రాలు ఇవ్వలేదని వారు విమర్శించారు. తక్షణమే సర్వే పూర్తయిన రైతులందరికీ హక్కుపత్రాలు మంజూరు చేసి కేసీఆర్ ప్రభుత్వం మాట నిలుపుకోవాలన్నారు. అనేక సంవత్సరాలుగా పోడు భూమిని నమ్ముకుని జీవనం కొనసాగిస్తున్న బీసీలకు హక్కు పత్రాలు ఇవ్వాలని అన్నారు. మండలంలో తిరస్కరణకు గురైన దరఖాస్తులను రీ సర్వే నిర్వహించి, రైతులకు న్యాయం జరిగేటట్టు చూడాలని వారన్నారు. గ్రామంలో ఉండే గిరిజనులు, పేదలకు, సామూహిక అవసరాల కోసం అటవీ భూములను కేటాయించాలని చట్టం. చెపుతోంది, కానీ అందుకు విరుద్ధంగా ఇంటిస్థలాలు, డబుల్ బెడ్రూం ఇళ్ళకు స్థలాలు ఇవ్వాలని పెట్టుకున్న దరఖాస్తులను తిరస్కరిస్తున్నారన్నారు.. గిరి వికాస్ కింద హక్కు పత్రాలున్న భూములలో మంజూరైన బోర్లు, విద్యుత్ సౌకర్యాలను సైతం తిరస్కరిస్తున్నారన్నారు. తక్షణమే పోడు భూముల సమస్యకు పరిష్కారం చూపకపోతే భవిష్యత్తులో రైతులందుని కూడా పెట్టి పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ కోఆప్షన్ సభ్యులు ఇమామ్, సీపీఐ(ఎం) నాయకులు ప్రతాపనేని వెంకటేశ్వర్లు, కూచిపూడి నరేష్, తిరుపయ్య శ్రీనివాస్, వెంకన్న, రామకష్ణ, భద్రు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట మిషన్ భగీరథ కార్మికులు ధర్నా

నవతెలంగాణ- ఖమ్మం



ఆర్ డబ్ల్యుఎస్ఎస్(మిషన్ భగీరథ) కార్మికులు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం ఖమ్మం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాని ఉద్దేశించి జిల్లా అధ్యక్షులు విష్ణువర్ధన్ మాట్లాడుతూ గత 25 సంవత్సరాలుగా పనిచేస్తున్న మిషన్ భగీరథ కార్మికులను ప్రభుత్వం గుర్తించి వీరికి తగు న్యాయం చేయాలని, కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని, పిఎఫ్ ,ఈఎస్ఐ సక్రమంగా కట్టించాలని, పెండింగ్‌లో ఉన్న వేతన, పెండింగ్లో ఉన్న బోనస్‌ను వెంటనే ఇవ్వాలని, అదేవిధంగా మిషన్ భగీరథ కార్మికుల ఉద్యోగ భద్రత కల్పించి వారి కుటుంబాలకు తగ న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమస్యలు పరిష్కరించకుంటే ఈ ఉద్యమాన్ని ఇంకా ఉధతం చేసి దశలవారీగా ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ స్నేహలతకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు అన్నం వెంకయ్య, జిల్లా కార్యదర్శి పగంటి రాంబాబు, బెతు శ్రీను, అనుబోతుల బాలకష్ణ, మధుసూదన్‌రెడ్డి, జంగం నరసింహారావు, మేకలతిరుపతిరావు, గోడ్ల నరసింహారావు, మనోజ్ లక్ష్మణ్, ఎస్కే కాజాఫీర్, పిచ్చయ్య, గుమా నరసింహారావు యాదగిరి, సీతారాములు, ప్రసాద్, జైపాల్ విప్లవ్ వీరస్వామి, బాలాజీ, పాపారావు, హరికష్ణ తదితరులు పాల్గొన్నారు.

సాగర్ జలాల సరఫరాలో వారాబంధి సడలించాలి

- నిరంతరాయంగా సాగునీరు సరఫరా చేయాలి
- తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా అదనపు కలెక్టర్‌కి వినతి

నవతెలంగాణ-ఖమ్మం



సాగర్ జలాలు సరఫరాలో వారాబంధి సడలించి నిరంతరాయంగా సాగునీరు అందించాలని వైరా రిజర్వాయర్ నుంచి ఆయకట్టు సాగునీరు సరఫరాపై స్పష్టత ఇవ్వాలని తెలంగాణ రైతు సంఘం ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రైతులు సోమవారం గ్రీవెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో వేల ఎకరాల్లో యాసంగి వరి పంట నాట్లు వేయటం జరుగుతుంది అని, మరోవైపు వానాకాలం సీజన్లో అధిక వర్షాలు వల్లన దెబ్బ తిన్న పత్తి, తెగుళ్ల సోకి మిర్చి పంట తొలిగించి రెండవ పంటగా మొక్కజొన్న వేస్తున్నారని, సాగర్ ఆయకట్టులో మిర్చి ఇతర పంటలు కూడా సాగులో ఉన్నాయి అన్నారు. వారబంది ద్వారా సాగర్ జలాలు సరఫరా వల్ల, వరినాట్లకు, మొక్కజొన్న పంటకు ఏకకాలంలో సాగు నీరు అవసరం ఏర్పడిందని, మధ్యలో వారం, పది రోజుల సాగు నీరు సరఫరా నిలుపుదల చేయడం వల్ల సాగర్ ఆయకట్టు చివర భూములకు సాగునీరు అందటం లేదని, వారం గ్యాపు రావడం తొలి దశలో ఉన్న పంట దెబ్బ తినే అవకాశం ఉందని వారబంది సడలించి నిరంతరాయంగా సాగునీరు అందించాలని కోరారు. వైరా రిజర్వాయర్ ఆయకట్టు నీటి సరఫరాపై అధికారులు స్పష్టత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ స్నేహలత ఇరిగేషన్ అధికారులతో వెంటనే సంప్రదించి రైతులకు సాగునీరు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు.కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మాదినేని రమేష్, ఉపాధ్యక్షులు తాతా భాస్కరరావు, వాసిరెడ్డి ప్రసాద్, ఎస్కే మీరా, బోనకల్ మాజీ ఎంపిపి తూళ్ళూరి రమేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు తాళ్ళపల్లి కృష్ణ, తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు చెరకుమల్లి కుటుంబరావు, శీలం సత్యనారాయణ రెడ్డి, కుసుపూడి మధు, తూము చంద్రరావు, రైతులు పాల్గొన్నారు.

"కాజా రాధాకృష్ణమూర్తి జీవిత చరిత్ర" పుస్తకావిష్కరణ

నవతెలంగాణ-వైరాటౌన్



వీర తెలంగాణ సాయుధ పోరాట యోధుడు అమరజీవి కామ్రేడ్ కాజా రాధాకృష్ణమూర్తి 16వ వర్ధంతి సభను వైరా మున్సిపాలిటీ పరిధిలోని గండగలపాడు గ్రామంలో సిపిఐ(ఎం) గ్రామ శాఖ కార్యదర్శి గుమ్మా నరసింహారావు అధ్యక్షతన ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు వాసిరెడ్డి విద్యాసాగర్ రావు కాజా రాధాకృష్ణమూర్తి చిత్రపటానికి పూలమాలలు నివాళులు అర్పించారు. వైరా నియోజకవర్గం ఇన్చార్జి భూక్యా వీరభద్రం కాజా రాధాకృష్ణమూర్తి స్థూపం వద్ద పార్టీ జెండాను ఎగురవేశారు. "కామ్రేడ్ కాజా రాధాకృష్ణమూర్తి జీవిత చరిత్ర" పుస్తకాన్ని వారి శిష్యుడు, మధు విద్యాసంస్థల చైర్మన్ మల్లంపాటి వీరభద్రరావు ఆవిష్కరించారు. అనంతరం జరిగిన వర్ధంతి సభలో మల్లెంపాటి వీరభద్రరావు మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కాజా కొరియర్‌గా, బోడేపూడి వెంకటేశ్వరావు అనుచరుడిగా పని చేశారని కొనియాడారు. ఈ వర్ధంతి సభకు ముఖ్య అతిథిగా హాజరైన సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భూక్యా వీరభద్రం మాట్లాడుతూ కాజా నిబద్ధత, గొప్పతనాన్ని, గురించి కమ్యూనిస్టు పార్టీ విలువలను, నేటి సామాజిక పరిస్థితులను, ముంచుకొస్తున్న మతోన్మాదం ప్రమాదాన్ని వివరించారు. కార్యక్రమంలో సిపిఐ (ఎం) వైరా పట్టణ కార్యదర్శి సుంకర సుధాకర్, పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు మల్లెంపాటి రామారావు, మచ్చా మణి, హరి వెంకటేశ్వరరావు, పుచ్చకాయల కృష్ణ, పుచ్చకాయల రామయ్య, పుచ్చకాయల వెంకటేశ్వర్లు, ఇమ్మడి సుధీర్, ఇమ్మడి వీరభద్రం, దేవబత్తిని నరసింహారావు, వాసిరెడ్డి రమేష్, కిన్నెర మోతి, బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతం

నవతెలంగాణ - బోనకల్



మండలంలోని నారాయణపురం గ్రామంలో బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో గ్రామ పంచాయతీ, మేఘ శ్రీ హాస్పిటల్స్ వారిచే సోమవారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ క్యాంపులో 120 మంది పేషంట్లకు బిపి, షుగర్, ఈసిజి, హిమోగ్లోబిన్, సిరమ్ క్రియాటిన్ పరీక్షలు నిర్వహించారు. మేఘశ్రీ హాస్పిటల్స్ ప్రముఖ వైద్యులు టి.పవన్ కుమార్ పేషంట్లకు వైద్యసేవలందించి ఉచితంగా మందులను గ్రామ సర్పంచ్ సాదినేని చంద్రకళావతి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సాధినేని చంద్రకళావతి మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా మండల కేంద్రంలో అమరజీవి తూము ప్రకాశరావు జ్ఞాపకార్థం బిపి, షుగర్, కంటి ప్రత్యేక క్యాంపును నిర్వహిస్తున్న బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని కొనియాడారు. బత్తినేని అంబులెన్స్, మేఘశ్రీహాస్పిటల్స్ అత్యవసర సమయాల్లో ప్రాణాలను కాపాడాతూ ప్రాణదాతగా నిలిస్తుందన్నారు. బత్తినేని ట్రస్ట్ వైద్య సేవలు అన్ని గ్రామాలకు విస్తరించాలని కోరారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన మేఘశ్రీ హాస్పిటల్స్ వైద్యసేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా వైద్యులు టి పవన్ కుమార్ మాట్లాడుతూ.. పేదలకు మెరుగైన వైద్యం అందించే సదుద్దేశ్యంతో మేఘశ్రీ హాస్పిటల్స్ హెల్త్ కార్డును రూపొందించామన్నారు. మండలంలోని ప్రతి ఒక్కరూ ఈ కార్డును పొంది సద్వినియోగించుకోవాలని సూచించారు. మండలంలోని జర్నలిస్టులందరికీ అతిత్వరలో ఉచితంగా మేఘశ్రీహాస్పిటల్స్ హెల్త్ కార్డును అందజేయనున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు సాధినేని మల్లికార్జున్ రావు, క్యాంపు నిర్వాహకులు ఆకెన పవన్, సాధనపల్లి ఆమర్నాథ్, నిఖిల్ సిబ్బంది యంగల గిరి, పండగ గోపి, ఇవాంజిలిన్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

31లోగా బకాయిలు వసూలు చేయాలి

నవతెలంగాణ- కల్లూరు

గ్రామ సమాక్యలు బ్యాంకుబకాయిలు ఈనెల 31లోగా చెల్లించాలని డిపిఎం శ్రీనివాస్ కోరారు సోమవారం బకాయిలు ఉన్న మొత్తం 24 గ్రామ సమాఖ్యలలో బకాయిలు చెల్లించుటకు ప్రణాళిక రూపొందించడం జరిగింది. శ్రీనిధి సిఐఎఫ్ బ్యాంకు లింకేజీ రుణాలు సకాలంలో చెల్లించేందుకు సమావేశం నిర్వహించడం జరిగింది. ఆ ప్రకారంగా శ్రీనిధి మరియు సిఐఎఫ్ బ్యాంకు లింకేజీ బకాయి ఉన్న గ్రామ సమాఖ్యలు గ్రామ దీపికల తోటి సమావేశంలో చర్చించడం జరిగింది. బ్యాంకు లింకేజీ అర్హత కలిగిన ప్రతి సమాఖ్య లో ప్రతి గ్రూపుకు బ్యాంకు లింకేజీ కొరకు ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ తెలియజేసిన ప్రకారం ఆయా బ్యాంకులలో ఎంసిపి సమర్పించాలని అందుకు కమ్యూనిటీ కోఆర్డినేటర్లు ప్రణాళిక ప్రకారం పని చేయాలని తెలియజేయడం జరిగింది. గురించి రివ్యూ సమావేశం నిర్వహించడం జరిగింది. సమావేశంలో ఈనెల 31 వరకు కమిట్మెంట్ లెటర్ తీసుకోవడం జరిగింది. సమావేశంలో స్వయం సహాయక సంఘాలు ఏబిసి కలిగి ఉండాలని తెలియజేయడం జరిగింది.

మాజీ ఎంపీ పొంగులేటి పర్యటన

నవతెలంగాణ-తల్లాడ

ఖమ్మం మాజీ పార్లమెంటు సభ్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి తల్లాడ మండలంలో సోమవారం పర్యటించారు. పర్యటనలో భాగంగా మండలంలోని మల్లారం, అంజనాపురం, తెలగారం గ్రామాలను సందర్శించి పలు కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు. ఆర్థికసాయాలను కూడా అందజేశారు. పలు ప్రయివేటు కార్యక్రమాల్లోనూ పొంగులేటి పాల్గొన్నారు. ఈ పర్యటనలో పొంగులేటి వెంట డీసీసీబీ మాజీ ఛైర్మన్ మువ్వా విజయబాబు, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, కొణిజర్ల ఎంపీపీ గోసు మధు, రాయల చిన్న పుల్లయ్య, గోపిశెట్టి వెంకటేశ్వర్లు, ఎర్రి నరసింహారావు, తుమ్మలపల్లి రమేష్, తాళ్ల జోసెఫ్, పొన్నం కష్ణయ్య, గొడుగునూరి లక్ష్మిరెడ్డి, గొడుగునూరి శ్రీనివాసరెడ్డి, రెడ్డెం వీరనరసింహారెడ్డి, గణేశుల రవి, పోట్రు శ్రీను, మాజీ జెడ్పీటీసీ కంచెపోగు వెంకటేశ్వర్లు, అయిలూరి రాజశేఖర్ రెడ్డి, వజ్రాల నరసింహారెడ్డి, వేంశెట్టి నాగన్న తదితరులు ఉ న్నారు.

పొంగులేటి నరోత్తమరెడ్డికి ఘన నివాళి



కల్లూరు : కల్లూరు మండలం నారాయణపురం గ్రామంలో ఇటీవల అకాల మృతి చెందిన పొంగులేటి నరోత్తమ రెడ్డి దశదిన కర్మలో పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం పాల్గొన్నారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళ్లు అర్పించారు. సోదరుడు నరోత్తమ రెడ్డి లోటు తీర్చలేనిదని ఈ సందర్భంగా పొంగులేటి పేర్కొన్నారు. పొంగులేటితో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు కూడా నరోత్తమరెడ్డి చిత్రపటానికి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో అంకిరెడ్డి సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలోకి పొంగులేటి వస్తే ఆహ్వానిస్తాం

కార్పొరేట్లకు ఊడిగం చేసే బీజేపీలో చేరొద్దు

నవతెలంగాణ-ఎర్రుపాలెం



మాజీ పార్లమెంటు సభ్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్ పార్టీలోకి సాధరంగా ఆహ్వానిస్తామని, ఆయన నిర్ణయానికి అనుగుణంగా వైయస్సార్ ఆశయ సాధన కోసం కలిసి పని చేద్దామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి కోరారు. మండల కేంద్రమైన ఎర్రుపాలెం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు ముఖ్య కార్య కర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజా వ్యతి రేక విధానాలను అవలంబిస్తూ కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్న బీజెపి పార్టీలో చేరవద్దని వారు హితవు పలికారు. పొంగులేటి పార్టీ మారుతున్నారని సోషల్ మీడియాలో వస్తున్న కథనాల నేపథ్యంలో లౌకికవాది పార్టీ అయిన కాంగ్రెస్ పార్టీలో చేరి ప్రజలకు తమపై ఉన్న ఆశయాలు ఆశలను నెరవేర్చాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు బండారు నరసింహారావు, ప్రతాపరెడ్డి, శీలం శ్రీనివాసరెడ్డి, మారా బత్తుల మోహనరావు, అనుమోలు వెంకటకష్ణారావు, షేక్ జానీ భాష, కంచర్ల వెంకట నరసయ్య, రాజీవ్‌గాంధీ, దేవరకొండ శ్రీను, భూక్య శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రీ బాలాజీ ఎస్టేట్స్ ఆధ్వర్యంలో సెమినార్

నవతెలంగాణ- ఖమ్మం

నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో మంగళవారం ఉదయం 10 గంటలకి శ్రీ బాలాజీ ఎస్టేట్స్ ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహిస్తున్నట్లు ఛైర్మన్ వత్సవాయి రవి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సెమినార్‌కి ప్రముఖ మోటివేటర్ గంపా నాగేశ్వర్‌రావు, శ్రీ వేణు భగవాన్ హాజరుకానున్నట్లు తెలిపారు. రియల్ ఎస్టేట్ లో రాణించాలంటే మెలకువలతో పాటు అలాగే జీవితంలో ఎదగాలంటే ఎలా కృసి చేయాలో టెక్నిక్స్ నేర్పిస్తారని, అందరూ ఫ్యామిలీతో ఈ సెమినార్‌కి హాజరుకావాలని కోరారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

నవతెలంగాణ- కల్లూరు



విద్యార్థులు ఇష్టపడి చదవితే విజయాలు మన వెంటే ఉంటాయని వ్యక్తిత్వ వికాస నిపుణులు శివశంకర్ ప్రసాద్ అన్నారు. సోమవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు వ్యక్తిత్వం వికాసంపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాలలో కల్లూరు లయన్స్ క్లబ్ అధ్యక్షులు చలువాది నగేష్, సత్తుపల్లి మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ సంగం వెంకటాపుల్లయ్య, కళాశాల ప్రిన్సిపాల్ కుతుంబాక శ్రీనివాసరావు, హైస్కూల్ హెడ్మాస్టర్ మాధవరావు, లయన్ సభ్యులు పీఎంజేఫ్ సత్యనారాయణ, జేబ్ మోహన్, మిట్టపల్లి సత్యనారాయణ, అధ్యాపకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నేత మల్లయ్య మృతి



- డీసీఎంఎస్ వైస్ చైర్మెన్ సంతాపం

నవతెలంగాణ పాల్వంచ

బీఆర్ఎస్ నాయకులు, పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలోని వెంగళరావు కాలనీ నివాసి వెలదండి మల్లయ్య అనారోగ్యంతో మరణించారు. సోమవారం ఆయన స్వగృహానికి వెళ్లిన డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు ఆయన భౌతిక కాయానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో 1535 కార్మిక నాయకులు వెలదండి ప్రసాద్, బి.వి.ఆర్ రాంబాబు, ధర్మపురి నాగేశ్వరరావు, సందు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

చేతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో దుప్పట్ల పంపిణీ



నవతెలంగాణ-ఆళ్ళపల్లి (గుండాల)

గుండాల మండల పరిధిలోని పలు గ్రామాల్లో చేతన ఫౌండేషన్ వ్యవస్థాపకులు భూక్యా సత్తులాల్ ఆధ్వర్యంలో ములుగు ఎమ్మెల్యే సీతక్క తనయుడు సూర్య చేతుల మీదుగా సోమవారం దుప్పట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్య మాట్లాడుతూ.. శీతాకాలం ప్రస్తుతం చలి తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో చేతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివాసీ ప్రాంతాలైన బాటన్ననగర్, ఘనాపురం, తక్కెల్లగూడెం గ్రామాలలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేయడం పట్ల హర్ష వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మామకన్ను సర్పంచ్ కొడెం ముత్యమాచారి, సాయనపల్లి ఎంపీటీసీ కల్తి కృష్ణారావు, గిరిజన పెద్దలు, ఫౌండేషన్ బాధ్యులు షేక్ రషీద్, చిట్టెం మనోహర్ పాల్గొన్నారు.

గల్లీ నుంచి ఢిల్లీ వరకు రాజ్యాధికార పీఠం సాధిద్దాం



- డీఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షులు డా.విశారదన్ మహారాజ్

నవతెలంగాణ-మణుగూరు

గల్లీ నుంచి ఢిల్లీ పీఠం వరకు రాజ్యాధికారాన్ని సాధిద్దామని డీఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షులు డా.విశారదన్ మహారాజ్ అన్నారు. సోమవారం మణుగూరుకు చేరుకున్న పది వేల కిలోమీటర్ల స్వరాజ్య పాదయాత్ర సందర్భంగా డీఎస్‌పీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. నూటికి పది శాతం లేని అగ్రకులాలు ఈ దేశాన్ని, రాష్ట్రాన్ని ఏలినప్పుడు 90 శాతంగా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రజలము ఈ దేశాన్ని ఏలద్దా అని ప్రశ్నించారు. సింగరేణి మణుగూరు, కొత్తగూడెం, ఇల్లెందు, గోదావరిఖని ప్రాంతాల్లో బొగ్గు గనులు తవ్వేది ఆ బొగ్గుతో వెలుగులు సృష్టించింది ఈ అణగారిన అట్టడుగు వర్గాలేనని గుర్తుంచుకోవాలన్నారు. తెలంగాణలో రెడ్డి, వెలమ, కమ్మ దొరల పాలనకు స్వస్తిపలికి మనగారిన వర్గాలను అధికారంలోకి తీసుకురావడం కోసమే పదివేల కిలోమీటర్ల స్వరాజ్యం పాదయాత్ర చేపట్టినట్లుగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి లక్ష్మణ్, జిల్లా కన్వీనర్ మధు, జిల్లా ఇన్చార్జి తలారి రాంబాబు, శత్రు నాయక్, సతీష్, రజినీకాంత్, బీసీ, ఎస్సీ, ఎస్టీ నాయకులు పాల్గొన్నారు.



ఆర్యవైశ్య మహాసభ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-చండ్రుగొండ

ఆర్యవైశ్య మహాసభ నూతన క్యాలెండర్‌ను ఆర్యవైశ్య మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం చండ్రుగొండలో ఆవిష్కరించారు. ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర నాయకులు కొదుమూరు దయాకర్ మాట్లాడుతూ ఆర్య వైశ్య సంఘ బలోపేతం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పసుమర్తి శేషగిరి, ఆర్యవైశ్య సంఘం మండల సభ్యులు కుక్కడపు రామారావు, శ్రీరంగం భద్రరావు, చిట్లూరి సుధాకర్, కుక్కడపు వెంకటేశ్వర రావు, పద్మానాభిని కృష్ణారావు, నేరెళ్ల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను చైతన్యపర్చే వేదికగా సోషల్ మీడియా నిలవాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని



నవతెలంగాణ-పాల్వంచ

ప్రజలను చైతన్యపర్చే వేదికగా సోషల్ మీడియా నిలవాలిని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. సోమవారం స్థానిక చంద్ర రాజేశ్వరరావు భవన్‌లో సీపీఐ సోషల్ మీడియా జిల్లా విస్తృత స్థాయి సమావేశం ఉప్పుశెట్టి రాహుల్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల జీవన పరిణామ క్రమంలో టెక్నాలజీ సోషల్ మీడియా పాత్ర కీలకంగా ఉందని పెట్టుబడిదారీ వ్యవస్థ సష్టించిన సమాచార మాధ్యాలతో సమాజానికి మంచితో పాటు చెడుకులోనయే టెక్నాలజీ యువతపై తీవ్ర ప్రభావం పడుతుందని అన్నారు. సోషల్ మీడియా ద్వారా సమాజానికి ఉపయోగపడే విధంగా నేటి యువత రాజకీయ చైతన్యాన్ని పెంపొందించుకోవాలని యువతకు ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె.సాబీర్ పాషా, జిల్లా కార్యవర్గ సభ్యులు గుత్తుల సత్యనారాయణ, ముత్యాల విశ్వనాథం, నరాటి ప్రసాద్, వై.శ్రీనివాసరెడ్డి, రేసు ఎల్లయ్య, అకోజు సునీల్ కుమార్, జిల్లా సమితి సభ్యులు వి.పూర్ణచంద్రరావు, వాసిరెడ్డి మురళి, భూక్య దస్రు, కంచర్ల జమలయ్య, యు.రాహుల్, ఎమ్.డి. యూసుఫ్, తదితరులు పాల్గొన్నారు.

13 నుండి నవీన్ కుమార్ మెమోరియల్ టోర్నమెంట్

నవతెలంగాణ-దుమ్ముగూడెం

ఈ నెల 13, 14, 15 తేదీలలో అచ్చుతాపురం గ్రామంలో సోయం నవీన్ కుమార్ మెమోరియల్ చర్ల, దుమ్ముగూడెం మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వహకులు అచ్చుతాపురం యూత్ సోమవారం తెలిపారు. ప్రతి ఏడాది ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించే టోర్నమెంట్‌లో పాల్గొనే క్రీడాకారులు రూ.300 ఎంట్రీ ఫీజు చెల్లించి ఈ నెల 10వ తేదీ లోపు నిర్వహణ కమిటీ వారికి టీముల పేర్లు అందజేయాలన్నారు. టీములో ఆడే క్రీడాకారుల ఆధార్ కార్డు తప్పనిసరిగా అందజేయాలన్నారు. టీములో పాల్గొనే క్రీడాకారులు ఒకే గ్రామ పంచాయతీకి చెందిన వారై ఉండాలన్నారు. తుది నిర్ణయం కమిటీ వారిదేనని వారు తెలిపారు. విజేతలకు మొదటి బహుమతి అచ్చుతాపురం ఉపాధ్యాయులు ఏజె ప్రభాకర్ అందజేసిన రూ.15,116, రెండవ బహుమతి కొర్సా వెంకటేశ్వరరావు (బీఈసివిల్) అందజేసిన రూ.7,516 అందజేయడం జరుగుతుందని కమిటీ చైర్మన్ ఏఎస్‌పీ రాష్ట్ర ఉపాధ్యక్షులు సోయం కామరాజు తెలిపారు. సీఐ దోమల రమేష్ చేతుల మీదుగా క్రీడలను ప్రారంభించడం జరుగుతుందన్నారు. పూర్తి వివరాలకు గట్టుపల్లి ప్రసాద్ 9441073806, గట్టుపల్లి సతీష్ 9502747300, సోయం నర్సింహారావు 9573455884, కుర్సం రవి 9505431700 అనే ఫోన్ నెంబర్లను సంప్రదించవచ్చాన్నారు. క్రీడల ముగింపు రోజు భోజన వసతి కల్పించడం జరిగిందని కావునా ఆశక్తి గల క్రీడా కారులు క్రీడల్లో పాల్గొని క్రీడా స్ఫూర్తిని చాటుకోవచ్చన్నారు.

ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడిగా గుమ్మడి శ్రీను

నవతెలంగాణ-దుమ్ముగూడెం

కాంగ్రెస్ పార్టీ దుమ్ముగూడెం మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా గుమ్మడి శ్రీను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు చింతిర్యాల రవికుమార్ నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య ఆదేశాసానుసారం సోమవారం గుమ్మడి శ్రీను నియమాకపు పత్రాన్ని అందజేశారు. తూరుబాక గ్రామానికి చెందిన గుమ్మడి శ్రీను కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా పని చేస్తున్నారు. ఈ సందర్భంగా గుమ్మడి శ్రీను మాట్లాడుతూ తన పై నమ్మకంతో ఎస్సీ సెల్ మండల అధ్యక్ష భాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే పొదెం వీరయ్య, చింతిర్యాల రవికుమార్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ డివిజన్, మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.



పంట నమోదు చేసుకోండి

నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి

మండల పరిధిలోని అబ్బుగూడెం గ్రామంలో వరి నాట్లును మండల వ్యవసాయ అధికారి అనూష పరిశీలించారు. యసంగిలో రైతులు ఎ రకమైన పంట సాగు చేస్తున్నారనేది ఏఈఓని సంప్రదించి పంట నమోదు చేసుకోవాలని రైతులుకు చూసించారు. యాసంగి వరి అధిక దిగుబడులు వచ్చేందుకు తగిన జాగ్రత్తలు తీసుకొని వరిలో పురుగు గొట్టాలు వంటివి రాకుండా తగిన మెందులు పిచికారి చేయాలని రైతులుకు చూసించారు. రైతులు పలువురు పాల్గొన్నారు.

గిరిజన కార్మికుల ఆకలి బాధలు పట్టని ప్రభుత్వం

- ఉధృతంగా సాగుతున్న సమ్మె
- ఏటీడబ్ల్యూఓ కార్యాలయం దిగ్బంధించిన కార్మికులు



భద్రాచలం



ఇల్లందు



పాల్వంచ

నవతెలంగాణ-భద్రాచలం

గిరిజన ఆశ్రమ పాఠశాలలు హాస్టల్ డైలీ వేస్ ఔట్సోర్సింగ్ కార్మికుల సమ్మె ఉధృతంగా కొనసాగుతుంది. ఆదివారం ఎమ్మెల్యేల కార్యాలయాలను ఖాళీ కంచాలతో ముట్టడించిన హాస్టల్ వర్కర్లు సోమవారం ఏటిడబ్ల్యూఓ కార్యాలయాలను తహసీల్దార్ కార్యాలయాలను ముట్టడించి ధర్నాలు నిర్వహించారు. ఉదయం 10 గంటలకే ముట్టడించారు. అధికారులు ఎవరూ లోపలికి వెళ్ళకుండా నినాదాలు చేశారు. గిరిజన కార్మికుల ఆకలి బాధలు మీకు పట్టవా అని ప్రశ్నించారు. తమకు బకాయి జీతాలు వెంటనే చెల్లించాలని సంక్రాంతి పండుగ రోజు పస్తులు ఉండే దుస్థితి కల్పించవద్దని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం వెంటనే బకాయి వేతనాలు చెల్లించే విధంగా అధికారులు వత్తిడి చేయాలని కోరారు. గిరిజన కార్మికులకు రెండు సంవత్సరాలుగా వేతనాలు లేక పస్తులు ఉంటుంటే గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్‌కు జిల్లాలోని గిరిజన ఎమ్మెల్యేలకు ఏమాత్రం పట్టదా అని హాస్టల్ వర్కర్లయూనియన్ జిల్లా కార్యదర్శిహీరాలాల్, ఆదివాసి గిరిజన సంఘం పట్టణ కార్యదర్శికుంజా శ్రీను ప్రశ్నించారు. గిరిజన కార్మికుల ఆకలి బాధలు పట్టించుకోని మంత్రికి ఎమ్మెల్యేలకు ఆ పదవులు అవసరమా అని ప్రశ్నించారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి బి.మధు మాట్లాడారు. గిరిజన కార్మికుల సమస్యల పరిష్కారం చేయ డంలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ బాధ్యత రాహిత్యంగా వ్యవహరిస్తున్నారని విమ ర్శించారు. ఖాళీ కంచాలతో ఐటీడీఏ కార్యాలయంలో నాలుగు గంటలపాటు కార్మికులు బైఠాయించి ధర్నా నిర్వహి ంచారు. అధికారులు వచ్చి నచ్చజెప్పే ప్రయత్నం చేసిన ప్పటికీ ధర్నా విరమించలేదు. సమ్మె యధాతథంగా కొనసా గుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన ఆశ్రమ పాఠశాలలు హాస్టల్ డైలీ వేజ్, ఔట్సోర్సింగ్ వర్కర్స్ యూ నియన్ జిల్లా నాయకులు, ఎస్ఎఫ్ఐ నాయకులు భూపేం దర్ మద్దతు తెలిపారు. నాగమణి, లక్ష్మి, సుభద్ర, భద్రమ్మ రాములు, శ్రీను, జోడె లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచ : గిరిజన సంక్షేమం శాఖ పరిధిలో కళాశాల హాస్టల్‌లో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ వర్కర్లకు 22 నెలలుగా ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న డైలీ వేజ్ వర్కర్లకు 8 నెలలుగా వేతనాలు బకాయిలు వెంటనే చెల్లించారని సీఐటీయూ పట్టణ కన్వీనర్ కే.సత్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రామ, బి.తవిర్యా జ్యోతి, దయమణీ, రాజేష్, సరోజినీ, కుమారీ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందు : వేతనాలు చెల్లించాలని సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ డైలీ వేజ్ కార్మికులు సోమవారం ఏటీడబ్ల్యూఓ కార్యాలయాన్ని ముట్టడించారు. సీఐటీయు అధ్వర్యంలో ట్రైబల్ వెల్ఫేర్ హాస్టల్స్‌లో పనిచేస్తున్న డైలీ వేజ్ 8నెలలుగా, ఔట్ సోర్సింగ్ కార్మికులకు గత రెండేండ్లుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ గత వారం రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నప్పటికీ పట్టించుకోవడంలేదు. దీంతో కార్మికులు ఏటీడబ్ల్యూఓ కార్యాలయాన్ని ముట్టడించారని అన్నారు. ఏటీడబ్ల్యు రుపాదేవి సిబ్బందిని విధులకు పోకుండా రెండు గంటలు ఆటంకం పరిచారు. అనంతరం ఇల్లందు ఎస్ఐ తన పోలీసు సిబ్బందితో వచ్చి ఆందోళన చేస్తున్న వారితో ఐటీడీఏ అధికారులతో మాట్లాడి 2 రోజులలో వేతనాలు చెల్లించేవిదంగా కృషిచేస్తామని హామీ ఇచ్చారు. అయినా కార్మికులు ముట్టడి కార్యక్రమం ఆపి నిరవధిక సమ్మెను ఎదా విధిగా కొనసాగించారు. ఈ సందర్భంగా పాయం ముత్తయ్య, ఈసం పద్మా అధ్యక్షతన జరిగిన సభలో డివిజన్ కన్వీనర్లు అబ్దుల్ నబీ, తాళ్లూరి కృష్ణ పాల్గొని మాట్లాడుతూ దశల వారీ ఆందోళనలో భాగంగా కార్యాలయాన్ని ముట్టడించామని అన్నారు. రేపటినుండి తమ పోరాటాన్ని ఉధృతం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కుంజ జయా, యదలపల్లి అంజమ్మ, గోగ్గెల లావణ్య, సృజన, అరుణ, సారయ్య అజయ్, సుబ్రమణ్యం, అనిత, శ్రీను, విజయభారతి, సుజాత, భారతి, దాసమ్మ, చుక్కమ్మ అనసూర్య, సావిత్రి, శంకరి, లక్ష్మీ, వాలి, గీత దనమ్మ తదితరులు పాల్గొన్నారు.



కరకగూడెం

కరకగూడెం : హాస్టల్ వర్కర్స్ పెండింగ్ వేతనాలు తక్షణమే విడుదల చేయాలని సీఐటీయూ మండల నాయకులు కొమరం కాంతారావు ప్రభుత్వాని డిమాండ్ చేశారు. సోమవారం సీఐటీయూ యూనియన్ ఆధ్వర్యంలో హాస్టల్ కార్మికులతో తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ సంధ్యాకు వినతిపత్రం అందజేసి, మాట్లాడారు. హాస్టల్ కార్మికులు కొమరం ముసలయ్య, ఏడుల్ల పాపయ్య, చర్ప నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

డబుల్ ఇండ్లు కేటాయించాలి

- సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో కలెక్టర్‌కు బాధితుల వినతి

నవతెలంగాణ-భద్రాచలం

భద్రాచలం పట్టణంలోని మను బోతుల చెరువు కాలనీ వద్ద 2017లో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం కోసం స్థల సేకరణ చేసే సందర్భంగా ఖాళీ చేయించిన 15 కుటుంబాల వారికి ఇండ్లు కేటాయించాలని బాధితులు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో కలెక్టర్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ఇక్కడ 35 ఏండ్లుగా నివాసముంటున్న 15 పేద కుటుంబాల వారిని ఆనాటి అధికారులు ఖాళీ చేయించి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మాణం పూర్తి అయ్యాక మీకు కేటాయిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఆ 15 కుటుంబాల వారు ఆనాటి నుండి అద్దె ఇండ్లలో నివాసం ఉంటూ వేలకు వేలు అద్దెలు చెల్లిస్తూ జీవనం సాగిస్తున్నామన్నారు. ఆనాటి శాసనసభ్యులు సున్నం రాజయ్య, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, ఆర్డిఓ శ్రీమన్నారాయణ రెడ్డి, తహసీల్దార్ రామకృష్ణ, ఐటీడీఏ ఈఈ, శంకర్రావు సమక్షంలో బాధితులకు డబల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయిస్తామని హామీ ఇచ్చి ఉన్నారన్నారు. వారి హామీతో పక్కా ఇండ్లు సైతం తొలగించడానికి అంగీకరించడంతో వాటిని తొలగించి డబల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మాణం ప్రారంభించారు. నేడు డబల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మాణం పూర్తి కావచ్చిన సందర్భంగా అధికారులకు అనేకమార్లు వినతిపత్రం అందించిన స్పందించకపోవడంతో బాధితులు ఆందోళన చెందుతున్నామన్నారు. కావున నష్టపోయిన 15 కుటుంబాల వారికి డబల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించిన తర్వాతనే ఇతరులకు కేటాయింపు చేయాలని కలెక్టర్‌కి వినతి పత్రం అందించి తమ గోడు వెళ్లబుచ్చుకున్నారు. బాధితులు ఇచ్చిన వినతి పత్రంపై స్పందించిన జిల్లా కలెక్టర్ అనుదీప్ స్థానిక అధికారులతో విచారణ జరిపించి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయింపు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు సున్నం గంగా, పట్టణ కమిటీ సభ్యులు లక్ష్మీకాంత్, బాధితులు హిమాంబి, బంటు వెంకటేశ్వర్లు, బంటు రాణి, సావిత్రి, నాగమణి, సుమంత రాజు, టి.లక్ష్మి జి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.





యూటీఎఫ్ రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-మణుగూరు

టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ఐదవ మహాసభల గోడ ప్రతులను జడ్పీటీసీ పోసం నరసింహారావు, ఎంపీపీ కారం విజయ కుమారి ఆవిష్కరించినట్లు మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎస్కే మీరా హుస్సేన్, కారం సీతారాములు తెలిపారు. సోమవారం జిల్లా పరిషత్ కో ఎడ్యుకేషన్ పాఠశాలలో గోడ ప్రతులతో పాటు ప్యాకెట్ క్యాలెండర్ కూడా ఆవిష్కరించామని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 13, 14 తేదీలలో హైదరాబాద్‌లోని మన్నే గుడాలో తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర 5వ మసభలు జరుగనున్నాయని, కావున అన్ని జిల్లాల ఉపాధ్యాయులు హాజరై, మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముత్యాలమ్మ నగర్ సర్పంచ్ జంపెస్వరి, తోగ్గుడెం సర్పంచ్ బోగ్గం రజిత, వార్డ్ సభ్యులు చెన్న కేశవ రావు, బీ.నరసింహారావు, ఉపేంద్ర, కట్ట రాజకుమార్, యూటీఎఫ్ ఉపాధ్యక్షులు వెంకన్న, టీ.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీకి నిధులు కేటాయించాలి

- జెడ్పీ సీఈవో విద్యాలతను కలిసిన సర్పంచ్ గద్దల రమేష్



నవతెలంగాణ-పాల్వంచ

మండలంలోని దంతేలబోరా ఎస్సీ కాలనీ గ్రామపంచాయతీ అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని సర్పంచ్ గద్దల రమేష్ అధికారక విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో జెడ్పీ సీఈవో విద్యాలతను మర్యాదపూర్వకంగా కలుసుకొని నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేసిన ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామంలోని నూతన గ్రామ పంచాయతీ భవనం లేక గ్రామ కార్యకలాపాలను చెట్టుకిందని నిర్వహించడం జరుగుతుందని, గ్రామంలో సీసీ రోడ్డు సౌకర్యం లేక ప్రజలు వాన కాలంలో ఇబ్బందులకు గురవుతున్నారని, రైతులు పంట పొలాలకు వెళ్లడానికి మెట్టల్ రోడ్డు సౌకర్యం లేక పంట పొలాలకు వెళ్లాలంటే రైతులందరూ ఇబ్బందులకు గురవుతున్నారని, వెంటనే మా గ్రామ సమస్యలకు పరిష్కారం చూపి నిధులను కేటాయించాలని కోరారు.

జీఎంను కలిసిన లింగమంతుని జాతర కమిటీ నాయకులు

నవతెలంగాణ-అశ్వాపురం

మండలంలో ఫిబ్రవరి 5, 2023న జరిగే భవాని లింగమంతుల స్వామి జాతర సందర్భంగా సౌకర్యాల కోసం సోమవారం ఆ కమిటీ నాయకులు సింగరేణి కాలరీస్ జీఎంను కలిసి వినతి పత్రం అందజేసారు. దీనికి స్పందించిన జీఎం వెంకటేశ్వర రెడ్డి కావలసిన సౌకర్యాలు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చినట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహన కమిటీ అధ్యక్షులు లంకల రమేష్ యాదవ్, ప్రధాన కార్యదర్శి గంటా గోవర్ధన్ యాదవ్, గౌరవ అధ్యక్షులు మేకల ఆది లింగయ్య యాదవ్, బండారు జనార్ధన్ యాదవ్, ఆర్గనైజ్ సెక్రెటరీ మంగి మల్లికార్జున యాదవ్, సహాయ కార్యదర్శి దావ వీరస్వామి యాదవ్, మేకల గోపి యాదవ్, చంద్రకానీ వినీల్ యాదవ్, కమ్మలపల్లి పుల్లయ్య యాదవ్, బొల్లు సతీష్ యాదవ్, మల్లబోయిన ప్రశాంత్ యాదవ్, రాసబంటి నాగరాజు యాదవ్, వజ్జ ఉపేందర్ యాదవ్, పసుల శివకృష్ణ యాదవ్, నక్క రాజేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

చెల్లని చెక్కు కేసులో జైలు శిక్ష

నవతెలంగాణ-భద్రాచలం టౌన్

భద్రాచలం జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మ్యాజిస్ట్రేట్ కోర్టు జడ్జి సోమవారం చెక్కు కేసులో ఆరు నెలలు జైలు శిక్ష, రూ.8,00,000 జరిమానా విధించారు. వివరాల్లోకి వెళితే కందుల వాణిశ్రీ అనే ఆమె దగ్గర అశ్వాపురం గ్రామానికి చెందిన వేములపల్లి రాంప్రసాద్ అనే వ్యక్తి చెక్ హామీగా పెట్టి రూ.8,00,000 తీసుకున్నాడు. ఆ చెక్ బ్యాంకులో వేయగా చెక్ బౌన్స్ అయింది. సదరు పిటిషనర్ కందుల వాణిశ్రీ న్యాయవాదులు జె.గోపికృష్ణ, ముత్యాల కిషోర్‌ను సంప్రదించి కోర్టులో కేసు వేయడం జరిగింది. సదరుకోర్టులో వాదపవాదములు వినిపించిన అనంతరం ముద్దాయి వేములపల్లి రాంప్రసాద్‌కు ఆరు నెలలు జైలు శిక్ష, రూ.8,00,000 నష్టపరిహారం విధించారు.

ప్రభుత్వ పాఠశాలకు బ్లాక్ బోర్డులు వితరణ

నవతెలంగాణ-పాల్వంచ

లయన్స్ క్లబ్ ఆఫ్ గోల్డ్ పాల్వంచ అధ్యక్షుడు లయన్ చాట్ల శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో సోమవారం సితారాంపట్నం ప్రభుత్వ పాఠశాలకు బ్లాక్ బోర్డులు వితరణ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు లయన్ చాట్ల శ్రీనివాస్ రావు మాట్లాడుతూ విద్యార్థులు కష్ట పడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ 320 ఈ మైక్రో కమిటీ చైర్మన్ అరుద్ర సత్యనారాయణ, బోర్డు సభ్యులు లయన్ రోశయ్య చౌదరి, పాస్టు ప్రెసిడెంట్ లయన్ పుట్టా నాగేశ్వరరావు ప్రోగ్రామ్ కమిటీ చైర్ పర్సన్ వంశీ, విష్ణు వ్యవహరించారు.

పూలే, అంబేద్కర్, సేవారత్న అవార్డుల దరఖాస్తులకు ఆహ్వానం



నవతెలంగాణ-అశ్వాపురం

అత్యంత ప్రతిష్టాత్మకమైన మహాత్మా జ్యోతిరావు పూలే, బీఆర్ అంబెద్కర్, ఏపీజే అబ్దుల్ కలాం, సేవరత్న, సాహిత్యరత్న, విద్యారత్న, ఉమెన్ లీడర్ షిప్ అవార్డుల స్వీకరణకు గాను బహుజన సాహిత్య అకాడమీ బీఎస్ఏ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తునట్లు కమిటీ సభ్యుడు గద్దల నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రతి సంవత్సరం లాగానే ఈ సారి కూడా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తిరుపతిలో నిర్వహించే బహుజన రైటర్స్ 6వ సౌత్ ఇండియా కాన్ఫరెన్స్‌లో ఈ అవార్డులను అందజేస్తారన్నారు. 2023 మార్చి 12వ తేదీన తిరుపతిలో నిర్వహించే ఈ కాన్ఫరెన్స్‌కు సౌత్ ఇండియాలోని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, పుదిచ్చేరి రాష్ట్రాల నుండి సుమారుగా 600 మంది డెలిగేట్స్ ఈ కాన్ఫరెన్స్‌కి హాజరౌతారని తెలియజేశారు. ఒక రోజు పాటు నిర్వహించే ఈ కాన్ఫరెన్స్‌లో మార్నింగ్ సెషన్‌లో సౌత్ ఇండియాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, అండ్ మైనారిటీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం చర్చిస్తారన్నారు. మధ్యాహ్నం అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించబదుతోందన్నారు. ఈ అవార్డులకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలతో పాటుగా పూలే, అంబేద్కర్ సిద్ధాంత బావజాలంతో పనిచేసే అగ్రకులాల వారు కూడా దరఖాస్తు చేయవచ్చునన్నారు. అదే విధంగా సామాజిక ఉద్యమ కారులు, సంఘసేవకులు, కవులు, కళాకారులు, రచయితలు, గాయకులు, ఈ దరఖాస్తులకు అర్హులవుతారు.

ఈ బహుజన సాహిత్య అకాడమీకి జాతీయ అధ్యక్షులుగా నల్లా రాధాకృష్ణ బహుజన సాహిత్య అకాడమీ జిల్లా సెలక్షన్ కమిటీ మెంబెర్ గద్దల నాగేశ్వరరావు బాధ్యత నిర్వహిస్తారని తెలిపారు. పై అవార్డులకు దరఖాస్తు చేయదలచిన వారు గద్దల నాగేశ్వరరావు, అశ్వాపురం మండలంను సంప్రదించటంతో పాటు 8309134750కు ఫోన్ చేయాలన్నారు.

"సెల్ఫీ విత్ రంగోలి"

- డాక్టర్ జీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమం
- ముగ్గుతో సెల్ఫీ తీసి పంపండి బంగారం...గెలుచుకోండి
- మొదటి బహుమతి ఒక బంగారు నాణెం, రెండో బహుమతి 50 మందికి 10 గ్రాముల వెండి నాణేలు
- ఇంకా వందకు పైగా కన్సోలేషన్ బహుమతులు



నవతెలంగాణ-కొత్తగూడెం

మన సంస్కృతి సాంప్రదాయాలను మన ముందు తరాల వారికి అందించేందుకు యువతకు సంక్రాంతి పండుగపై అవగాహన కల్పించటానికి డాక్టర్ జీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో "సెల్ఫీ విత్ రంగోలి" అనే వినూత్న కార్యక్రమం చేపట్టామని ట్రస్టు నిర్వహకులు, రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ డాక్టర్ గడల శ్రీనివాసరావు తెలిపారు. సంకాంత్రి పండుగ తెలుగువారి లోగిళ్లలో ఆనందం వెల్లివిరిసే శుభదినమన్నారు. గ్రామాల్లో ధాన్యం రాశులు ఇంటికి వస్తున్న తరుణంలో పల్లె సీమలు కళకళలాడుతుంటాయని చెప్పారు. తెలుగువారి అతి పెద్ద పండుగ సంక్రాంతి, గ్రామాలు, పట్టణాలు, నగరాల్లో ప్రతి ఇంటి ముంగిట సంక్రాంతి ముగ్గులు పండుగ శోభను తీసుకొస్తాయని అందుకే ' జీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్టు' ఆధ్వర్యంలో "సెల్ఫీ విత్ రంగోలి" అనే వినూత్న కార్యక్రమం చేపట్టామన్నారు. జనవరి 13, 14 15 తేదీలలో మీ ఇంటి ముందు, మీరు వేసిన ముగ్గుతో ఒక సెల్ఫీ ఫోటో, లేదా చిన్న వీడియో గాని తీసి, మీ పేరు ఊరు మండలంతో 9504006999, 9000086767, 9000037676 నెంబర్లకు పంపాలని జిల్లా వాసులను కోరారు. మొదటి బహుమతి ఒక బంగారు నాణెం, రెండో బహుమతి 50 మందికి 10 గ్రాముల వెండి నాణేలు, ఇంకా వందకు పైగా కన్సోలేషన్ బహుమతులు ఉంటాయని ప్రకటించారు. బహుమతి ప్రధానం, ఈనెల 26వ తేదీన గణతంత్ర దినోత్సవం సందర్భంగా, జనహిత, శ్రీనగర్ కాలనీ, కొత్తగూడెంలో నిర్వహించే కార్యక్రమంలో అందజేయడం జరుగుతుందని చెప్పారు. జిల్లా వాసులు పెద్ద ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని డాక్టర్ శ్రీనివాసరావు కోరారు.

మతోన్మాద బీజేపీ ప్రభుత్వ విధానాలపై పోరాడాలి

- రవీందర్ 2వ వర్ధంతి సభలో కనకయ్య

నవతెలంగాణ-ములకలపల్లి

మతోన్మాద బీజేపీ ప్రభుత్వ విధానాలపై ప్రజలు పోరాడాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని చౌవిటిగూడెం గ్రామంలో అమరజీవి కామ్రేడ్ తానం రవీందర్ 2వ వర్ధంతి సందర్భంగా ఆయన స్థూపం వద్ద జరిగిన సభలో ఆయన మాట్లాడారు. కామ్రేడ్ తానం రవీందర్ మండలంలో పోడు భూముల పోరాటాలలో జైలు జీవితం గడిపారని గుర్తు చేశారు. కరోనా సమయంలో పేదలకు నిత్యవసర సరుకులు పంపిణీ అదేవిధంగా ప్రజా ఉద్యమాలు నిర్వహించిన రవీందర్ అని అన్నారు. రవీందర్ ఆశయాలకు అనుగుణంగా కార్యకర్తలు పని చేయాలని పిలుపునిచ్చారు. మతతత్వ బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు దార దత్తం చేస్తున్నా రాజ్యాంగంలో ఉండబడిన హక్కులను, చట్టాలను కాలరాస్తున్న బీజేపీ ప్రభుత్వంపై ఉద్యమాలు, పోరాటాలు ఉధృతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, తానం రాంబాబు, రావూజ, పోడియం వెంకటేశ్వర్లు, నిమ్మల మధు, గౌరి నాగేశ్వరరావు, లక్ష్మీ నరసయ్య, శ్రీరాములు, వెంకటేశ్వర్లు, వంశీ, శ్రీను, వెంకటేశ్వర్లు, ముత్యాలు, రాఘవయ్య, సున్నం నాగులు తదితరులు పాల్గొన్నారు.

రద్దు చేసిన రైళ్లు పునరుద్ధరించాలి

నవతెలంగాణ-కొత్తగూడెం

భద్రాద్రి కొత్తగూడెం రైల్వేస్టేషన్ నుండి ఇతర ప్రాంతాలకు నడిచే పలు రైళ్లను కోవిడ్-19, కరోనా సందర్భంగా రద్దుచేసిన రైళ్లను తిరిగి పునరుద్ధరించాలని కొవ్వూరూ రైల్వేలైన్ సాధన కమిటి చైర్మెన్ కోదమ సింహం పాండురంగా చార్యులు అధికారులను డిమాండ్ చేశారు. సోమవారం కొత్తగూడెం రైల్వే స్టేషన్ ఎదురుగా కొవ్వూరు రైల్వే సాధన కమిటీ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కరోనాకు ముందు భద్రాచలం రోడ్డు నుండి నడిచిన అన్ని రైళ్ళను పునరుద్ధరించాలన్నారు. కొవ్వూరు రైల్వే లైన్ మంజూరై 8 సంవత్సరాల అవుతున్నప్పటికీ ఇంతవరకు సత్తుపల్లి నుండి కొవ్వూరుకి బడ్జెట్ మంజూరు చేయలేదన్నారు. పాండురంగాపురం నుండి సారపాకకు భద్రాచలం దేవస్థానానికి రైలు సౌకర్యం యాత్రికులకు కల్పించలేదని భద్రాచలం రోడ్ నుండి కాజీపేటకు డోర్నకల్ కు వెళ్లే ప్యాసింజర్‌ని తక్షణం పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అనంతరం అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కొండి గణేష్, సతీష్ యాదవ్, పవన్ కళ్యాణ్, సంతోష్, సాయి, శంకర్, కృష్ణ, హతిరం, బిక్షం, వినోద్, పండు, నరేందర్, నవీన్, అమీర్ తదితరులు పాల్గొన్నారు.



అక్రమ అరెస్టులను ఖండించాలి

నవతెలంగాణ-కొత్తగూడెం





పోలీస్ రిక్రూట్ మెంట్‌లో జరిగిన అవకతవకలు అరికట్టాలని పాత పద్ధతిలోనే రిక్రూట్మెంట్ కొనసాగించాలని సోమవారం ఛలో ప్రగతి భవన్ ముట్టడి కార్యక్రమానికి వెళ్లకుండా డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు లిక్కి బాలరాజు అక్రమంగా అరెస్ట్ చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. అక్రమం అరెస్టులను విద్యార్థి సంఘాల నాయకులు తీవ్రంగా ఖండించారు. పోలీసుల అరెస్టుల ద్వారా ఉద్యమాలను అడ్డుకోలేరని స్పష్టం చేశారు.

ఇల్లందు : పోలీస్ అభ్యర్థుల ఎంపిక పద్ధతిలో తప్పులను సవరించి అభ్యర్థులకు న్యాయం జరిగేలా చూడాలని యువజన సంఘాలు, విద్యార్థి సంఘాలు ఇచ్చిన చలో ప్రగతి భవన్ ముట్టడి కార్యక్రమానికి వెళ్ళకుండా ఇల్లందులో పోలీసులు అడ్డుకున్నారు. అర్ధరాత్రి డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, పీడీ ఎస్‌యూ నేతలు కాలంగి హరికృష్ణ, బయ్యా అభిమన్యు, పరిటాల వేణు, హైమ ద్, గణేష్ నాయకుల ఇండ్ల మీధకు అర్థ రాత్రి వచ్చి, అరెస్టు చేసి పోలీస్ స్టేష న్కు తరలించారు. ఈ అక్రమ అరెస్టులను అందరూ ఖండించాలని కోరారు.

దమ్మపేట : ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఛలో ప్రగతి భవన్ ముట్టడి కార్యక్రమానికి ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, వామపక్ష విద్యార్థి, యువజన సంఘాలు పిలుపునిచ్చిన నేపథ్యంలో చలో ప్రగతి భవన్ ముట్టడికి బయలుదేరిన ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి బత్తుల సాయి, ఏఐవైఎఫ్ దమ్మపేట మండల కార్యదర్శి సుంకుపాక ధర్మ ముందస్తుగా అరెస్టులు చేశారు.

ఇన్‌స్పైర్ అవార్డుకు ఎంపికైన విద్యార్థులు

నవతెలంగాణ-చంద్రుగొండ

ఇన్స్పైర్ అవార్డుకు ఎంపికైన విద్యార్థులను చంద్రుగొండ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఉండేటి ఆనంద్ కుమార్ అభినందించారు. విద్యార్థుల్లో శాస్త్రీయ ప్రతిభను వెలికి తీసి వారిని బాల శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేందుకు కేంద్ర శాస్త్ర సాంకేతిక మండలి ప్రతి ఏటా దేశంలో 6 నుండి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఈ అవార్డులను అందిస్తుంది. ఈ అవార్డుకు ఎంపికైన విద్యార్థికి రూ.పదివేల నగదుగా అందించి, ప్రాజెక్టులను రూపకల్పన చేపిస్తుంది. మండలం నుండి కనకం నాగశరణ్య, 7 తరగతి, యుపిఎస్ సీతయ్య గూడెం, కొట్టే ఆదిత్య 9వ తరగతి జడ్పీహెచ్ఎస్ చంద్రుగొండ, వల్లపు అనిల్ 9వ తరగతి జెడ్‌పీఎస్ఎస్ మద్దుకూరు, విద్యార్థులు ఎంపికైనారు. వారిని యూపీఎస్ సీతాయగూడెం ప్రధానోపాధ్యాయులు ఎండీ.ఆరీఫ్ హుస్సేన్, మద్దుకూరు ఇన్చార్జ్ హెడ్మాస్టర్ వెంకటేశ్వరరావు, ఇన్స్పైర్ గైడ్ టీచర్లు ఎం గోపాలకృష్ణ, ఎం.డి వాజిద్, మంజుశ్రీ, శకుంతల తదితర ఉపాధ్యాయులు అభినందించారు.



'నవతెలంగాణ' క్యాలెండర్ ఆవిష్కరించిన కోరం

నవతెలంగాణ-కొత్తగూడెం

నవతెలంగాణ 2023 నూతన సంవత్సర క్యాలెండర్‌ను జిల్లా పరిషత్ చైర్మెన్ కోరం కనకయ్య ఆవిష్కరించారు. నవతెలంగాణ బృందం చైర్మెన్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. రైటర్స్ బస్తీలోని జెడ్పీ క్యాంపు కార్యాయలంలో నవతెలంగాణ-2023 నూతన సంవత్సర క్యాలెండర్‌ను చైర్మెన్ కోరం కనకయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్తా పత్రికలు నిజాన్ని నిర్భయంగా ప్రచురించాలని సూచించారు. పారదర్శకత ఉన్న వార్త కథనాల ప్రచురణ వలన ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో నవతెలంగాణ జిల్లా పాత్రికేయులు దాసరి వెంకటేశ్వరరావు (డివి), నందిపాటి రమేష్, జెడ్పీ సీసీ రాజేష్‌కుమార్, పలువురు సర్పంచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.

పౌర సమితి ఆధ్వర్యంలో ఇసుక కోసం ర్యాలీ

- మద్దతు తెలిపిన అఖిలపక్షం

నవతెలంగాణ-చెర్ల



ప్రతి సామాన్యుడు తమ తమ అవసరాల కోసం ఇసుక కోసం నానా అవస్థలు పడాల్సి వస్తుందని చర్ల మండల పౌర సమితి పేర్కొంది. సోమవారం ఇసుక, మట్టి, గ్రావెల్ తోలకాలకు రెవిన్యూ శాఖ అనుమతులు ఇవ్వాలంటూ పౌరసమితి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి సమీప తాలుపేరు గోదావరి నదుల నుండి ఇసుక తోలకాల గురించి తహసీల్దార్‌తో పాటు కొత్తగూడెంలో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్‌కు సైతం వినతి పత్రం అందించినట్లు పౌరసమితి సభ్యులు తెలిపారు. మండల పరిధిలో గృహప్రకారాలకు, అభివృద్ధి పనులకు రైతులు మిర్చికల్లాలకు ఇసుక సమీప నదుల నుండి ఎటువంటి ఆటంకాలు లేకుండా రవాణా చేసుకోవడానికి జిల్లా ఉన్నతాధికారి కలెక్టర్, తహసీల్దార్, పోలీస్ సహకరించాలని సీఐ బి.అశోక్ కూడా వినతి పత్రం అందించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గీద కోదండరామయ్య, జడ్పీటీసీ ఇర్పా శాంత, ఎంపీటీసీ మడకం పద్మజ, మెదడు గ్రామ పంచాయతీ సర్పంచ్ కాపుల కృష్ణార్జునరావు, కేశవాపురం సర్పంచ్ నాగేంద్ర, సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు చీమలమర్రి మురళీకృష్ణ, టీపీసీసీ సభ్యులు నల్లపు దుర్గాప్రసాద్, బీఆర్ఎస్ నాయకులు నక్కిన బోయిన శ్రీనివాస్ యాదవ్, పోలిన లంక రాజు, బండారి రామకృష్ణ, మేడిచర్ల కుమార్, సీతాపతి రాజు, చింతా నాగబాబు ,పౌర సమితి సభ్యులు, రైతులు ,ప్రజలు పాల్గొన్నారు.

క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని చాటాలి

- ధనసరి సూర్య

నవతెలంగాణ-ఆళ్ళపల్లి (గుండాల)

క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని చాటాలని ములుగు ఎమ్మెల్యే సీతక్క కుమారుడు ధనసరి సూర్య అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన మండల కేంద్రములో ఇటీవల కాలంలో మృతి చెందిన గుండాల ఎంపీటీసీ షేక్ సంధాని స్మారకంగా నిర్వహిస్తున్న మూడు మండలాల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌కు ముఖ్య అతిథిగా హాజరై, ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆటలు శారీరక, మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని అన్నారు. టోర్నీలో పాల్గొనే ప్రతి జట్టు ఏరోజుకారోజు నూతన ఉత్తేజంతో మ్యాచ్ గెలవడానికి కృషి చేయాలని సూచించారు. ఈ టోర్నీలో మూడు మండలాల నుంచి 58 టీములు రావడం సంతోషం వ్యక్తం చేశారు. అన్ని జట్ల క్రీడాకారులు వివాదాలకు తావు లేకుండా స్నేహపూర్వక వాతావరణంలో ఆడి, క్రికెట్ ప్రేమికుల హృదయాలను గెలవాలన్నారు. ఈ కార్యక్రమంలో గుండాల జెడ్పీటీసీ వాగబోయిన రామక్క, సర్పంచ్ కోరం సీతారాములు, ఎస్సై రాజశేఖర్, రేంజర్ మురళి, మామకన్ను సర్పంచ్ కొడెం ముత్యమాచారి, వివేకవర్ధిని కళాశాల ప్రిన్సిపాల్ వరలక్ష్మి, నాయకులు కొడెం వెంకటేశ్వర్లు, షేక్ సాహెబ్, ఆజాద్, చందా ప్రసాద్, ఆరిఫ్ పాష, తోలెం గోపి పాల్గొన్నారు.



యూటీఎఫ్ నూతన క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

నవతెలంగాణ-ఆళ్ళపల్లి (గుండాల)



గుండాల మండల కేంద్రములోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) సంఘం నాయకులు నూతన సంవత్సరం క్యాలెండర్, డైరీ ప్రధానోపాధ్యాయుడు కిషన్ చేతుల మీదుగా సోమవారం ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏ.వీరన్న, ఎల్.రూప్ సింగ్, ఎం.వెంకటేశ్వర్లు, బాలస్వామి, పి.రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

సీఎం సాబ్...జిల్లా సమగ్రాభివృద్ధిపై స్పష్టత ఇవ్వాలి

ప్రజా సమస్యలపై ముఖ్యమంత్రి స్పందించాలి

- భద్రాది అభివృద్ధి నిధులు ఎక్కడ...?
- సీతారామ ప్రాజెక్టు ఎప్పుడుపూర్తి చేస్తారు..?
- విలేకరుల సమావేశంలో

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కనకయ్య

నవతెలంగాణ-కొత్తగూడెం



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పర్యటనకు వస్తున్న ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు జిల్లా సమగ్రాభివృద్ధి పై తగిన స్పష్టత ఇవ్వాలని ప్రజాసమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రి స్పందించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక మంచికంటి భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాకు ఇచ్చిన హామీల విషయంలో సీఎం కేసీఆర్ స్పష్టత ఇవ్వాలన్నారు. ఈ నెల 12న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నూతన కలక్టరేట్ సముదాయంను ప్రారంభిస్తున్న సందర్భంగా హర్షం వక్తంచేశారు. ముఖ్యమంత్రి కెసీఆర్ పర్యటనలో ఈ జిల్లా ప్రజలు దీర్ఘకాలంగా ఎదురుచుస్తున్న సమస్యలపై ఒక స్పష్టత వస్తుందని ఆశిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సమస్యలపై స్పందించాలని కోరారు. జిల్లాలో పోడు భూములు సాగు చేస్తున్న 82,737 మంది 2,94,890 ఎకరాలకు హక్కు పత్రాలు కల్పింలచాలని పోడు సాగుదారుల దరఖాస్తులు చేసుకుని ఉన్నారని, సర్వేలు అన్ని పూర్తిచేసి గ్రామసభలు ఆధారంగా అర్హులందరికీ హక్కు పత్రాలు కల్పించాలని, ప్రస్తుతం జరుగుతున్న పద్ధతిలో సాగు దార్లకు న్యాయం జరిగేలా లేదని ఆనుమానం వ్యక్తం చేశారు. పినపాక మండలంలో 5286 మంది దరఖాస్తులు పెట్టుకుంటే కేవలం 95 మంది అర్హులని అధికార్లు నిర్ధారించి, ఉన్నతాధికారులకు నివేదకలు అందజేశారని తెలిపారు. గ్రామ సభల నిర్ణయానికి ఇది భిన్నమైందని తెలిపారు. ముఖ్యమంత్రి దీనిపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. భద్రాచలం గోదావరి ముంపుకు సంభదించి శాశ్వత పరిష్కారంపై నదికి రెండు వైపుల కరకట్ట నిర్మాణం, ముంపు కాలనీలు, గ్రామాలను తరలింపు శాశ్వత నివాస వసతులు కల్పించాలన్నారు. సీతారామ ప్రాజెక్టు నిర్మాణం వెంటనే పూర్తి చేయాలని, జిల్లాలోని సాగునీటి సదుపాయం లేని ప్రాంతాలకు నిటిని తరలించేందుకు ప్రస్తుత డిజైన్‌లో మార్పులు చేయాలని సూచించారు. కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలకు బైపాస్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని, ట్రాఫిక్ సమస్యకు శాస్వత పరిష్కారం చూపాలని కోరారు. జిల్లాలో అపరిష్కృతంగా ఉన్న డబుల్ బెడ్ రూం ఇండ్లు నిర్మాణం సత్వరమే పూర్తి చేసి అర్హులైన లబ్దిదారులకు ఇవ్వాలని, స్థలం ఉన్న వారిందరికీ రూ.5 లక్షలు ఇంటి నిర్మాణానికి ఇవ్వాలన్నారు. స్థలం లేని పేదలకు ప్రభుత్వ స్థలం సమకూర్చి స్కీం వర్తింప చేయాలని, ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుక్న అర్హులైన పేదలందరికీ పోజిషన్ సర్టిఫికెట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అర్హులైన జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని మారుమూల ఏజన్సీలో వైద్య సమస్యలు తీవ్రంగా ఉన్నాయని తెలిపారు. అవసరమైన డాక్టర్స్ లేకపోవడం, ఆసుపత్రిలో పరికారాలు, టెక్నిషయన్స్, మందులు, అంబులెన్స్‌లు లేక ప్రజలు వైద్యం సకాలంలో పొందలేక పోతున్నారని, మృతి చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రం హస్పిటల్‌ని 1000 పడకల హస్పిటల్‌గా అభివృద్ధి చేయాలన్నారు. ఈ సమస్యలపై తక్షణమే స్పందించాలని సూచించారు. భద్రాచలం, సారపాక పంచాయితీల విభజన అశాస్త్రీయమని ఆరోపించారు. వెంటనే నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. వాటిని మేజర్ గ్రామ పంచాయతీలుగా కొనసాగించాలన్నారు. వీటితో పాటు మణుగూరు, పాల్వంచ మున్సిపాలిటీలకు ఎన్నికలు నిర్వహించి పాలక వర్గం ఏర్పాట్లు చేసి అభివృద్ధికి బాటలు వేయాలని కోరారు. భద్రాచలం అభివృద్ధికి రూ.100 కోట్ల నిధులు, ఆంధ్రాలో కలిపిన 5 పంచాయతీలను తెలంగాణలో కలిపేలా చర్యలు తీసుకోవాలని, ముంపు సందర్భంలో భద్రాచలం పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి వరద బాధితులకు శాశ్వత పరిష్కారం కోసం రూ.1,000 కోట్లు కేటాయించి అభివృద్ధి చేస్తానని హామి ఇచ్చారని, ఈ సందర్భంగా నిధులు అందజేయాలని కోరారు. గ్రామాల అభివృద్ధికి తక్షణమే గ్రామ పంచాయతీలకు నిధులు కేటాయింపు చేయాలన్నారు. నిధులు లేక గ్రామ పంచాయతీలు అభివృద్ధికి నోచుకోవడంలేదని తెలిపారు. రైతులు పండించిన ధాన్యాన్ని అంతకొనుగోలు చేయాలి. తరుగు పేరుతో జరుగుతున్నా మోసాలను నివారించాలన్నారు. ధరణి సమస్యలు పరిష్కరించాలని, రైతులు పండించిన ధాన్యాన్ని అంతకొనుగోలు చేయాలన్నారు. తరుగు పేరుతో జరుగుతున్న మోసాలను నివారించాలన్నారు. దళిత బంధు పథకం అర్హులై ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకోవాలని, ఎమ్మెల్యేల ప్రమేయం లేకుండా, జిల్లా కలెక్టర్ ద్వారా అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలో గిరిజన, మైనింగ్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని, కొత్తగూడెం విమానాశ్రయం, మైలారం రాగి గనులు, పర్యాటక కేంద్రాల అభివృద్ధి చేయటం ద్వారా జిల్లాలో చదువుకుక్న నిరుద్యోగ యువతకు ఉద్యోగం ఉపాధి అవకాశాలు లబిస్తాయి.

వీటిపై ప్రభుత్వం ఆలోచించాలని కోరారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రభుత్వం అందించే నిత్యావసర సరుకులు సకాలంలో అందించాలన్నారు. పండగ సందర్భంగా 14 రకాల నిత్యాసవర వస్తువులను పంపిణీ చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు, లిక్కి బాలరాజు, భూక్యా రమేష్‌లు పాల్గొన్నారు.

జీతంలో కనీసం పెరుగుదల

19శాతం సాధించటం కార్మికుల విజయం

- పన్నురాయింపు పోరాటాలకు సిద్ధం కావాలి
- మంద నరసింహారావు

నవతెలంగాణ-ఇల్లందు



జీతంలో కనీసం పెరుగుదల 19 శాతం సాధించటాన్ని కార్మికుల విజయమని సింగరేణి కాలనీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జేబీసీసీఐ సభ్యులు మంద నరసింహారావు అన్నారు. జెకె ఓసిలో సోమవారం ఫిట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాల్లో మాట్లాడారు. 11వ వేతన ఒప్పందం పై మూడున కలకత్తాలో జరిగిన సమావేశంలో 19శాతం జీతం కనీస పెరుగుదలను ఐదేండ్ల కాల పరిమితితో డీపీఈ గైడెన్స్‌ను పక్కకు నెట్టి, కార్మికులు పోరాటాలకు సన్నద్ధమైన నేపథ్యంలో జీతంలో కనీసం పెరుగుదల 19 శాతం సాధించటాన్ని కార్మికుల విజయంగా సీఐటీయూ భావిస్తున్నదని అన్నారు. ఒక పక్కన బొగ్గు కొరత, మరొక పక్కన కార్మికులు పోరాటానికి సిద్ధం కావడం అందులో భాగంగా డిసెంబర్ 9వ తారీఖున కోల్ ఇండియా, సింగరేణి వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు విజయ వంతం చేయటం, ఈ నెల జనవరి 7న రాంచిలో సదస్సు నిర్వహించి సమ్మెకు సన్నదం చేయటానికి నాలుగు జాతీయ కార్మిక సంఘాలు సిద్ధమవుతున్న నేపథ్యంలో ఈ చర్చలు విజయవంతం కావటానికి తోడ్పడ్డాయని మంద పేర్కొన్నారు.

కార్మికులకు కనీస జీతం పెరుగుదల రూ.12,678.69

క్యాటగిరి-1 బేసిక్ రూ.1011.27 నుండి 1502.67కు పెరిగి, జీతం పెరుగుదల రూ.6973.73 ఉండగా, ఏ1 కార్మికుని రూ.47,802.53 బేసిక్ నుండి 71030.57 బేసిక్ పెరిగి కనీస జీతం పెరుగుదల రూ.12,678.69కి పెరిగిందని ఆయన పేర్కొన్నారు. బేసిక్ పెరుగుదల 48.59శాతంగా ఉంటుందని బేసిక్ పై ఆధారపడి పెరిగే అండర్ గ్రౌండ్ అలవెన్స్, 4శాతం స్పెషల్ అలవెన్స్ , హెచ్ఆర్ఏ లు కూడా 48.59శాతంగా పెరగనున్నాయని ఇవి కాకుండా మిగతా అలవెన్సులు (ట్రాన్స్‌పోర్ట్ సబ్సిడీ, నైట్ షిఫ్ట్ అలవెన్స్ ఇతర అలవెన్సులు కూడా తదుపరి సమావేశంలో చర్చించనున్నారని ఆయన తెలియజేశారు.

30శాతం ఇన్కమ్ టాక్స్ పేరుతో కేంద్రం ప్రభుత్వానికి జమ

పన్నురాయింపు పోరాటాలకు సిద్ధం కావాలి

అలాగే ఈ పెరుగుదలలో 30శాతం ఇన్కమ్ టాక్స్ పేరుతో కేంద్రం ప్రభుత్వానికి జమ అవుతుంది, కాబట్టి కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో 8 లక్షలకు లోపు ఉన్న వారిని ఆర్థికంగా వెనుకబడిన వారుగా గుర్తించి పది శాతం రిజర్వేషన్ కల్పించిన నేపథ్యంలో (దీనిపై ఇప్పటికే తమిళనాడు హైకోర్టులో ఆదాయం 8 లక్షల లోపు ఉన్న ఆదాయం వారికి పన్ను మినహాయించాలని అప్పీలు దాఖలైన నేపథ్యంలో) బొగ్గు గని కార్మికులకు కూడా 8 లక్షల లోపు ఆదాయాన్ని ఆదాయపు పన్ను నుంచి మినహా ఇంపు ఇవ్వాలనే డిమాండ్తో బొగ్గు గని కార్మికులందరూ కూడా పోరాటానికి సిద్ధంగా ఉండాలని దానికి సీఐటీయూ ముందు పీఠాన నిలబడుతుందని ఆయన తెలియజేశారు. మీటింగ్ లో బ్రాంచి కార్యదర్శి ఎండి అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.



12న భద్రాద్రి జిల్లాకు సీఎం రాక

- ప్రారంభించనున్న కలెక్టరేట్ నూతన భవనం
- పర్యటన ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్

నవతెలంగాణ-కొత్తగూడెం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు ఈ నెల 12వ తేదీన నూతన కలెక్టరేట్ కార్యాలయాన్ని ప్రారంభించుటకు రానున్నందున అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. సోమవారం నూతన కలెక్టరేట్ కార్యాలయాన్ని అన్ని శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కార్యాలయం ప్రారంభోత్సవంలో అధికారులకు కేటాయించిన విధులను అంకితభావంతో నిర్వహించాలని చెప్పారు. ఆహ్లాదకర వాతావరణంలో నిర్మించిన నూతన కలెక్టరేట్‌లోకి అన్ని శాఖల కార్యాలయాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్యాలయాలను పరిశుభ్ర పరిచి అందంగా అలంకరించాలని చెప్పారు. మంగళవారం సాయంత్రం వరకు అన్ని ఏర్పాట్లును అధికారులు పూర్తి చేసి సంసిద్ధంగా ఉండాలన్నారు. వాహనాలు పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని రవాణాశాఖ అధికారులకు సూచించారు. కార్యక్రమం సజావుగా సక్రమంగా జరిగేందుకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని చెప్పారు. కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌ను ఆయన పరిశీలించారు. బహిరంగసభ నిర్వహించుటకు ఏర్పాట్లును పరిశీలించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. అన్ని శాఖల అధికారులు శాఖాపరంగా ప్రగతి నివేదికలు అందచేయాలని చెప్పారు. విధులు కేటాయించిన అధికారులు తక్షణమే ఆయా శాఖల అధికారులకు రిపోర్టు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కర్నాటి వెంకటేశ్వర్లు, ఆర్అండ్‌బీ ఈఈ భీమ్లా, డీఆర్డిఓ మధుసూదన్రాజు, డీపీఓ రమాకాంత్, డీసీఓ వెంకటేశ్వర్లు, ఉద్యాన అధికారి జినుగు మరియన్న, ఆర్ఎస్ఐఓ సులోచనారాణి, జిల్లా వైద్యాధికారి డాక్టర్ శిరీష, పశుసంవర్ధక అధికారి డాక్టర్ పురందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి తగాదాలలో పాఠశాల రహదారి బంద్

నవతెలంగాణ-టేకుల్లపల్లి



మండల కేంద్రమైన టేకులపల్లిలోఅన్నదమ్ముల ఆస్తి తగాదాలో గ్రావిటీ ప్రయివేట్ పాఠశాల రహదారి బంద్ చేసిన సంఘటన సోమవారం జరిగింది. టేకులపల్లి గ్రామానికి చెందిన బోడ పుణ్య నాయక్ గ్రావిటీ ప్రైవేటు పాఠశాల ఏర్పాటు చేశారు. ఈ పాఠశాల యజమానిగా గత కొన్ని సంవత్సరాల నుండి బాధ్యతలు చేపట్టి పాఠశాలను కొనసాగిస్తుండగా తమ సోదరుడైన బోడ వాల్య భూమి వాటాలు సరిగా లేవని రహదారిలో పిల్లలు పాఠశాలకు వెళ్లకుండా కంచెను ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు కొత్తగూడెం, ఇల్లందు ప్రధాన రహదారిలో సుమారు గంటసేపు రాస్తారోకో చేయగా రోడ్డు ఇరువైపులా సుమారు గంటసేపు వాహనాలను నిలిపివేశారు. సమాచారం తెలుసుకున్న ఎస్.ఐ. భూక్యా శ్రీనివాస్ సంఘటన స్థలానికి చేరుకొని పాఠశాలకు ఏర్పాటు చేసిన కంచెను తొలగించి, రాస్తారోకో విరమింప చేశారు. పాఠశాల యధావిధిగా కొనసాగే విధంగా చర్యలు చేపట్టారు. అనంతరం సోదరులు బోడాపూణ్య నాయక్, బోడవాల్యా నాయక్‌లను విచారణ నిమిత్తం స్థానిక పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లినట్లు ఎస్ఐ తెలిపారు. ఆస్తి ఆర్థిక తగాదాలో ఉన్న పాఠశాలకు పిల్లలను ఏ విధంగా పంపించాలని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మాజీ ఎంపీ పొంగులేటి పర్యటన

నవతెలంగాణ-చంద్రుగొండ



మండలంలో మాజీ పార్లమెంట్ సభ్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మద్దుకూరు రవికంపాడు గ్రామాల్లో పలు కుటుంబాలను సోమవారం పరామర్శించారు. మద్దుకూరు గ్రామంలో ఇటీవల విద్యుద్ఘాతంతో మృతి చెందిన తన్నీరు కిరణ్, యాక్సిడెంట్‌తో మంచంలో ఉన్న సూధం పెద్ద వెంకటేశ్వర్లను, కిడ్నీ వ్యాధిగ్రస్తుడు నాగుల్‌ను, నీటి తొట్టిలో బడి మృతి చెందిన చిన్నారి శాన్వి కుటుంబాన్ని, రైకంపాడులో ఇటీవల మృతి చెందిన నూతలపాటి అప్పమ్మ, ఇనుముల నరసింహ, పోడేల రామలక్ష్మి, నిజాంపట్నం వెంకటేశ్వర్లు వారి కుటుంబాలను పరామర్శించారు. నేను ఉన్నానంటూ భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో అంకిరెడ్డి కృష్ణారెడ్డి మాలోత్ బొజ్జ నాయక్, సారేపల్లి శేఖర్, పత్తిపాక వెంకటేశ్వర్లు, మధుసూదన్ రావు, ఆళ్లకుంట రామదాసు నరుకుల్ల సత్యనారాయణ, రాముడు, చెవుల చంద్రరావు సగొండి రాఘవులు, బన్నే నాగ రాజు, వెంకటేశ్వర్లు, నన్నక సంపత్, నెల్లూరు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడలతో మానసికొల్లాసం : కొత్వాల

నవతెలంగాణ-పాల్వంచ

క్రీడలతో మానసికోల్లాసం, దేహదారుడ్యాలు కలుగుతాయని డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. ఇటీవల మృతి చెందిన పాత పాల్వంచకు చెందిన ధర్మరాజుల అనిల్, పొదిల మనికృష్ణల జ్ఞాపకార్థం ఎ.కె అండ్ ఎం.కె కప్ పేరుతో జరిగిన క్రికెట్ క్రీడలల్లో విజయం సాధించిన టీంలకు కొత్వాల బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడల వలన పోటీతత్వం పెరుగుతుందన్నారు. అంతర్జాతీయ క్రీడలు క్రికెట్ పోటీలతో వ్యక్తిగత సామర్థ్యం వెలుగులోకి వస్తుందన్నారు. క్రీడల వలన మానసిక ప్రశాంత లభిస్తుందన్నారు. మొదటి బహుమతిగా 2 బ్రదర్స్ రూ.10వేలు, షీల్డ్, రెండవ బహుమతిగా 46 రైడర్స్ (సాయి నగర్)లు రూ.5వేలు నగదు, షీల్డ్ గెలుపొందిన విజేతలకు కొత్వాల బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాత పాల్వంచ మాజీ కౌన్సిలర్ కొత్వాల సత్యనారాయణ, జడ్పీటీసీ సభ్యులు బరపటి వాసుదేవరావు, టీఆర్ఎస్వి నియోజకవర్గం చైర్మన్ బత్తుల మధుచంద్, వీరాస్వామి, మౌలాలి, పోటీల నిర్వాహకులు సి.కె.బి.యూత్ నాయకులు, నిమ్మల పురుషోత్తం, నిమ్మల సాయి, పొదిల రామకృష్ణ, శ్యామ్, డి.వెంకటేశ్వర్లు, బ్రహ్మం, హరి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

18 నుండి కంటి వెలుగు రెండోదశ

- ప్రారంభించనున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-అశ్వారావుపేట

తెలంగాణ ప్రభుత్వం నిర్వహించనున్న రండో విడత కంటి వెలుగును ఈ నెల 18న ఖమ్మం బహిరంగసభలో ముఖ్యమంత్రి కేసీఆర్ శ్రీకారం చుట్టనున్నారు. ఇదే క్రమంలో నియోజక వర్గం కేంద్రం అయిన అశ్వారావుపేట ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు లాంచనంగా ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో కంటి పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లు, సౌకర్యాలపై సోమవారం మండల వైద్యాధికారి డాక్టర్ రాందాస్ ఎండీఓ విద్యాధర్ రావుతో సమావేశం అయ్యారు. ఇప్పటికే ప్రభుత్వం గతంలో నిర్వహించిన తొలి విడత కంటి వెలుగు కార్యక్రమంలో మండల వ్యాప్తంగా 32 వేలు మందికి కంటి పరీక్షలు నిర్వహించి అవసరం అయిన వారికి కండ్లద్దాలు పంపిణీ చేశారు. ఈ సారి అవసరాన్ని బట్టి కండ్లద్దాలు పంపిణీచేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీఈఓ సీతారామరాజు, డాక్టర్ దీపక్ రెడ్డి, హెచ్ఈఓ రాజు ఉన్నారు.






సీఎం కేసీఆర్ గూడెం పర్యటన జయప్రదం చేయాలి

- ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు

నవతెలంగాణ-కొత్తగూడెం

సీఎం కేసీఆర్ జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు కార్యకర్తలకు సూచించారు. సోమవారం కొత్తగూడెం క్లబ్‌లో జరిగిన సమావేశంలో వనమా మాట్లాడారు. ఈనెల 12వ తేదీన ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోతుందని, కొత్తగూడెం కొత్తగూడెం నియోజకవర్గ పర్యటనకు వస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ ఘన స్వాగతం పలకాలని కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా జడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్ రావు, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతా లక్ష్మి, మున్సిపల్ వైస్ చైర్మన్ దామోదర్ యాదవ్, వనమా రాఘవేంద్రరావు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





చిన్నతనం నుండి కష్టపడి చదువుకుంది. అందుకే శ్రమ విలువ ఆమెకు బాగా తెలుసు. కళారూపాల ద్వారా ప్రజా సమస్యలను సమాజానికి చాటింది. విద్యార్థి పోరాటాల్లో భాగమై వివక్షను ప్రశ్నించింది. జర్నలిస్టుగా తోటి ఉద్యోగుల సమస్యలపై గళమెత్తింది. అటు గొంతుని, ఇటు అక్షరాన్ని తన ఆయుధంగా మలుచుకుంది. ఇలా అనేక ఉద్యమాల్లో రాటుదేలింది. ఎంతో మంది జర్నలిస్టుల జీవితాలను ప్రపంచానికి పరిచయం చేసింది. స్వాతంత్ర్య సమరయోధుల స్ఫూర్తి గాథలను అక్షరీకరించింది. కన్నడ, తెలుగు అనువాదాలు చేస్తూ సాహిత్యానికి విశేషమైన కృషి చేస్తుంది. ఆమే ప్రముఖ కన్నడ రచయిత్రి శాంతకుమారి. ఆమె పరిచయం నేటి మానవిలో...

పోరాటాలే మనల్ని రాటుదేలుస్తాయి

బెంగుళూరులో పుట్టి పెరిగాను. అమ్మ కమలమ్మ, నాన్న కృష్ణప్ప. నాన్న మేస్త్రీ పని చేసేవాడు. అయితే ఇల్లు పట్టించుకునేవాడు కాదు. ఎప్పుడు ఇల్లు వదిలి ఎటో పోతూ వుండేవాడు. దాంతో ఇంటి బాధ్యత మొత్తం మా అమ్మనే చూసుకునేది. కూలి పనులు చేసి మమ్మల్ని కష్టపడి పెంచింది. మేము ఐదుగురం పిల్లలం. అందరికంటే నేనే పెద్దదాన్ని. ఇద్దరం ఆడపిల్లం. ముగ్గురు మగపిల్లలు. మా పెద్ద తమ్ముడు, చిన్న తమ్ము చిన్నతనంలోనే చనిపోయారు. అప్పట్లో అమ్మ దగ్గర వైద్యం చేయించడానికి డబ్బులు కూడా లేవు. సరైన వైద్యం అందించలేక వాళ్ళను పోగొట్టుకున్నాము.

గంజి తాగి బతికేవాళ్ళం


నేను ఆరో తరగతికి వచ్చే సరికి మా నాన్న మమ్మల్ని బళ్ళారి తీసుకుపోయాడు. అక్కడ కూడా మాకు ఇవే కష్టాలు. నేను చెల్లిని, తమ్ముడిని చూసుకుంటూ మూడు కిలో మీటర్ల దూరం వుండే ప్రభుత్వ పాఠశాలకు వెళ్ళి చదువుకునేదాన్ని. ఉదయం స్కూల్‌కు బన్ను, టీ తాగి వుండేవాళ్ళం. బాక్సులో గంజి తీసుకుపోయే వాళ్ళం. మా ఇబ్బంది చూసి మా టీచర్ మా కోసం ఇంటి నుండి బాక్సు తీసుకొచ్చేవారు. ఎనిమిదో తరగతి నుండి చిన్న పిల్లలకు ట్యూషన్ చెప్పడం మొదలుపెట్టాను. దాంతో కొంత ఆదాయం వచ్చేది. అమ్మ కూలీ డబ్బులతో పాటు ఇది కూడా ఇంటి ఖర్చులకు ఉపయోగపడేది. ఇలా చదువుకుని పదోతరగతి జిల్లా ఫస్ట్ వచ్చాను. దాంతో నా పేరు పత్రికలో వచ్చింది. అప్పుడే జైనుల్లా అనే ఒక రిపోర్టర్ పరిచయం అయ్యారు. అప్పట్లో కన్నడలో ఓరాట(పోరాటం) అనే పత్రిక ఉండేది. దాని కోసం నాతోటి చిన్న చిన్న ఆర్టికల్స్ ఆయనే రాయించే వారు. స్కూల్ లైబ్రరీలో ఉండే పుస్తకాలన్నీ చదివేదాన్ని. చిన్నప్పటి నుండి పుస్తకాలు చదవడమంటే చాలా ఇష్టం.

డ్రామా అంటే భయం వేసింది

ఇంటర్ చదివేటపుడు సిద్ధప్ప అనే ఒక దళిత కవి ఉండేవారు. ఆయన పీహెచ్‌డీ చేస్తూ మా ప్రాంతానికి వచ్చారు. మా ఏరియాలో ఉండే లోకల్ లీడర్ నా గురించి చెబితే నన్ను కలవడానికి వచ్చారు. నన్ను ఓ కల్చరల్ టీం వేస్తున్న డ్రామాలో చేయమన్నారు. డ్రామా అంటే ముందు ఒప్పుకోలేదు. నేను డ్రామాలు వేయడమేంటి అని భయం వేసింది. కానీ వచ్చింది పెద్దవాళ్ళు కదా అని కాదనలేకప ఒప్పుకున్నాను. ఓ నాలుగు రోజులు వెళ్ళి చూద్దామనుకున్నాను. అక్కడకు వెళ్ళిన తర్వాత అర్థమయింది. సమాజంలోని సమస్యలపై వాళ్ళు వీధి నాటిక వేస్తున్నారని. అది నాకు బాగా నచ్చింది. దాంతో ఆ వీధి నాటికల్లో నేనూ కొన్ని పాత్రలు వేయడం మొదలుపెట్టాను. కొన్ని రోజులకు కల్చరల్ కన్వీనర్‌గా నన్ను పెట్టుకున్నారు. అది 'సముదాయా' కళాకారుల సంస్థ.

అగ్రకుల పెత్తనానికి వ్యతిరేకంగా

అప్పుడు నేను ఇంటర్ చదివుతున్నాను. దాంతో ఎస్.ఎఫ్.ఐ వాళ్ళు పరిచయం అయ్యారు. ఆ కార్యక్రమాలకు కూడా నన్ను తీసుకుపోతుండేవారు. స్టూడెంట్‌ని కాబట్టి విద్యార్థి సంఘంలోనే పని చేయాలని ఎస్.ఎఫ్.ఐ నాయకులు నన్ను 1981లో బళ్ళారి జిల్లా ఎస్.ఎఫ్.ఐ కన్వీనర్‌గా బాధ్యతలు ఇచ్చారు. అప్పట్లో కాలేజీలో పెద్ద సమస్య వుండేది. లింగాయిస్ అనే అగ్రకులం వారికి కాలేజీలో ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చేవారు. కింది కుల విద్యార్థుల పట్ల చాలా వివక్ష చూపించేవారు. దీనిపై ఎన్నో పోరాటాలు చేశాము. ఇలా విద్యార్థి సంఘంలో ఎన్నో కార్యక్రమాలు చేసేవాళ్ళం.



పుస్తకాలు బాగా చదివేదాన్ని

ఇంటర్‌లో నాకు స్కాలర్‌షిప్ వచ్చింది. అందులోని 500 పెట్టి అమ్మ ఓ మేకను కొన్నది. దాని పిల్లలు, వాటి పిల్లలు కలిపి కొంత కాలానికి మొత్తం 40 మేకలు అయ్యాయి. ఆ మేకలే మాకు జీవనాధారం అయ్యాయి. స్మాశాన స్థలంలో చిన్న ఇల్లు కట్టుకొని అందులో ఉండేవాళ్ళం. ఎస్.ఎఫ్.ఐ లోకి వచ్చిన తర్వాత పుస్తకాలు చదవడం బాగా పెరిగింది. కారల్ మార్క్స్ జీవితం, మాక్సిమ్ గోర్కి అమ్మ లాంటిప ఉస్తకాలు నన్ను బాగా ప్రభావితం చేశాయి. ఈ పుస్తకాలు ఎంతటి ప్రభావం చూపించేవంటే ఒక ఆర్‌ఎస్ఎస్ ఆయన కూడా వీటిని చదివి కమ్యూనిస్టుగా మారిపోయాడు. నేనైతే రోజుకొక పుస్తకం చదివేదాన్ని.



అక్రమంగా అరెస్టు చేశారు

సెకండ్ పీయూసీ చదివేటపుడు ఎస్.ఎఫ్.ఐ తరపున మా కాలేజీలో లింగాయిస్‌కు వ్యతిరేకంగా ఒక కరపత్రం వేశారు. దాంతో నన్ను, నాతో పాటు మరో ఎస్.ఎఫ్.ఐ లీడర్‌ని అరెస్టు చేసి స్టేషన్‌కి తీసుకుపోయారు. అతన్ని బాగా కొట్టారు. అప్పుడు సీపీఎం పార్టీలో ఉండే లాయర్ వచ్చి మాకు బెయిల్ ఇచ్చి తీసుకుపోయారు. మమ్మల్ని అక్రమంగా అరెస్టు చేశారని తర్వాత రోజు కాలేజీలో బంద్ చేశాం. వాళ్ళు మమ్మల్ని నక్సలైట్స్ అనుకున్నారు. పోలీసులకు కనీస రాజకీయ అవగాహనే లేదు. 144 సెక్షన్ కూడా పెట్టారు. స్టూడెంట్స్ ఎవరైనా పోలీస్ స్టేషన్ ముందుగా పోతుంటే చాలు కొట్టేవాళ్ళు. దాంతో మేము కూడా పోలీసులపైన కేసు వేశాము. ఎంక్వైరీ కమిటీ కూడా వేశారు. చివరికి నన్ను అరెస్టు చేసిన ఇనిస్పెక్టర్‌ని సస్పెండ్ చేశారు.

ఐక్యరంగలో పని చేశాను

1983లో నేను తిరిగి బెంగుళూరు వచ్చాను. మా అమ్మ వాళ్ళు మాత్రం బళ్ళారిలోనే ఉండేవారు. నేను బెంగుళూరులోని పిన్ని వాళ్ళ దగ్గర ఉండేదాన్ని. అప్పుడు బెంగుళూరులో 'ఐక్యరంగ' అనే వామపక్ష పత్రిక ఉండేది. అందులో పని చేయమని అడిగారు. రాత్రంత పార్టీ ఆఫీసులో ఉండి టైప్ చేసి పత్రిక వచ్చిన తర్వాత పోస్ట్ చేసి ఇంటికి వెళ్ళేదాన్ని. ఆ సమయంలో విజయవాడ నుండి మురళి అనే ఎస్.ఎఫ్.ఐ పూర్తి కాలం కార్యకర్త వాళ్ళ అమ్మను హాస్పిటల్లో చూపించడానికి బెంగుళూరు వచ్చి పార్టీ ఆఫీసులో ఉండేవారు. నాకు తెగులు కొద్దికొద్దిగా వచ్చు. తెలుగులో నాకేమైనా అనుమానాలు ఉంటే మురళిని అడిగి తెలుసుకునేదాన్ని. కొంత కాలానికి ఆయన వెళ్ళిపోయారు. చాలా రోజుల తర్వాత మళ్ళీ వచ్చి నాకు సుందరయ్యగారి పుస్తకం ఇచ్చి వెళ్ళారు. అప్పటికే వాళ్ళ అమ్మ చనిపోయారని తెలిసి బాధపడ్డాను.

ఆర్థిక ఇబ్బందులతో...

పత్రికలో పని చేస్తూనే ఎస్.ఎఫ్.ఐ కార్యక్రమాల్లో పాల్గొనేదాన్ని. ఆ సమయంలోనే పెండ్లి గురించి పార్టీ నాయకులు నన్ను అడిగారు. నేనింకా దాని గురించి ఆలోచించలేదని, చెల్లి, తమ్ముడి బాధ్యత నాకుందని చెప్పాను. అయితే పార్టీ నాయకులు ఒక అబ్బాయి ఉన్నాడు. నిన్ను పెండ్లి చేసుకుంటానంటున్నాడు. నీకు బాగా తెలిసిన అతనే అన్నారు. మీకు ఇష్టమైతే నాకూ ఇష్టమే అన్నాను. ఇంతకీ నాకు తెలిసిన అబ్బాయి ఎవరా అనుకుంటే అతను మురళి. పార్టీ వాళ్ళే మాకు దండలు మార్చి పెండ్లి చేశారు. ఆయన కూడా మాతో పాటు బెంగుళూరులోనే ఉండిపోయారు. తర్వాత మాకు బాబు పుట్టాడు. మురళి పని చేస్తున్న ఫ్యాక్టరీ లాకౌట్ అయ్యింది. దాంతో ఇల్లు గడవడం కష్టమయింది. తింటానికి తిండి కూడా ఉండేది కాదు. ఒక పక్క బాబు కాళ్ళు వంకరతో పుట్టాడు. వైద్యం చేయించాల్సి వచ్చింది. ఆర్థికంగా చాలా ఇబ్బంది పడాల్సి వచ్చింది. నేను ఐద్వాలో పని చేస్తుండేదాన్ని. తర్వాత పాప పుట్టడంతో ఖర్చులు మరింత పెరిగాయి. ఆర్థిక ఇబ్బందులతో 'రెడ్ పేర్' అనే పత్రికలో కొంత కాలం పని చేశాను. తర్వాత 'సంయుక్త కర్నాటక' అనే పత్రిక పెడితే అందులో చేరాను.

జర్నలిస్టుగా పదహారేండ్లు...

నాకు తెలిసిన వారి ద్వారా మురళి ఈనాడులో చేరారు. అందులో 12 ఏండ్లు చేశారు. తర్వాత వార్తలో అసెంబ్లీ న్యూస్ చూసేవారు. అక్కడ 16 ఏండ్లు చేశారు. నేనైతే 16 ఏండ్లు పత్రికా రంగంలో ఉన్నాను. జర్నలిస్టు యూనియన్‌లో ఎక్కువగా పని చేశాను. రాష్ట్ర వ్యాప్తంగా 7000 మంది జర్నలిస్టులు ఉన్నారు. 'కర్నాటక కార్య నిరతా పత్రకర్త సంఘం'(కర్నాటక వర్కింగ్ జర్నలిస్టు యూనియన్) వుండేది. అందులో 20 ఏండ్లు పని చేశాను. ఇప్పుడు ఐఎఫ్‌డబ్ల్యూజే ఆలిండియా వైస్ ప్రెసిడెంట్‌గా ఉన్నాను. జర్నలిస్టుల కోసం రాష్ట్రంలో ఏర్పాటు చేసిన పెన్షన్ కమిటీలో ఉన్నాను. 16 ఏండ్లు పని చేసిన తర్వాత సంయుక్త కర్నాటక పత్రిక వాళ్ళు నన్ను అక్రమంగా తొలిగించారు. దాంతో కేసు వేసి పోరాటం చేసి గెలిచాను. బీదర్‌లో పోస్టింగ్ ఇచ్చారు కానీ ఆ ప్రాంతం పిల్లలకు అనుకూలం కాదని వదిలేశాను. నష్టపరిహారం మాత్రం తీసుకున్నాను.

105 మందిని లిస్ట్ చేశారు

ప్రస్తుతం కర్నాటకలో బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉంది. పేదలకు రావల్సిన అన్ని సౌకర్యాలను కట్ చేస్తున్నారు. ఏ కొత్త కట్టడం ప్రారంభించినా సావర్కర్ పేరు పెడుతున్నారు. ఎక్కడైనా జాతరలు జరిగితే ముస్లింలను అంగడి పెట్టుకోనీయరు. మంగుళూరు అని సెన్సిటివ్ ప్రాంతం ఉంది. అక్కడ అల్లరు సృష్టిస్తున్నారు. ముస్లిం అమ్మాయి, హిందూ అబ్బాయి కలిసి మాట్లాడకూడదు. ఆర్.ఎస్.ఎస్ ఎక్కడ బలంగా ఉంటే అక్కడ గొడవలు జరుగుతున్నాయి. అభ్యుదయ రచయిత గౌరీ లంకేష్‌ను చంపేశారు. ప్రస్తుతం అభ్యుదయ వాదులైన 105 మందిని లిస్ట్ చేశారు. వాళ్ళపై అనేక ఆంక్షలు విధిస్తున్నారు.

పన్నెండు పుస్తకాలు

ఇప్పటి వరకు నేను రాసిన పుస్తకాలన్నీ ఎక్కువగా జర్నలిస్టుల జీవితాల గురించే ఉన్నాయి. మొత్తం 12 పుస్తకాలు వచ్చాయి. అందులో ఎనిమిదిటికి అవార్డులు వచ్చాయి. వాటిలో ఒకటి 'మానవీయ ముత్తగళ్'. అంతర్జాతీయ స్థాయిలో పని చేసిన జర్నలిస్టుల జీవితాలను కన్నడలోకి అనువాదం కూడా చేశాను. తెలంగాణ సాహితి వారు తీసుకొచ్చిన 'తెలుగెత్తి జైకొట్టు' పుస్తకాన్ని కన్నడలోకి అనువాదం చేశాను. మహిళల్లో ఎంతో మంది గొప్ప గొప్ప జర్నలిస్టులు ఉన్నారు. కానీ వారి గురించి ప్రపంచానికి తెలియడం లేదు. వాళ్ళ గురించి పుస్తకాలు తీసుకొచ్చాను. అలాగే స్వాతంత్ర్య సమరయోధుల జీవితాల గురించి వంద స్టోరీలను సేకరించి త్వరలో పుస్తకంగా తీసుకురాబోతున్నాను. నిస్సిమ కన్నడతి, గురూజీ రాజ్య లక్ష్మమ్మ స్మారక ప్రశస్తి, కరునాడ కన్మణి అవార్డ్, కన్నడ రాజ్య ఉత్సవ అవార్డ్, కవి రత్న కాళిదాస అవార్డ్, నవ చైతన్య ధీర మహిళే అవార్డ్, సావిత్రిబాయి పూలే అవార్డు, ఆసియా ఉమెన్ సబ్‌స్టాన్షనల్ 2019 అవార్డు ఇలా ఎన్నో అవార్డులు అందుకున్నాను.

జర్నలిస్టుల కోసం పని చేస్తా

మా అబ్బాయి గవర్నమెంట్ లెక్చరర్‌గా చేస్తున్నాడు. మా అమ్మాయి మెడికల్ ఫీల్డ్‌లో ఉంది. మా చెల్లి అంగన్‌వాడీ టీచర్‌గా చేస్తూ బళ్ళారి జిల్లా సిఐటీయూలో పని చేస్తుంది. తను దేవదాసీల సమస్యలపై బాగా పని చేస్తుంది. జర్నలిస్టుల సమస్యలపై నా జీవితమంతా పని చేస్తాను. భవన నిర్మాణ కార్మికులకు ఎలాగైతే కొన్ని ప్రత్యేక సదుపాయాలు ఉన్నాయో అలాగే జర్నలిస్టులకు కూడా రావాలి. దీనిపై సీరియస్‌గా ఉద్యమం చేయాలి. మహిళలు బాగా చదవాలి. బయటకు రావాలి. ఉద్యమాల్లో భాగస్వాములు కావాలి. అప్పుడే ఆత్మస్థైర్యం వస్తుంది. పోరాటాలే మనల్ని రాటుదేలుస్తాయి.

– సలీమ

వేతనాల్లో వివక్ష

(మొదటిపేజీ తరువాయి)

వేతనాలు అందుతున్నాయా? లేదా? అనేది పరిశీలించే నియంత్రణా వ్యవస్థను తీసుకురావాలని సూచించింది. ప్రభుత్వ కాంట్రాక్టుల్లో మహిళల నేతృత్వంలో నడిచే కంపెనీలకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపింది. అంతేగాక పని ప్రదేశాల్లో మహిళా కార్మికుల భద్రతపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించింది.

నివేదికలో పేర్కొన్న మరికొన్ని అంశాలు ఈవిధంగా ఉన్నాయి. దేశీయ నిర్మాణరంగం, రియలెస్టేట్ రంగంలో మొత్తం 5.7కోట్లమంది పనిచేస్తుండగా, ఇందులో పురుషుల సంఖ్య 5కోట్లకుపైగా ఉంది. 70లక్షల మంది మహిళలు పనిచేస్తున్నారు. అందునా మహిళా కార్మికులు, ఉద్యోగులు ఎక్కువగా అసంఘటిత రంగంలోనే ఉన్నారు. ఇక్కడ పురుషులకు అందుతున్న వేతనాలకు, మహిళలకు ఇస్తున్న వేతనాలకు మధ్య వ్యత్యాసం పెద్దఎత్తున ఉంది. లింగ అసమానతలు పెద్ద ఎత్తున ఉన్నాయి.

గంటకు రూ.26.15

నిర్మాణరంగ పరిశ్రమలో వేతనాల్లో వ్యత్యాసం 34.5శాతంగా ఉంది. ఒక గంటకు మహిళలకు అందుతున్న వేతనం కేవలం రూ.26.15. పురుషులకు రూ.39.95 దక్కుతోంది. నిర్మాణరంగ కంపెనీల సీఈవోలుగా బ్రిటన్‌లో 14శాతం మంది మహిళలున్నారు. అమెరికాలో 7శాతం, భారత్‌లో కేవలం 2శాతంగా ఉంది. మేనేజర్ స్థాయి ఉద్యోగాల్లో మహిళలు చాలా తక్కువగా ఉన్నారు. వివిధ పరిశ్రమల్లో కార్పొరేట్ బోర్డుల్లో మహిళల ప్రాతినిధ్యం 17.3శాతానికి పరిమితమైంది. ఇది నిర్మాణరంగంలో మరింత తక్కువగా నమోదైంది. అత్యున్నతస్థాయి మేనేజ్‌మెంట్ స్థాయికి చేరుకునే మహిళల సంఖ్య 1 నుంచి 2శాతం ఉంది. దేశవ్యాప్తంగా లైసెన్స్ పొందిన ఆర్కిటెక్ట్‌ల్లో 47.6శాతం ఉన్నా, వారికి సమాన వేతనాలు అందటం లేదు. వేతనాల్లో తేడా 15శాతంపైగా ఉంది. సెమీ స్కిల్డ్, మిడ్ లెవల్ అయిన సైట్ సూపర్‌వైజర్స్, కాంట్రాక్టర్స్, సర్వేయర్స్, కార్పెంటర్స్, ప్లంబర్స్, పెయింటర్స్, మాసన్స్..ఉద్యోగాల్లో మహిళల ప్రాతినిధ్యం చాలా తక్కువగా ఉంది. బరువులు ఎత్తటం అనే పనిలోనే మహిళలకు ఉపాధి దక్కుతోంది. ఇటుక తయారీ, క్వారీ కార్మికురాలు, ఇండ్ల నిర్మాణం, లారీ లోడింగ్...మొదలైన వృత్తుల్లో మహిళలు ఎక్కువగా ఉన్నారు. నిర్మాణరంగంలో ఉపాధి పొందిన మహిళల్లో 84శాతం మంది దినసరి కూలీలే.

చలితో ఉక్కిరిబిక్కిరి

- మరో రెండ్రోజులు ఇదే పరిస్థితి
- వేగంగా పడిపోతున్న రాత్రి ఉష్ణోగ్రతలు
- కోహిర్‌లో 4.6 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత
- 31 జిల్లాల్లో పదిడిగ్రీల లోపే కనిష్ట ఉష్ణోగ్రతలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

చలి వణుకు పుట్టిస్తున్నది. ప్రజానీకాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నది. 31 జిల్లాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు పది డిగ్రీల లోపే నమోదు కావడం పరిస్థితి తీవ్రతకు అద్దంపడుతున్నది. ఆ జిల్లాలన్నీ ఆరెంజ్ హెచ్చరిక జాబితాలో ఉన్నాయి. రాత్రిపూట ఉష్ణోగ్రతలు వేగంగా తగ్గుతున్నాయి. రోజువారీ ఉష్ణోగ్రతల కంటే ఒకేసారి మూడు నుంచి ఐదు డిగ్రీల మేర పడిపోయాయి. ఉదయం పది దాటినా చలితీవ్రత మాత్రం తగ్గడం లేదు. దీంతో ఇంటి తలుపులు తీయలేని పరిస్థితి నెలకొంది. సంగారెడ్డి జిల్లా కోహిర్‌లో 4.6 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత రికార్డయింది. ఈ ఏడాది ఇదే అత్యల్పం కావడం గమనార్హం. సంగారెడ్డి, రంగారెడ్డి, కామారెడ్డి, కొమ్రంభీమ్ ఆసిఫాబాద్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాల్లో చాలా ప్రాంతాల్లో అత్యల్ప ఉష్ణోగ్రతలు(ఆరు డిగ్రీల లోపు) నమోదయ్యాయి. రాష్ట్రంలో మరో రెండ్రోజుల పాటు చలితీవ్రత ఇదే స్థాయిలో ఉండే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరికలను జారీ చేసింది. ఈశాన్య దిశ నుంచి తెలంగాణ మీదుగా కిందిస్థాయిలో గాలులు వీస్తున్నాయనీ, ఉత్తర తెలంగాణ జిల్లాల్లో చల్లని గాలులు ఎక్కువగా వీచే అవకాశం ఉందని వెల్లడించింది. ఈ నేపథ్యంలో ఆస్తమా, శ్వాసకోసవ్యాధిగ్రస్తులు, చిన్నపిల్లలు, వృద్ధులు అప్రమత్తంగా ఉండాలని వైద్యనిపుణులు సూచిస్తున్నారు.

కోహిర్(సంగారెడ్డి) -4.6 డిగ్రీలు,సిర్పూర్(యూ) (కొమ్రంభీం ఆసిఫాబాద్) -4.8 డిగ్రీలు,మర్పల్లి(వికారాబాద్)- 5.0డిగ్రీలు, తాళ్లపల్లి (రంగారెడ్డి)-5.0 డిగ్రీలు, మంగల్‌పల్లి(రంగారెడ్డి)-5 . 2 డిగ్రీలు,బజార్‌హత్నూర్(ఆదిలాబాద్)- 5.4 డిగ్రీలు డోంగ్లి(కామారెడ్డి) -5.5 డిగ్రీలు శివంపేట్(మెదక్)-5.6 డిగ్రీలు, న్యాల్‌కల్(సంగారెడ్డి) -5.6 డిగ్రీలు,నల్లవెల్లి(సంగారెడ్డి)-5.7 డిగ్రీలు.

సర్పంచుల నిధులను కొల్లగొడుతున్నారు

(మొదటిపేజీ తరువాయి)

కేసీఆర్‌కు అధికారం లేకుండా చేస్తేనే పంచాయతీలకు పూర్వ వైభవం వస్తుందని తెలిపారు. సర్పంచుల వ్యవస్థను నిర్వీర్యం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో రాష్ట్రంలో 60మంది సర్పంచులు చనిపోయారని తెలిపారు. ప్రభుత్వ వైఖరి వల్ల చనిపోయిన ప్రతి సర్పంచ్ కుటుంబానికి రూ.కోటి పరిహారం ప్రకటించాలని డిమాండ్ చేశారు. టీపీసీసీ రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ ఆధ్వర్యంలో సోమవారం ఇందిరాపార్కు వద్ద ధర్నాచౌక్ వద్ద 'నిధులు, విధులపై సర్పంచుల శంఖారావం' నిర్వహించారు.ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సర్పంచులను సమస్యల్లో పడేసిందన్నారు. ప్రభుత్వ వైఖరితో కొందరు ఆత్మహత్యలు చేసుకుంటే, ఇంకొందరు పుస్తెలు అమ్ముకున్న పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచుల నిరసనకు సంఘీభావంగా ధర్నా చేస్తామంటే ప్రభుత్వం పోలీసులతో అడ్డుకున్నదనీ, అయినా హైకోర్టు అనుమతితో కాంగ్రెస్ పార్టీ ధర్నా నిర్వహిస్తున్నదని పేర్కొన్నారు. సర్పంచులకు రావాల్సిన నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వివిధ మార్గాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చే ఆదాయంలో సర్పంచుల వాటాను వారి ఖాతాలో వేయాల్సి ఉంటుందన్నారు. కానీ వారికి రావాల్సిన నిధులు ఇవ్వకుండా ప్రభుత్వం దోపిడీ చేస్తున్నదని విమర్శించారు. సర్పంచుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడంతోపాటు ఆత్మహత్యలకు ఉసిగొల్పింది కేసీఆరేనన్నారు. కాంట్రాక్టర్లకు కట్టబెట్టడానికే సర్పంచులకు రావాల్సిన నిధులను దారి మళ్లించారని ఆరోపించారు. సర్పంచుల వ్యవస్థను నిర్వీర్యం చేయడమే కాకుండా చెట్లు చనిపోయినా వారికి సస్పెండ్ చేస్తున్నారని ఎద్దేవా చేశారు. పాలనలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న మున్సిపల్ మంత్రి కేటీఆర్‌ని ఏం చేయాలని ప్రశ్నించారు. కేటీఆర్ నిర్లక్ష్య వైఖరితో మూసీలో మునిగి 30 మంది చనిపోయారని ఆరోపించారు. రాష్ట్రాన్ని ఇంత అధ్వాన్నంగా మార్చిన తండ్రీ, కొడుకులను ట్యాంక్ బండ్ మీద ఉరేసినా తప్పు లేదని అభిప్రాయపడ్డారు. తెలంగాణలో పుట్టబోయే బిడ్డమీద కూడా కేసీఆర్ రూ. లక్షా 50వేల అప్పు వేశారనీ, తెలంగాణ మోడల్ అంటే ఇదేనా? అని ప్రశ్నించారు.

నాలుగువేల కొత్త పంచాయతీలను ఏర్పాటు చేశామంటూ గొప్పగా చెప్పుకుంటున్న కేసీఆర్...వాటిలో ఎక్కడైనా భవనాలు కట్టించారా? అని నిలదీశారు. ప్రగతిభవన్, సెక్రటేరియట్‌లకు వేల కోట్లు ఖర్చు చేసిన కేసీఆర్ సర్పంచులకు నిధులు విడుదల చేయకపోవడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సర్పంచుల నిధులు ఎవరూ దొంగిలించకుండా పటిష్ఠ చట్టం తీసుకొస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ,కానిస్టేబుల్ అభ్యర్థులు రేవంత్‌కు వినతిపత్రం సమర్పించారు. ధర్నా కార్యక్రమంలో టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్, అంజన్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, షబ్బీర్ అలీ, మల్లు రవి, కోదండరెడ్డి, అద్దంకి దయాకర్, పుష్పలీల, చెరుకు సుధాకర్, సిద్దేశ్వర్ తదితరులు మాట్లాడారు.

పార్టీ ఫిరాయించిన 12 మంది ఎమ్మెల్యేలపైచర్యలు తీసుకోండి : డీజీపీకి రేవంత్ వినతి

పార్టీ ఫిరాయించిన 12మంది ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ టీపీసీసీ అధ్యక్షులు ఎనుముల రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోని బృందం సోమవారం హైదరాబాద్‌లో డీజీపీని కలిసింది. నాగర్ కర్నూలు జిల్లాలో కాంగ్రెస్ కార్యకర్తలపై బీఆర్ఎస్ నాయకులను దాడులపై ఫిర్యాదు చేసింది. గొంతుపై కాలుపెట్టి తొక్కి పరుష పదజాలంతో దూషించారని పేర్కొంది. దాడికి పాల్పడిన వారిపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెడతారని భావించామనీ, కానీ తమ పార్టీ నాయకులు నాగం జనార్ధన్‌రెడ్డిపై అక్రమ కేసులు పెట్టారని రేవంత్ విమర్శించారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో కాంగ్రెస్ కార్యకర్తలపై దాడులకు నిరసనగా ఈనెల 17న దళిత గిరిజన ఆత్మగౌరవ సభ నిర్వహిస్తామని చెప్పారు.

18న బీఆర్ఎస్ భారీ బహిరంగ సభ

- సీఎం కేసీఆర్ నిర్ణయం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఖమ్మం జిల్లాల్లో బీఆర్ఎస్ భారీ బహిరంగసభ నిర్వహించనుంది. బీఆర్ఎస్ జాతీయ పార్టీగా మారిన తర్వాత మొట్ట మొదటి సారిగా నిర్వహించనుండటంతో భారీ ఏర్పాటు చేస్తున్నది. ఖమ్మం జిల్లా మంత్రి, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తదితర కీలక నేతలు సోమవారం ప్రగతి భవన్‌లో బీఆర్ఎస్ అధ్యక్షులు, సీఎం కేసీఆర్‌ను కలిశారు. తెలంగాణలో జరగనున్న మొట్టమొదటి బీఆర్ఎస్ సభను విజయవంతం చేసేందుకు కృషి చేయాలని సీఎం కేసీఆర్ జిల్లా నేతలకు సూచించారు.

ఈ సమావేశంలో మంత్రులు పువ్వాడ అజయ్ కుమార్, హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎంపీలు నామా నాగేశ్వరరావు, బండి పార్థసారథిరెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, తాతా మధు, ఎమ్మెల్యేలు హరిప్రియ నాయక్, రేగా కాంతారావు, కందాల ఉపేందర్ రెడ్డి, సండ్ర వెంకట వీరయ్య లావుడ్యా రాములు నాయక్, ఖమ్మం జెడ్పీ ఛైర్మెన్ లింగాల కమల్‌రాజు, తదితరులు ఉన్నారు.

పార్టీకి ఉప్పల ఎనలేని కృషి

(మొదటిపేజీ తరువాయి)

మాజీ సభ్యులు సభ్యులు పెనుమల్లి మధు అన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా మునుగోడు మండల కేంద్రానికి చెందిన సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు, మునగాల మాజీ సర్పంచ్, సింగిల్ విండో మాజీ చైర్మెన్ ఉప్పల కాంతారెడ్డి (88) మృతిచెందారు. కాంతారెడ్డి మృతదేహాన్ని వారు సందర్శించి పూలమాలలేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎడు దశాబ్దాలపాటు విరామం ఎరుగని పోరాట యోధులుగా కాంతారెడ్డి మంచి గుర్తింపు సంపాదించుకున్నారని తెలిపారు. చిన్ననాటి నుండే బాలల సంఘాల్లో చేరి విప్లవ రాజకీయాల్లో ఓనమాలు దిద్దుకున్నారని చెప్పారు. ఎన్ని కష్టనష్టాలొచ్చినా మొక్కవోని ధైర్యంతో ముందుకు సాగారని గుర్తు చేశారు. అతివాద, మితవాద ధోరణులను ఎదిరించి నిలబడ్డారని తెలిపారు. అనేక నిర్బంధాలను తట్టుకొని మార్క్సిస్టు పార్టీని కంటికి రెప్పలా కాపాడిన చరిత్ర ఆయనకు ఉందన్నారు. నీతిగా, నిజాయితీగా ఆదర్శ కమ్యూనిస్టుగా, ఆజాత శత్రువుగా కడదాకా ప్రజల వెన్నంటి నిలిచారని కొనియాడారు. మునగాల జమీందారీ వ్యతిరేక పోరాటంలోనూ, భూ పోరాటాలు, ప్రజాపోరాటాలు, కూలిపోరాటాలు, రైతాంగ ఉద్యమాలకు నాయకత్వం వహించారని గుర్తుచేశారు.

ఈ ప్రాంతంలో గొప్ప కమ్యూనిస్టు నాయకున్ని కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన మృతి సీపీఐ(ఎం)కు, ప్రజాసంఘాలకు తీరనిలోటన్నారు. వారి కుటుంబాకి సంతాపం, సానుభూతి తెలిపారు. అనంతరం జరిగిన అంతిమయాత్రలో వారు పాల్గొని కాంతారెడ్డికి విప్లవ జోహార్లర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, నల్లగొండ మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి, సీపీఐ(ఎం) సూర్యాపేట జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి, నల్లగొండ జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ములకలపల్లి రాములు, జిల్లా కమిటీ సభ్యులు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, కొలిశెట్టియాదగిరిరావు, నెమ్మాది వెంకటేశ్వర్లు, దేవరం వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల కాంతారెడ్డి మరణం పట్ల సీపీఐ(ఎం) సంతాపం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ సాయుధ పోరాట యోధులు, సీపీఐ(ఎం) ఉమ్మడి నల్లగొండ జిల్లా సీనియర్ నాయకులు ఉప్పల కాంతారెడ్డి సోమవారం మునగాలలో మరణించారు. వారి మరణం పట్ల సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, సీపీఐ(ఎం) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాస్‌రావు సంతాపాన్ని తెలిపారు. ఆయన మరణం బాధాకరమని పేర్కొన్నారు. సాయుధ రైతాంగ పోరాటంలో ఎన్నో నిర్బంధాలను, జైలు జీవితాలను అనుభవించారని తెలిపారు. జమీందారులకు వ్యతిరేకంగా ఆయన అనేక పోరాటాలు నిర్వహించారని గుర్తుచేశారు.భూమిలేని పేదలనీ కూడగట్టి ఎన్నో భూపోరాటాలు నిర్వహించారని తెలిపారు.అనేక గ్రామాల్లో పేదలకు భూములు పంచారని పేర్కొన్నారు. కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో సీపీఐ(ఎం) ను బలోపేతం చేశారని గుర్తుచేశారు. కాంతారెడ్డి 2001 వరకు పార్టీ జిల్లా కమిటీ సభ్యులుగా పనిచేస్తూ, ప్రజా సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహించారని తెలిపారు. కాంతారెడ్డి మరణం ప్రజాఉద్యమాలకు తీరని లోటనీ, వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలుపుతున్నట్టు పేర్కొన్నారు.

బరితెగించారు

(మొదటిపేజీ తరువాయి)

ఫాసిస్ట్ మతోన్మాదులుగా అభివర్ణించారు. భద్రతా దళాలు ఈ అల్లర్లను నిర్దాక్షిణ్యంగా అణచివేయాలని ఆదేశాలు జారీచేశారు. 'వారు చేసిన పని వర్ణించలేం. దోషులు శిక్ష అనుభవించాల్సిందే'నని పేర్కొన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో లూలాకు 50.9శాతం ఓట్లు లభించగా, బోల్సొనారోకు 49.1శాతం వచ్చాయి. ఎన్నికల ఫలితాలను అంగీకరించడానికి బోల్సొనారో నిరాకరిస్తున్నారు. దేశంలోని కోర్టులు, ఎన్నికల వ్యవస్థలు తనకు వ్యతిరేకంగా పనిచేశాయని ఆయన ఆరోపిస్తున్నారు.



ప్రజాస్వామ్య సంప్రదాయాలను గౌరవించాలి : ప్రధాని మోడీ

బ్రెజిల్‌లో చోటుచేసుకున్న అల్లర్లను ప్రపంచ దేశాల నేతలు ఖండించారు. భారత ప్రధాని మోడీ బ్రెజిల్‌లో అల్లర్లపై స్పందించారు. బ్రెజిల్‌లోని ప్రభుత్వ భవనాల విధ్వంసం వార్తలు ఆందోళనకు గురిచేస్తున్నాయని అన్నారు. ప్రజాస్వామ్య సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని సూచించారు. బ్రెజిల్ అధికారులకు తమ పూర్తి మద్దతు ఉంటుందని చెప్పారు. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ వీటిపై స్పందిస్తూ, "శాంతియుత అధికార మార్పిడి, ప్రజాస్వామ్యంపై జరిగిన దాడిని ఖండిస్తున్నా. బ్రెజిల్‌లోని ప్రజాస్వామ్య వ్యవస్థలకు మా మద్దతు ఉంటుంది. ఆ దేశ ప్రజల ఆకాంక్షలను అణగదొక్కకూడదు. నేను భవిష్యత్తులో లూలాతో కలిసి పనిచేయడంపై దృష్టి పెట్టాను" అని ట్వీట్ చేశారు. ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రస్ ఈ దాడులను ఖండించారు. బ్రెజిల్ ప్రజల ఆకాంక్షలను గౌరవించాలని కోరారు.

ప్రజా ప్రభుత్వాన్ని కూల్చే ప్రయత్నం : ఆల్ ఇండియా పీస్, సాలిడారిటీ ఆర్గనైజేషన్

బ్రెజిల్‌లో అల్లరి మూకల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఇటీవల ఎన్నికైన అధ్యక్షుడు లూలా ప్రభుత్వాన్ని అస్థిరపరిచే ప్రయత్నమిది. జాతీయ కాంగ్రెస్, న్యాయ వ్యవస్థను ఆక్రమించే ప్రయత్నం చేశారు. ఇటీవలి అధ్యక్ష ఎన్నికల్లో బోల్సొనారో ఓటమి చెందారు. దీనిని జీర్ణించుకోలేక బోల్సొనారో తన మద్దతుదారుల్ని అధికార కార్యాలయాలపైకి అల్లరి మూకల్ని ఉసిగొల్పుతున్నారు. రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని కూల్చేందుకు అల్లరి మూకలు ప్రయత్నించాయి. అధ్యక్షుడు లూలా, ఆయన యంత్రాంగం తగినవిధంగా జోక్యం చేసుకొని కుట్రలను భంగం చేసింది. ప్రజా అనుకూల విధానాలతో అధికారంలోకి వచ్చిన లూలాను గద్దె దించాలని కొంతమంది కుట్రలకు తెరలేపారు. ప్రజాస్వామ్యంపై ఇలాంటి దాడులను అందరూ ఖండిచాలని కోరుతున్నామని ఆల్ ఇండియా పీస్, సాలిడారిటీ ఆర్గనైజేషన్ ఒక ప్రకటనలో తెలిపింది.

కామారెడ్డి మాస్టర్ ప్లాన్‌పై రిట్

నవతెలంగాణ-హైదరాబాద్

కామారెడ్డి మున్సిపాలిటీ మాస్టర్ ప్లాన్ ముసాయిదాను సవాల్ చేస్తూ హైకోర్టులో రిట్ దాఖలైంది. ప్రభుత్వ వైఖరిని నిమిత్తం విచారణ ఈ నెల 11వ తేదీన జరుపుతామని జస్టిస్ పి.మాధవీదేవి చెప్పారు. అదే జిల్లాలోని రామేశ్వరపల్లికి చెందిన శ్రీనివాస్‌సింగ్ ఇతర రైతులు దాఖలు చేసిన రిట్‌లో తమ 250 ఎకరాలను రిక్రియేషన్ జోన్‌గా చూపడం అన్యాయమని పేర్కొన్నారు. పక్కనే రాజకీయ నేతల భూములు ఉన్నా వాటి జోలికి వెళ్లలేదన్నారు. తమకు తెలియజేయకుండానే కామారెడ్డి మున్సిపాలిటీ తమ భూములు రిక్రియేషన్ జోన్‌లో ఉన్నట్లుగా తీర్మానం చేసిందన్నారు. మున్సిపాలిటీలో తమ గ్రామం 2019లో విలీనం చేశారనీ, 2022 లో మున్సిపాలిటీ తీర్మానం చేసిందని గత నవంబర్‌లో మాస్టర్ ప్లాన్‌ను పేపర్లల్లో పబ్లిష్ చేశారని తెలిపారు. ఇదే తరహా రిట్ వేసినట్లు ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ చెప్పారు. వ్యక్తిగత హోదాలో వాదించేందుకు అనుమతి కోరారు. వాదనలు 11న జరుగనున్నాయి.

80 శాతం ఆదాయం!

- మహిళల ఐపీఎల్ ఫ్రాంచైజీలకు బీసీసీఐ ఆఫర్
- జనవరి 16న మీడియా హక్కుల వేలం

నవతెలంగాణ-ముంబయి

మహిళల ఐపీఎల్‌ను లాభదాయకంగా తీర్చిదిద్దేందుకు, జట్లను కొనుగోలు చేసేందుకు ఆసక్తి కలిగిన సంస్థలను ఆకర్షించేందుకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఆసక్తికర ఫార్ములాను తీసుకొచ్చింది. మహిళల ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)ను ఈ ఏడాది నుంచి ఆరంభం కానుంది. జట్ల కొనుగోలుకు సంబంధించి ఐటీటీ కొనుగోలుకు జనవరి 21 వరకు గడువు ఉండగా.. ఆదాయ పంపిణీ ఫార్ములా వెల్లడించి వేలం ప్రక్రియలో పోటీ వాతావరణం తీసుకొచ్చేందుకు బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది.

ఐదేండ్లు 80శాతం : మహిళల ఐపీఎల్ ఐదు జట్లతో ఆరంభం కానుంది. మూడేండ్ల తర్వాత ఆరు జట్లతో లీగ్‌ను నిర్వహిస్తారు. తొలి ఐదేండ్ల పాటు 2023-27 వరకు లీగ్ ఆదాయంలో 80 శాతం వాటాను ఫ్రాంచైజీలకు పంచుతారు. కేవలం 20 శాతం ఆదాయం వాటానే బోర్డు తీసుకుంటుంది. 2028-32 ఐదేండ్ల కాలంలో ఆదాయం పంపిణీ 60-40 శాతంగా ఉండనుంది. ఫ్రాంచైజీలకు 60 శాతం ఆదాయం, బోర్డుకు 40 శాతం ఆదాయం దక్కనుంది. 2033 నుంచి ఫ్రాంచైజీలు, బీసీసీఐ 50-50 ఆదాయం సమానంగా పంచుకోనున్నాయి. ఐపీఎల్ ఆరంభంలో సైతం బీసీసీఐ ఇటువంటి నిర్ణయాలే తీసుకుని విజయవంతమైంది.

ఆటగాళ్ల వేలం : మార్చి తొలి వారంలో మహిళల ఐపీఎల్ ఆరంభం కానుందని చెప్పవచ్చు. ఇందుకోసం ఓ వైపు ఫ్రాంచైజీల వేలం ప్రక్రియ నడుస్తుండగా, మరో వైపు ఆటగాళ్ల వేలం ప్రక్రియను బోర్డు మొదలుపెట్టింది. క్యాప్‌డ్, అన్‌క్యాప్‌డ్ విభాగాల్లో దేశవాళీ క్రికెటర్లను రెండు కేటగిరీలుగా విభజించింది. క్యాప్‌డ్ విభాగం క్రికెటర్ల కనీస ధరను మూడు విభాగాలుగా చేసింది. రూ. 50 లక్షలు, రూ.40 లక్షలు, రూ.30 లక్షలు కనీస ధరగా ఉండనున్నాయి. ఇక అన్‌క్యాప్‌డ్ క్రికెటర్లకు రెండు విభాగాల్లో కనీస ధర నిర్ణయించారు. రూ. 20 లక్షలు, రూ.10 లక్షలుగా కనీస ధర తేల్చారు. మహిళల ఐపీఎల్ ఆటగాళ్ల వేలం రూ.10 లక్షల కనీస ధర నుంచి ఆరంభం కానుంది. ఇక వేలంలో ఫ్రాంచైజీలకు అందుబాటులో ఉన్న మొత్తంపై బోర్డు నుంచి స్పష్టత రావాల్సి ఉంది. వేలంలోకి రావాలనుకునే క్రికెటర్లు జనవరి 26 లోగా బీసీసీఐ వద్ద పేర్లను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ మేరకు క్రికెటర్లకు బోర్డు నుంచి సమాచారం వెళ్లింది. క్రికెటర్ల పేరు నమోదు అంశంలో రాష్ట్ర క్రికెట్ సంఘాలతోనే బోర్డు సంప్రదింపులు జరుపుతుందని.. క్రికెటర్ల ఏజెంట్లు, మేనేజర్లతో సమాచారం పంచుకోదని బీసీసీఐ స్పష్టం చేసింది.

జనవరి 16న..! : మహిళల ఐపీఎల్ మార్కెట్ స్థాయిని, ఫ్రాంచైజీల వేలంలో జట్ల ధరను ప్రభావితం చేసే అంశం మీడియా హక్కుల వేలం. జనవరి 12న మహిళల ఐపీఎల్ మీడియా హక్కుల వేలం నిర్వహించాల్సి ఉంది. కానీ బోర్డు దీన్ని ఓ నాలుగు రోజులు వాయిదా వేసింది. జనవరి 16న మీడియా హక్కులకు వేలం నిర్వహించనున్నారు. ఐదు జట్లు గ్రూప్ దశలో డబుల్ రౌండ్ రాబిన్ పద్దతిలో ఆడనున్న లీగ్‌ను ప్రసారదారులు ఎంత మొత్తానికి బిడ్ చేస్తారనే ఆసక్తి సర్వత్రా కనిపిస్తోంది. ఫ్రాంచైజీల ఆదాయ పంపిణీలో కీలక వాటా మీడియా హక్కుల నుంచే రానుండటంతో.. ఇది ఐపీఎల్ జట్ల కొనుగోలుపై ప్రభావం చూపనుంది.

హైదరాబాద్ నిలిచేనా?

- నేటి నుంచి సౌరాష్ట్రతో రంజీ పోరు

హైదరాబాద్ : రంజీ ట్రోఫీలో నిలకడగా చెత్త ప్రదర్శన చేస్తున్న హైదరాబాద్ నేడు మరో సవాల్‌కు సిద్ధమైంది. ఎలైట్ గ్రూప్-బిలో అగ్రస్థానంలో నిలిచిన సౌరాష్ట్రతో హైదరాబాద్ తలపడనుంది. సౌరాష్ట్ర నాలుగు మ్యాచుల్లో రెండు విజయాలు, రెండు డ్రాలతో జోరుమీదుండగా.. హైదరాబాద్ నాలుగు మ్యాచుల్లో ఏకంగా మూడింట పరాజయాలు చవిచూసింది. సొంతగడ్డపై జరుగుతున్న రంజీ మ్యాచ్‌లో పచ్చిక పిచ్ సిద్ధం చేశారు. బ్యాటర్లు, బౌలర్లు సమిష్టిగా రాణించకపోవటం హైదరాబాద్‌కు ప్రతికూలంగా మారుతోంది. తన్మయ్ అగర్వాల్, రవితేజ, రోహిత్ రాయుడు, కార్తికేయలు హైదరాబాద్‌కు కీలకం కానున్నారు. సౌరాష్ట్ర, హైదరాబాద్ రంజీ మ్యాచ్ నేడు ఉదయం 9.30 గంటలకు ఆరంభం కానుంది.

రూ. 130 కోట్లు

డిస్కౌంట్ ఇవ్వరూ!

- బోర్డుకు స్టార్ ఇండియా వినతి

నవతెలంగాణ-ముంబయి :

భారత క్రికెట్ స్పాన్సర్‌షిప్ సమస్యలు ఎదుర్కొంటుంది. ఐపీఎల్ మీడియా హక్కుల రూపంలో కనివినీ ఎరుగని మొత్తాన్ని ఖాతాలో వేసుకున్న బీసీసీఐ.. జాతీయ జట్టు స్పాన్సర్‌షిప్‌లను చవిచూడటం కాస్త విడ్డూరమే. జాతీయ జట్టు జెర్సీ భాగస్వామి, కిట్ స్పాన్సర్‌గా ఎంపీఎల్ సంస్థ తన హక్కులను కెకెపీఎల్ (కిల్లర్)కు బదలాయించిన సంగతి తెలిసిందే. ప్రసారదారు స్టార్ ఇండియా, జెర్సీ స్పాన్సర్ బైజూస్‌లు ఇప్పుడు బోర్డుకు తలనొప్పిగా మారాయి!.

రూ.130 కోట్లు తగ్గించండి : 2018-23 ఐదేండ్ల కాలానికి భారత అంతర్జాతీయ, దేశవాళీ క్రికెట్ సీజన్‌కు స్టార్ ఇండియా రూ.6138.1 కోట్లు వెచ్చించింది. ఈ ఏడాది మార్చితో ఐదేండ్ల ఒప్పందానికి తెరపడనుంది. ఈ సమయంలో కోవిడ్-19 మహమ్మారి దెబ్బకు పలు మ్యాచులు, సిరీస్‌లు రీ షెడ్యూల్ చేయాల్సి వచ్చింది. దీంతో ఐదేండ్ల ఒప్పంద మొత్తం నుంచి రూ.130 కోట్లు తగ్గించాలని బీసీసీఐకి స్టార్ ఇండియా లేఖ రాసింది. ఐపీఎల్ మీడియా హక్కులు రూ.48,390 కోట్లకు అమ్ముడుపోవటంతో రానున్న ఐదేండ్లకు జాతీయ జట్టు మీడియా హక్కులకు సైతం బోర్డు కాసుల వర్షం ఆశిస్తోంది.

ఆ సొమ్ము తీసేసుకోండి! : ఇక జాతీయ జట్టు జెర్సీ పార్ట్‌నర్‌గా బైజూస్ ఒప్పందం 2022 నవంబర్‌లోనే ముగిసింది. అయినా, 2023 నవంబర్‌కు రూ. 300 కోట్లకు బైజూస్ ఒప్పందం పొడగించుకుంది. రూ.140 కోట్లను బ్యాంక్ గ్యారంటీ రూపంలో చెల్లించగా, రూ.160 కోట్లను వాయిదాలు చెల్లించాల్సి ఉంది. ఆన్‌లైన్ ఎడ్యుటెక్ కంపెనీగా కోవిడ్-19 సమయంలో లాభాలు గడించిన బైజూస్.. ఇప్పుడు ఉద్యోగులను తొలగించేందుకు సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో భారత క్రికెట్‌తో బంధానికి ముగింపు పలకాలని భావిస్తోంది. ఒప్పంద సమయానికి ముందే తప్పుకోవాల్సి వచ్చినందుకు బ్యాంకు గ్యారంటీగా చెల్లించిన రూ.140 కోట్లను తీసుకోవాల్సిందిగా బోర్డుకు లేఖ రాసింది.

అపెక్స్ కౌన్సిల్‌లో చర్చ : సోమవారం వర్చువల్ సమావేశంలో అపెక్స్ కౌన్సిల్ ఈ అంశంపై సుదీర్ఘంగా చర్చించింది. సుమారు రెండు గంటల పాటు భేటీ అయిన అపెక్స్ కౌన్సిల్ స్టార్ ఇండియా, బైజూస్ అంశాలపై ఎలా ముందుకు సాగాలని చర్చించారు. ఆర్థిక సంబంధ అంశాలు కావటంతో అన్ని కోణాల్లో బోర్డు ఈ సమస్యను చర్చించింది. త్వరలోనే స్టార్ ఇండియా, బైజూస్‌లతో స్నేహపూర్వకంగా ఒప్పందాలు ముగించే దిశగా నిర్ణయం తీసుకునే అవకాశం కనిపిస్తోంది.

బుమ్రా అవుట్

శ్రీలంకతో వన్డే సిరీస్‌కు దూరం



ముంబయి : భారత పేస్ దళపతి జస్‌ప్రీత్ బుమ్రా శ్రీలంకతో వన్డే సిరీస్‌కు దూరమయ్యాడు. ఫిట్‌నెస్ లేమితో తొలుత శ్రీలంకతో వన్డేలకు బుమ్రాను ఎంపిక చేయలేదు. ఎన్‌సీఏ నివేదికతో బుమ్రాను వన్డే జట్టులో చేర్చారు. కానీ, మరోసారి బుమ్రాను తొందరపాటుగా ప్రయోగించటంపై బోర్డు పునరాలోచన చేసింది. పూర్తి స్థాయి బౌలింగ్‌కు బుమ్రాకు మరింత సమయం పట్టే అవకాశం ఉంది. దీంతో శ్రీలంకతో వన్డే సిరీస్‌కు అతడిని దూరం పెట్టింది. జనవరి 18 నుంచి ఆరంభం కానున్న న్యూజిలాండ్‌తో సిరీస్‌కు ఎంపిక చేస్తారా? లేదా అనేది ఆసక్తిగా మారింది. ఆస్ట్రేలియాతో టెస్టు సిరీస్ సమయానికి బుమ్రా పూర్తి ఫిట్‌నెస్ సాధించే అవకాశం ఉందని తెలుస్తోంది.

మిషన్ 2023. స్వదేశంలో జరుగనున్న ఐసీసీ వన్డే వరల్డ్‌కప్‌కు టీమ్ ఇండియా సన్నద్ధత షురూ. అక్టోబర్‌లో మెగా ఈవెంట్‌కు ముందు 15 వన్డేల్లోనే ఆడనున్న భారత్.. అన్ని విభాగాల్లో మ్యాచ్ విన్నర్లను సిద్ధం చేసేందుకు తయారవుతుంది. శ్రీలంకతో వన్డే సిరీస్‌తో భారత్ మిషన్ 2023 పట్టాలెక్కనుంది. భారత్, శ్రీలంక తొలి వన్డే నేడు.

మిషన్ 2023

- వన్డే వరల్డ్‌కప్ సన్నద్ధత షురూ
- భారత్, శ్రీలంక తొలి వన్డే నేడు
- మధ్యాహ్నం 1.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..



నవతెలంగాణ-గువహటి

వరుసగా మూడు ప్రపంచకప్‌లలో పేలవ ప్రదర్శన చేసిన భారత జట్టు.. ఈ ఏడాది సొంతగడ్డపై జరుగనున్న 2023 ఐసీసీ వన్డే వరల్డ్‌కప్‌కు మెరుగైన ప్రణాళికలతో సిద్ధం కానుంది. వన్డే వరల్డ్‌కప్ కోసం 20 మంది ఆటగాళ్లతో రోడ్‌మ్యాప్ సిద్ధం కాగా.. నేడు శ్రీలంకతో వన్డే సిరీస్‌తో మిషన్ 2023 షురూ కానుంది. కాగితంపై శ్రీలంక కంటే ఎంతో బలంగా కనిపిస్తున్న భారత్ నిజానికి అంత బలోపేతంగా లేదు. ఇదే సమయంలో శ్రీలంక సైతం మరీ అంత బలహీనంగా కనిపించటం లేదు. టీ20 సిరీస్ తరహాలో భారత్‌కు గట్టి సవాల్ విసిరేందుకు శ్రీలంక సిద్ధమవుతుండగా.. సీనియర్ ఆటగాళ్లు గాడిలో పడాలనే లక్ష్యంతో భారత్ రెడీ అయ్యింది. నేడు గువహటిలో భారత్, శ్రీలంక తొలి వన్డే పోరు.

ఆ ఇద్దరు మెరవాలని..!



శ్రీలంకపై విరాట్ కోహ్లికి తిరుగులేని రికార్డుంది. లంకేయులపై 17 ఫిఫ్టీ ప్లస్ ఇన్నింగ్స్‌లు నమోదు చేసిన కోహ్లి.. ఆ జట్టుపై 46 ఇన్నింగ్స్‌ల్లో 2220 పరుగులు పిండుకున్నాడు. ఇటీవల బంగ్లాదేశ్‌పై శతకంతో ఈ ఫార్మాట్‌లో ఫామ్ అందుకున్న విరాట్ స్వదేశీ వైట్‌బాల్ సీజన్‌ను మెగా ఇన్నింగ్స్‌తో మొదలు పెట్టాలని అనుకుంటున్నాడు. కెప్టెన్ రోహిత్ శర్మ ఈ మధ్య పేలవంగా రాణిస్తున్నాడు. బొటన వేలికి గాయంతో బంగ్లాతో పోరాడిన ఇన్నింగ్స్ మినహా ఇటీవల రోహిత్ పెద్దగా ఆకట్టుకోలేదు. టాప్ ఆర్డర్‌లో రోహిత్ శర్మ గాడిలో పడితే సమస్యలకు చెక్ పెట్టవచ్చు. బంగ్లాదేశ్‌పై డబుల్ సెంచరీ బాదిన ఇషాన్ కిషన్ నేడు బెంచ్‌కు పరిమితం కావాల్సిందే!. రోహిత్ తోడుగా శుభ్‌మన్ గిల్ ఇన్నింగ్స్ ఆరంభించనున్నాడు. కెఎల్ రాహుల్ వికెట్ కీపర్‌గా మిడిల్ ఆర్డర్‌లో బ్యాటింగ్ చేయనున్నాడు. భీకర ఫామ్‌లో ఉన్న సూర్యకుమార్ యాదవ్ తుది జట్టులో చోటు కోసం ఫామ్‌లో శ్రేయస్ అయ్యర్‌తో పోటీపడుతున్నాడు. ఈ ఇద్దరిలో ఎవరు ఆడతారో చూడాలి. బౌలింగ్ విభాగంలో మహ్మద్ సిరాజ్, మహ్మద్ షమిలకు తోడుగా అర్షదీప్ సింగ్, ఉమ్రాన్ మాలిక్‌లో ఒకరు తుది జట్టులో నిలువనున్నారు. స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ సైతం చైనామన్ కుల్దీప్ యాదవ్ నుంచి పోటీ ఎదుర్కొంటున్నాడు.

పోటీ ఇవ్వగలదా?!

శ్రీలంక గత పది వన్డేల్లో గణనీయంగా మెరుగుపడింది. చివరి 10 వన్డేల్లో ఆరు విజయాలు సాధించింది. స్వదేశంలో ఆస్ట్రేలియాపై సిరీస్ విజయం సాధించిన ఉత్సాహం శ్రీలంక శిబిరంలో కనిపిస్తోంది. కెప్టెన్ శనక బాధ్యతలు అందుకున్న తర్వాత శ్రీలంక ఈ ఫార్మాట్‌లో మెరుగైన ప్రదర్శన చేస్తోంది. వన్డేల్లో శనకకు చెప్పుకోదగిన రికార్డు లేదు. అయినా, టీ20 ఉత్సాహంతో ఇక్కడా చివర్లో మెరుపుల కోసం ఎదురుచూస్తున్నాడు. కుశాల్ మెండిస్, అసలంక, నిశాంక, ధనంజయ డిసిల్వ, అవిష్క ఫెర్నాండో బ్యాటింగ్ విభాగంలో కీలకం. రజిత, తీక్షణ, హసరంగలు బంతితో భారత్‌కు సవాల్ విసరనున్నారు.

పిచ్, వాతావరణం

గువహటిలో ఇది రెండో వన్డే మ్యాచ్. 2018 వన్డేలో వెస్టిండీస్ 322/8 పరుగులు చేయగా, భారత్ 43వ ఓవర్లోనే ఛేదించింది. ఇది పరుగుల పిచ్ అని చెప్పవచ్చు. మంగళవారం మ్యాచ్‌కు ఎటువంటి వర్షం సూచనలు లేవు. టాస్ నెగ్గిన జట్టు తొలుత బౌలింగ్ ఎంచుకునే అవకాశం కనిపిస్తోంది.

తుది జట్లు (అంచనా) :

భారత్ : రోహిత్ శర్మ (కెప్టెన్), శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లి, కెఎల్ రాహుల్ (వికెట్ కీపర్), సూర్యకుమార్/శ్రేయస్ అయ్యర్, హార్దిక్ పాండ్య, అక్షర్ పటేల్, చాహల్/కుల్దీప్ యాదవ్, మహ్మద్ సిరాజ్, మహ్మద్ షమి, అర్షదీప్ సింగ్/ఉమ్రాన్ మాలిక్.

శ్రీలంక : కుశాల్ మెండిస్ (వికెట్ కీపర్), నిశాంక, అవిష్క ఫెర్నాండో, ధనంజయ డిసిల్వ, చరిత్ అసలంక, దశున్ శనక (కెప్టెన్), వానిందు హసరంగ, చామిక కరుణరత్నె, మహీశ్ తీక్షణ, కసున్ రజిత, లహిరు కుమార.

ఆకట్టుకుంటున్న 'బుట్ట బొమ్మ' మొదటి పాట 'పేరు లేని ఊరులోకి'



అనిక సురేంద్రన్, సూర్య వశిష్ఠ, అర్జున్ దాస్ నటిస్తున్న 'బుట్ట బొమ్మ' చిత్రం నుంచి మొదటి పాట 'పేరు లేని ఊరులోకి' విడుదలైంది. స్వీకర్ అగస్తి స్వరపరిచిన ఈ పాటను సనాపతి భరద్వాజ్ పాత్రుడు రచించగా, మోహన భోగరాజు ఆలపించారు.

ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్‌తో కలిసి ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మిస్తున్న ఫీల్ గుడ్ రూరల్ డ్రామా 'బుట్ట బొమ్మ'. అనిక సురేంద్రన్, సూర్య వశిష్ఠ, అర్జున్ దాస్ ప్రధాన పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి నూతన దర్శకుడు శౌరి చంద్రశేఖర్ రమేష్ దర్శకత్వం వహిస్తున్నారు.

స్వీకర్ అగస్తి సంగీతం అందిస్తున్న ఈ చిత్రం నుంచి మోహన భోగరాజు ఆలపించిన 'పేరు లేని ఊరులోకి' అనే మొదటి పాట ఈరోజు విడుదలైంది.

పాటలోని ప్రశాంతమైన పరిసరాలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. అవి మనల్ని పాత్రల యొక్క చిన్న ప్రపంచంలోకి తీసుకువెళ్తున్నాయి. 'అంకె మారి లంకె వేసే కొత్త సంఖ్య వచ్చిందా..

నవ్వులన్నీ మూటగట్టి మోసుకొస్తూ ఉందా', 'అలుపు సలుపు అణువంత కూడా తల దాచుకోని చురుకంతా.. తన వెంటపడుతూ నిమిషాలు మెల్లగా కరిగే ప్రతి పూట' అంటూ సనాపతి భరద్వాజ్ పాత్రుడు అందించిన సాహిత్యం పాట సందర్భానికి తగ్గట్టుగా అర్థవంతంగా, ఆకట్టుకునేలా ఉంది. గీత రచయిత ఏమంటున్నారంటే...

ఈ పాట రాయడానికి ప్రధాన ప్రేరణ, దర్శకులు రమేష్ గారు నన్ను నాకంటే ఎక్కువ నమ్మడమే. ఇంత మంచి అవకాశాన్ని నాకు ఇచ్చినందుకు ఆయనకు నా ధన్యవాదాలు.

స్వీకర్ అగస్తి గారి ట్యూన్స్ చాలా సహజంగా, క్యాచీగా ఉంటాయి అన్నారు. స్వీకర్ అగస్తీ అందించిన ఆకర్షణీయమైన సంగీతం, మోహన భోగరాజు అద్భుతమైన స్వరం కలిసి పాటను ఎంతో అందంగా మలిచాయి.

'వాల్తేరు వీరయ్య' ప్రతి ఒక్కరిని అలరించే కమర్షియల్ ఎంటర్‌టైనర్.. : చిరంజీవి



వాల్తేరు వీరయ్య సూపర్ డూపర్ బ్లాక్ బస్టర్ కాబోతుంది : రవితేజ మెగాస్టార్ చిరంజీవి, మాస్ మహారాజా రవితేజ, దర్శకుడు బాబీ కొల్లి (కెఎస్ రవీంద్ర)ల మోస్ట్ ఎవైటెడ్ మూవీ 'వాల్తేరు వీరయ్య' అభిమానులకు, ప్రేక్షకులకు థియేటర్లలో పూనకాలు తెప్పించడానికి సిద్ధంగా ఉంది. చిరంజీవి సరసన శృతి హాసన్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై రవిశంకర్ భారీ స్థాయిలో నిర్మించారు. మెగాస్టార్ చిరంజీవి, మాస్ మహారాజా రవితేజల పాత్రల ఇంట్రడక్షన్ గ్లింప్సెస్‌తో పాటు.. ఇద్దరూ కలసి అలరించిన పూనకాలు లోడింగ్ పాటకు బ్లాక్ బస్టర్ రెస్పాన్స్ వచ్చింది. రాక్ స్టార్ దేవిశ్రీ ప్రసాద్ అందించిన ఆల్బమ్‌లోని బాస్ పార్టీ, నువ్వు శ్రీదేవి నేను చిరంజీవి... వాల్తేరు వీరయ్య టైటిల్ ట్రాక్ బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ హిట్స్‌గా నిలిచాయి. ఇక తాజాగా విడుదలైన వాల్తేరు వీరయ్య ట్రైలర్ ప్రేక్షకులకు పూనకాలు తెప్పించింది. ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తున్న 'వాల్తేరు వీరయ్య' జనవరి 13న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదలౌతున్న నేపథ్యంలో చిత్ర యూనిట్ వైజాగ్ లో మెగామాస్ ప్రీరిలీజ్ ఈవెంట్‌ను మాసీవ్ గా నిర్వహించింది. భారీ ఎత్తున తరలివచ్చిన అభిమానుల సమక్షంలో మాస్ జాతరలా జరిగిన మెగామాస్ ఈవెంట్ గ్రాండ్ సక్సెస్ అయ్యింది.మెగాస్టార్ చిరంజీవి మాట్లాడుతూ.. బాబీ వాల్తేరు వీరయ్య అనే టైటిల్ తో కథ చెప్పినపుడు వినగానే అద్భుతం అనిపించింది. షేక్ హ్యాండ్ ఇచ్చి 'ఈ సినిమా తప్పకుండా చేస్తున్నాం" అని అప్పుడే చెప్పాను. ఫస్ట్ హియరింగ్ లోనే చాలా బావుంది అనుకునే కథలు నా కెరీర్ లో సూపర్ డూపర్ హిట్స్ అయ్యాయి. ఆ నమ్మకంతో చెబుతున్నాను.. వాల్తేరు వీరయ్య చాలా బాగా ఆడుతుంది అన్నారు. ప్రతి ఒక్కరిని అలరించే సినిమా వాల్తేరు వీరయ్య. బాబీలో కథకుడు, రచయిత, స్క్రీన్ ప్లే రైటర్, డైరెక్టర్ కనిపిస్తారు. ఆ తర్వాతే తనలో అభిమానిని చూస్తాను. అభిమాని అని సినిమా ఇవ్వలేదు. అతని ప్రతిభ అద్భుతమనే ఈ సినిమాని ఇచ్చాను. నా నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ అనుకున్నదాని కంటే గొప్పగా సినిమాని తీశాడు. ఒక కమర్షియల్ సినిమాలో ఏ ఎలిమెంట్స్ కావాలో అన్నీ చక్కగా పొందుపరిచాడు అన్నారు. మాస్ మహారాజా రవితేజ మాట్లాడుతూ.. వాల్తేరు వీరయ్య నటీనటులకు, సాంకేతిక నిపుణలందరికీ కంగ్రాట్స్. ఎందుకంటే సినిమా బ్లాక్ బస్టర్. పూనకాలు లోడింగ్. చిరంజీవి గారితో నా జర్నీ మొదలైయింది విజయవాడ నుంచి. విజేత వేడుక విజయవాడలో జరిగినప్పుడు .. చిరంజీవి గారిని చాలా దూరం నుంచి చూశాను. అప్పుడే మా ఫ్రండ్స్ తో ఏదో ఒక రోజు .. ఆయన పక్కన కూర్చుంటానని చెప్పాను. అక్కడ నుండి మొదలైతే మొదట ఫ్రండ్ క్యారెక్టర్, తర్వాత తమ్ముడి క్యారెక్టర్.. ఇప్పుడు వాల్తేరు వీరయ్య. చిరంజీవి గారితో వున్న ప్రతి మూమెంట్ చాలా గర్వంగా వుంటుంది. సక్సెస్ మీట్ లో మళ్ళీ కలుద్దాం" అన్నారు.

'శాకుంతలం' విజువల్ వండర్‌లో వర్క్ చేయటం నా అదష్టం : సమంత



అద్భుతమైన విజువల్స్, భారీ బడ్జెట్‌తో సినిమాలను రూపొందించే ఎపిక్ ఫిల్మ్ మేకర్ గుణ శేఖర్ సిల్వర్ స్క్రీన్‌పై ఆవిష్కరిస్తోన్న అద్భుతమైన పౌరాణిక దృశ్య కావ్యం శాకుంతలం'. ఇండియన్ సినీ ప్రేక్షకులు 2023లో చూడాలనుకుని ఆసక్తిగా ఎదురు చూస్తోన్న విజువల్ వండర్‌గా శాకుంతలం తనదైన ప్రత్యేకతను సంపాదించుకుంది. అందాల సుందరి సమంత ఇందులో టైటిల్ పాత్రలో నటించారు. ఇండియన్ స్క్రీన్‌పై ఇప్పటి వరకు రాని విధంగా ఈ పౌరాణిక ప్రేమ గాథను భారీ బడ్జెట్‌తో ప్రతిష్టాత్మకంగా గుణశేఖర్ రూపొందిస్తున్న విషయం తెలిసిందే. స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజు సమర్పణలో నీలిమ గుణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఫిబ్రవరి 17న తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో ఈ సినిమా ప్రపంచ వ్యాప్తంగా భారీ ఎత్తున రిలీజ్ కానుంది. సోమవారం ఈ సినిమా ట్రైలర్‌ను తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో... సమంత మాట్లాడుతూ "ఈ క్షణం కోసమే నేను, మా శాకుంతలం టీమ్ ఎదురు చూస్తున్నాం. ఎలాగైనా ఇక్కడకు రావాలని ఫిక్స్ అయిపోయి బలం తెచ్చుకుని వచ్చాను. గుణ శేఖర్‌గారిపై ఉన్న రెస్పెక్ట్, అభిమానం వల్ల వచ్చాను. ఆయనకు సినిమానే జీవితం. ప్రతి సినిమాను ప్రాణం పెట్టి తీస్తారు. ఈ సినిమాను కూడా అలాగే తీశారు. నెరేషన్ విన్నప్పుడూ యాక్టర్స్ అందరూ సినిమా అలాగే రావాలని కోరుకుంటారు. కొన్నిసార్లు మాత్రమే మా ఊహను దాటి ఎక్స్‌ట్రా మ్యాజిక్ జరుగుతుంది. సినిమా చూసిన తర్వాత నేను చూసిన తర్వాత నేను అదే ఫీల్ అయ్యాను. నేను ఊహించిన దాని కంటే సినిమా ఎన్నో రెట్లు బావుంది.. అని సమంత అన్నారు. నేను జీవితంలో ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నాను. అయితే మారనది ఒకటే ఉంది. అదే సినిమాను నేను ఎంత ప్రేమిస్తాను.. సినిమా నన్ను ఎంత ప్రేమిస్తుందనే విషయం. శాకుంతలంతో ఈ ప్రేమ మరింత పెరుగుతుందని నమ్ముతున్నాను" అన్నారు.

ఈ నెల 14న 'వారసుడు' విడుదల



'వారసుడు' చిత్రాన్ని ఈ నెల 14న విడుదల చేస్తున్నాం. మన తెలుగు బిగ్గర్ స్టార్స్ చిరంజీవి గారి వాల్తేరు వీరయ్య, బాలకష్ణ గారి వీరసింహారెడ్డి సినిమాలు సంక్రాంతికి గ్రాండ్‌గా విడుదల కావాలనే ఈ నిర్ణయం తీసుకున్నాం. 'వారసుడు' కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్. తెలుగులో పెద్ద విజయం సాధిస్తుందని నిర్మాత దిల్ రాజు చెప్పారు.

దళపతి విజయ్, సక్సెస్ ఫుల్ డైరెక్టర్ వంశీ పైడిపల్లిల భారీ అంచనాల చిత్రం వారసుడు/వారిసు తెలుగు, తమిళంలో సంక్రాంతి కానుకగా గ్రాండ్ రిలీజ్ అవుతుంది. విజయ్ సరసన నేషనల్ క్రష్ రష్మిక మందన్న కథానాయికగా నటించిన ఈ చిత్రాన్ని శ్రీ వేంకటేశ్వర క్రియేషన్స్, పివిపి సినిమా పతాకాలపై ప్రముఖ నిర్మాతలు దిల్ రాజు, శిరీష్, పరమ్ వి పొట్లూరి, పెరల్ వి పొట్లూరి ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు.

మీడియా సమావేశంలో నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ.. సంక్రాంతి వారసుడిగా ఈ చిత్రం 14న విడుదల చేస్తున్నామనీ, తమిళంలో ప్రపంచవ్యాప్తంగా జనవరి 11న విడుదలవుతున్నదని చెప్పారు. ప్రతి థియేటర్ లో ముందు మన తెలుగు బిగ్గర్ స్టార్స్ సినిమాలు పడాలి. అన్నిచోట్ల వారికి థియేటర్లు దొరకాలి. తర్వాతే నా సినిమా ఉండాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నాను. సంక్రాంతి సినిమాలకు మా వారసుడు పోటీ కాదని మొదటి నుండి చెబుతున్నాను. మాది కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్. ప్రేక్షకులకు సంక్రాంతి వారసుడు చేయాలనేదే నా ప్రయత్నం. బాలకష్ణ గారి చిరంజీవి గారి సినిమాలు రెండు తెలుగు రాష్ట్రాలలో పెద్ద రిలీజ్ కావాలి. తర్వాత నా సినిమా రావాలని పాజిటివ్ గానే ఈ నిర్ణయం తీసుకున్నాను. ఈ నిర్ణయం పట్ల ఇండస్ట్రీ పెద్దలు చాలా ఆనందం వ్యక్తం చేశారు. అందరం బావుండాలనే నేను ఎప్పుడూ ఆలోచిస్తుంటానన్నారు.

శ్రీకాంత్ మాట్లాడుతూ.. వారసుడు యునివర్సల్ సినిమా. ఫ్యామిలీ ఎమోషన్స్ అందరికీ కనెక్ట్ అవుతాయి. మన తెలుగు స్టార్స్‌కి గౌరవం ఇస్తూ.. ఇన్ని కోట్లు ఖర్చు చేసి తీసిన సినిమాని 14కు వాయిదా వేయడం నిజంగా గ్రేట్. దిల్ రాజు గారికి హ్యాట్సప్. ఇంత సాహసం ఏ నిర్మాత చేయరు. వారసుడు నా తొలి తమిళ సినిమా. అలాగే దిల్ రాజు గారి బ్యానర్ లో చేయడం కూడా ఇదే ఫస్ట్ టైం. ఈ సినిమా గురించి చెప్పాలంటే విజయ్, వంశీ పైడిపల్లి, దిల్ రాజు గారి గురించి చెప్పాలి. విజయ్ తో సినిమా చేయడం చాలా ఆనందాన్నిచ్చింది. ఒక మంచి ఫ్యామిలీ సబ్జెక్ట్ చేసి చాలా కాలమైయింది. ఈ సినిమా చేయడం చాలా ఆనందంగా వుంది. ఇది తెలుగు సినిమాలానే ఫీలౌతాము. వారసుడు సంక్రాంతికి లేటుగా వచ్చిన లేటెస్ట్ గా వస్తుందని నమ్ముతున్నాను. వారసుడు సూపర్ డూపర్ హిట్ అవుతుంది." అన్నారు.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886